జాతీయ విపత్తుగా ఉత్తరాది వరదలు

- కేంద్రానికి సిపిఎం పొలిట్‌బ్యూరో వినతి
- యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలకు డిమాండ్

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 37 | విజయవాడ, ఆదివారం 7 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 7 September 2025 | Rs



ఉల్లిగడ్డలు రోడ్డుపై పారబోసి రాస్తాకోకో చేస్తున్న రైతులు

2

ఇద్దరు ఉల్లి రైతుల ఆత్మహత్యాయత్నం



గత ఏడాది నిర్వహించిన గ్రామ సభకు హాజరైన జనం (ఫైల్)

బాక్సైట్ ప్రాజెక్టుకు బ్రేక్

ఒడిశాలో నకిలీ గ్రామసభలతో వేదాంత ఆమోదముద్ర

- హైకోర్టు తలంటడంతో దిగొచ్చిన మోడీ సర్కార్
- అనుమతులు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు వెల్లడి

భువనేశ్వర్ : బ్రిటన్‌కు చెందిన మైనింగ్ కంపెనీ వేదాంత ఒడిశాలో తలపెట్టిన బాక్సైట్ మైనింగ్ ప్రాజెక్టుకు బ్రేక్ పడింది. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ స్థానిక గిరిజనులు పెద్దయెత్తున ఆందోళనలు చేపట్టారు. అయితే తమ ప్రాజెక్టుకు ఆదివాసీల సమ్మతి ఉందని, గ్రామసభ సైతం ఆమోదం తెలిపిందని నకిలీ పత్రాలు సృష్టించి పాగా వేసేందుకు వేదాంత కుట్ర పన్నింది. దీనిపై బాధిత గిరిజనం హైకోర్టును ఆశ్రయించడంతో వేదాంత చర్యల పట్ల ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో దిగొచ్చిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఒడిశాలో వేదాంత ప్రాజెక్టుకు తాత్కాలికంగా అనుమతులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

బిజెపికి పెద్ద మొత్తంలో ఎన్నికల విరాళాలు సమర్పించిన శతకోటీశ్వరుడు అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత కంపెనీ ఏడాదికి 90 లక్షల టన్నులు (9 ఎంటిపిఎ) ఉత్పత్తి లక్ష్యంతో ఒడిశాలోని కలహండి, రాయగడ జిల్లాల పరిధిలో 708.20 హెక్టార్ల అటవీ భూమిలో సిజిమాలి బాక్సైట్ ప్రాజెక్టును చేపట్టేందుకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. 2025 ఏప్రిల్‌లో ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖకు దరఖాస్తు చేసింది. అయితే అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం..అటవీ భూములను వేరే అవసరాలకు మార్పు చేయాలంటే స్థానిక గిరిజనులు సమ్మతించాలి. గ్రామంలోని వయోజనులు అందరూ పాల్గొనే గ్రామ సభల్లో ఆమోదం చేయడం తప్పనిసరి. అయితే గ్రామసభలేవీ నిర్వహించకుండానే.. నిర్వహించినట్లు, ఆమోదం కూడా తెలిపినట్లు 'వేదాంత' నకిలీ పత్రాలు సృష్టించింది. గిరిజనేతరులను ప్రాజెక్టు ప్రతిపాదిత గ్రామాలకు తరలించి వారితోనే సభను నిర్వహించి.. ఇదిగో గ్రామసభ నిర్వహించాం. వీరు సమ్మతి కూడా చెప్పారు అంటూ పెద్ద కుట్రలకు తెర లేపారు. ఈ దుర్మార్గపు ఎత్తుగడులపై స్థానిక గిరిజనులు హైకోర్టును ఆశ్రయించారు. ఆదివాసీల మొరను ఆలకించిన ధర్మాసనం స్థానిక ఆదివాసీల ఆమోదం తప్పనిసరి అంటూ, మిగతా 7లో

విద్యార్థులపై పిడిగుద్దులు

- ఎస్ఎఫ్ఐ చలో విజయవాడపై పోలీసుల ఉక్కుపాదం
- పలువురు విద్యార్థినులకు గాయాలు





ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల సమస్యలపై గొంతెత్తిన విద్యార్థులపై రాష్ట్రప్రభుత్వం పోలీసుల చేత పిడిగుద్దుల వర్షం కురిపించింది. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరిన వారిపై కర్కశత్వం ప్రదర్శించి అరెస్టులు చేయించింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జివో 77 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ 'చలో విజయవాడ' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. విజయవాడలో లెనిన్ సెంటర్‌కు చేరుకున్న విద్యార్థులు అక్కడి నుంచి అలంకార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చౌక్‌లోనే ధర్నా చేపట్టారు. అక్కడి నుంచి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు విద్యార్థులు బయలుదేరారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను పోలీసులు అన్ని వైపుల నుంచి ముట్టడించి, ఎటూ వెళ్లనివ్వకుండా బారికేడ్లతో నిర్బంధించారు. వాటిని ఛేదించుకుంటూ విద్యార్థులు క్యాంపు కార్యాలయం వెళ్తుండగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సుమారు గంటపాటు ఆ ప్రాంతమంగా రణరంగంగా మారింది. దొరికిన వారిని దొరికినట్లు పోలీసులు పిడిగుద్దులు గుద్దుతూ, ఈడ్చుకుంటూ పోలీస్ వ్యాన్‌లో ఎత్తిపడేశారు. విద్యార్థినుల పట్ల అమానుషంగా ప్రవర్తించారు. కాళు,చేతులు మెలిపెట్టడంతోపాటు వారి చున్నీలను లాగేశారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నానికి చెందిన విద్యార్థిని కావ్య మోచేయి విరిగింది. విజయవాడకు చెందిన యశస్వి, ఉమా సొమ్మసిల్లి పడిపోయారు. సుమారు 200 మంది విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి, వివిధ స్టేషన్లకు తరలించారు. వారిలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు పి రామ్మోహన్‌రావు, కె ప్రసన్నకుమార్, నాయకులు ఎల్‌జె నాయుడు, వెంకటేష్, రవి, పవిత్ర, జ్యోతి, సమీరా, రాజా తదితరులున్నారు.



దొరికిన వారిని దొరికినట్టు అరెస్టు చేస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో... విద్యార్థిని మెడలో చున్నీ వేసి లాగేస్తున్న పోలీసులు, విద్యార్థి కాలర్ పట్టుకుని గుంజుతున్న పోలీసు అధికారి

విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అంతకుముందు జరిగిన ధర్నాలో విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లిస్తామని మిగతా 7లో

టారిఫ్‌లతో అమెరికా పెత్తనం

- ప్రపంచ దేశాలను బెదిరిస్తున్న ట్రంప్
- ఇండియాను పదేపదే బెదిరిస్తున్నా నోరెత్తని మోడీ
- వామపక్ష పార్టీల నిరసనలో వక్తలు



ధర్నాలో పాల్గొన్న వామపక్షాల నాయకులు వి శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుంకాల పేరుతో పెత్తనం చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని, పదే పదే దేశాన్ని బెదిరిస్తున్నా మోడీ నోరెత్తడం లేదని వామపక్ష పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుంకాల పేరుతో అమెరికా చేస్తున్న పెత్తనాన్ని ఖండిస్తూ దేశ ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యాన విజయవాడ లెనిన్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భారత్‌పై అమెరికా 50 శాతం అదనపు టారిఫ్‌లు పెంచడం అన్యాయమని అన్నారు. దేశంపై పెత్తనం చేయాలని చూస్తుంటే మోడీ కిమ్మనడం లేదని, అటువంటి అన్యాయాలను దేశ పౌరులు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. పలు సందర్భాల్లో ప్రధాని మోడీ అమెరికాకు ట్రంప్‌కు దాసోహమవడం వల్లే అమెరికా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. తనవద్ద ఉన్న ఆయుధాలను అమ్ముకునేందుకే యుద్ధాలను ప్రేరేపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని దోపిడీ చేస్తున్న ట్రంప్‌పై మోడీ ఇప్పటి వరకూ ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం అన్యాయమని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయినప్పటి నుండి అధిక సుంకాల పేరుతో ప్రపంచదేశాలను బెదిరిస్తున్నారని అన్నారు. 57 శాతం జనాభా ఉన్న బ్రిక్స్ దేశాలను కించపరిచేలా సామ్రాజ్యవాద దురహంకారంతో వ్యవహరించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇండియాను కించపరిచేలా 40 సార్లు ట్రంప్ ప్రకటనలు చేశారని అన్నారు. పార్లమెంటులో గంటన్నర మాట్లాడిన మోడీ ఒక్కసారి కూడా ట్రంప్ ప్రకటనను ఖండించలేదని, అటువంటి వ్యక్తి ప్రధానిగా ఉండటం దౌర్భాగ్యమన్నారు. ఎస్‌యుసిఐ నాయకులు హరినాథ్ మాట్లాడుతూ.. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా అమెరికన్లే శ్వేతసౌధం వద్ద పెద్దయెత్తున నిరసనలకు దిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, సిపిఐ నాయకులు పి దుర్గాభవానీ, పద్మ, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విదేశీ భాషల్లోనూ శిక్షణ

- సీడాప్‌తో 50 వేలమందికి ఇతర దేశాల్లో ఉద్యోగాలు
- విద్యాశాఖ మంత్రి లోకేష్



జర్మన్ భాష నేర్చుకుని జర్మనీ వెళ్తున్న యువతికి పుస్తకాలను బహూకరిస్తున్న మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చదువుతో పాటు విదేశీ భాషల్లోనూ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్), ఇండో యూరో సింక్రనైజేషన్ అండ్ జర్మన్ హెల్త్ కేర్ సంయుక్త భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్లేస్‌మెంట్ పథకం కింద జర్మనీలో 14 మందికి నర్సింగ్, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్‌కు కాల్ లెటర్స్ అందాయి. ఈ విద్యార్థులు మంత్రి లోకేష్‌ను ఉండవల్లిలో శనివారం కలిశారు. తొలి బ్యాచ్ కింద సీడాప్ ద్వారా 171 మందికి శిక్షణ ఇవ్వగా, ఇప్పటికే 40 మంది ఎంపికయ్యారని తెలిపారు. అంతర్జాతీయస్థాయి ఉద్యోగ అవకాశాలను రాష్ట్ర యువత అందిపుచ్చుకోవాలన్నదే సిఎం లక్ష్యమని చెప్పారు. జర్మనీ వెళ్తున్న 14 మంది అందరికీ స్ఫూర్తిగా నిలవాలన్నారు. అంతర్జాతీయ స్థాయి అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకునేలా సీడాప్-ఓంక్యాప్ ద్వారా విదేశీ భాషల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ ప్రధాన హామీ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన అని తెలిపారు. ఈ లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. నైపుణ్య పోర్టల్‌ను ఈ నెలలోనే ప్రారంభించబోతున్నామని చెప్పారు. మహిళలను గౌరవించేలా కెజి టు పిజి కరిక్యులమ్‌లో మార్పులు తెస్తున్నామని తెలిపారు. మహిళలను కించపరిచే సినిమాలను సైతం విడుదల కాకుండా అడ్డుకోవాలన్నదే తమ అభిమతమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడాప్ ఛైర్మన్ జి దీపక్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డి గణేష్‌కుమార్, సీడాప్ సిఇఒ పి నారాయణ స్వామి, స్కిల్ ఇంటర్నేషనల్ యాక్టివిటీస్ సలహాదారు సీతాశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

- పలు ఆలయాలు తాత్కాలిక మూసివేత

ప్రజాశక్తి- తిరుమల

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా తిరుమలలోని శ్రీవారి ఆలయంతోపాటు రాష్ట్రంలోని పలు ఆలయాలను ఆదివారం తాతాల్కికంగా మూసివేయనున్నారు. యాత్రికుల దర్శనాలను నిలిపివేయనున్నారు. ఆదివారం రాత్రి 9.50 నుంచి సోమవారం వేకువజామున 1.31 గంటల వరకూ చంద్రగ్రహణం ఉండనుంది. గ్రహణం విడిచాక శుద్ధి అనంతరం దర్శనాలను పునరుద్ధరించనున్నారు. విజయవాడ కనకదుర్గ ఆలయం, శ్రీశైలం, అన్నవరం ఆలయాలను కూడా తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సోమవారం తెల్లవారుజామున మూడు గంటల వరకూ తిరుమల శ్రీవారి ఆలయంలో దర్శనాలను నిలిపివేయనున్నట్టు టిటిడి తెలిపింది. ఆదివారం ఆర్జిత సేవలు, గరుడసేవ, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను, సోమవారం విఐపి బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్టు పేర్కొంది.

ఎర్రకోటలో దొంగలు పడ్డారు!

- రూ.కోటి విలువైన కలశాల చోరీ

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోటలో దొంగలు పడ్డారు. రూ.కోటి విలువైన కలశాలను ఎత్తుకెళ్లారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వీయ పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రత ఉండే రాజధానిలో అందునా ప్రఖ్యాతిగాంచిన ఎర్రకోటలోనే దొంగలు పడ్డారంటే శాంతిభద్రతల తీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల కథనం ప్రకారం.. ఇటీవల జరిగిన ఓ మతపరమైన కార్యక్రమంలో ఈ చోరీ జరిగినట్లు చెబుతున్నారు. రూ.కోటి విలువైన రెండు కలశాలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ నెల 3న ఉదయం ఎర్రకోటలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. ఆ వేడుకలో లోక్‌సభా స్పీకర్ ఓం బిర్లా కూడా పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పూజ కోసం తీసుకువచ్చిన 760 గ్రాములు బంగారు కలశంతో పాటు, వజ్రాలు, మాణిక్యాలు, పచ్చలతో పొదిగిన 115 గ్రాముల మరో చిన్న బంగారు కలశం కనిపించలేదని వ్యాపారవేత్త సుధీర్ కుమార్ జైన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలంలోని సిసి కెమెరాను పరిశీలించారు. ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి పూజా సామగ్రి ఉన్న గదిలోకి వెళ్లి రెండు కలశాలను సంచిలో వేసుకుంటున్న దృశ్యాలు కనిపించాయి. అనంతరం అతడు అక్కడి నుంచి బయటకు జారుకున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుడిపై ఇప్పటికే పలు ఆలయాల్లో దొంగతనానికి యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కలశాలను దొంగలిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఎర్రకోటలో స్వాంత్రత్య వేడుకలకు ముందు తీవ్ర భద్రతా వైఫల్యం బయటపడింది.

స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ఎర్రకోటలో స్పెషల్ డ్రిల్ నిర్వహించినట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. అందులోభాగంగా కొందరు భద్రతాధికారులు సాధారణ వ్యక్తుల్లా డమ్మీ బాంబుతో ఎర్రకోటలోకి ప్రవేశించారు. అయితే, అక్కడ విధుల్లో ఉన్న అధికారులు ఆ డమ్మీ బాంబును గుర్తించడంలో విఫలమయ్యారు. దీంతో వారిని సస్పెండ్ చేశారు. అంతకుముందు ఆగస్టు 2న, అక్కడి భద్రతా సిబ్బంది డమ్మీ బాంబును గుర్తించడంలో విఫలమయ్యారు. ఆ ఘటన తరువాత ఏడుగురు పోలీసులను సస్పెండ్ చేశారు.


చైనా పెట్టుబడులపై ఆంక్షల సడలింపునకు సానుకూలం

నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ : పొరుగుదేశం చైనాపై పెట్టుబడి ఆంక్షలను సడలించడానికి భారత ప్రభుత్వం సానుకూలంగా ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. చైనా కూడా భారత ఎగుమతులకు అడ్డంకులను తగ్గించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయాల్సి ఉంటుందని మంత్రి ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. న్యూఢిల్లీ, బీజింగ్ మధ్య మార్కెట్ లభ్యత (యాక్సెస్), టారిఫేతర అడ్డంకులపై అర్థవంతమైన చర్చలు జరగాలని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకోవడానికి సమయం పడుతుందన్నారు. దీనికి ఇరుపక్షాల నుంచి నిబద్ధత, నిజాయితీ అవసరమన్నారు. అమెరికా విధించిన 50 శాతం అధిక టారిఫ్‌లు దేశ ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావాన్ని ఎదుర్కోవడానికి జిఎస్‌టి వంటి సంస్కరణలు, ఇతర చర్యలు తీసుకుంటున్నామన్నారు. టారిఫ్‌లతో ప్రభావితమయ్యే రంగాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్యాకేజీని తీసుకురానుందని, దీనిని కేబినెట్ ఆమోదించాల్సి ఉందన్నారు. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తామన్నారు.

బంగారు కుటుంబాలు కుదింపు

- 30.11 లక్షల నుంచి 14.24 లక్షలకు తగ్గింపు
- 'ప్రజాశక్తి' కథనంపై స్పందించిన ప్రభుత్వం
- కొత్తగా చేరినవి కేవలం 20,858 కుటుంబాలు



(ఫైల్)

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పి-4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్ షిఫ్) అమలులో భాగంగా మార్గదర్శకుల ద్వారా నిరుపేదలను (బంగారు కుటుంబాలను) ఆదుకునేందుకు 26 జిల్లాల్లో ఈ ఏడాది మార్చిలోని సర్వే అస్తవ్యస్తగా నిర్వహించినట్లు తేటతెల్లమైంది. ఈ సర్వేలో 30,11,480 బంగారు కుటుంబాలకు గుర్తించారు. 'నిరుపేదల గుర్తింపులో తిరకాసు' శీర్షికన ప్రజాశక్తిలో కథనం ప్రచురితం కావడంతో ప్రభుత్వంలో కదలిక మొదలైంది. సర్వేలో లోపాలు గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. జులైలో నిర్వహించిన మలివిడత సర్వేలో మొత్తంగా 14,24,050 బంగారు కుటుంబాలను గుర్తించారు. తొలుత గుర్తించిన వారిలో దాదాపు 15,87,430 అంటే 47.30 శాతం బంగారు కుటుంబాలను నిరుపేదల జాబితా నుంచి తొలగించారు. కాకినాడ జిల్లాలో తొలుత 1,65,510 కుటుంబాలను ఎంపిక చేయగా అందులో 1,51,467 మందిని తొలగించారు. ఇలా దాదాపు 14 జిల్లాలో 50 శాతానికిపైగా తొలి జాబితా నుంచి బంగారు కుటుంబాలను తొలగించారంటే తొలుత సర్వే ఎంత లోపభూయిష్టంగా జరిగిందో వెల్లడవుతోంది. కొత్తగా నిర్వహించిన సర్వేలో 26 జిల్లాల నుంచి అదనంగా 20,858 మంది కుటుంబాలను మాత్రమే గుర్తించారు.

రెండోసారీ అదే తీరు!

బంగారు కుటుంబాల ఎంపిక రెండోసారి కూడా లోపభూయిష్టంగా జరిగింది. క్షేత్ర స్థాయిలో సర్వే జరపకపోవడమే ఇందుకు కారణం. ఎటువంటి ఆదరణాలేని నిర్భాగ్యులు, అనాథలు, వలస కార్మికులు, అత్యంత నిరుపేదలకు ఇప్పటికీ పి-4 బంగారు కుటుంబాల జాబితాలో చోటు దక్కలేదనే మళ్లీ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు లేని వారు, సచివాలయంలో మ్యాపింగ్ కాని వారు పి-4 సర్వేకు నోచుకోలేదు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పేదలను గుర్తించాల్సిన యంత్రాంగం... రెండోసారి కూడా రేషన్ కార్డు, సచివాలయాల మ్యాపింగ్ ఆధారంగా ఒటిపి ద్వారా సర్వే నిర్వహించినట్టు, అధికార పార్టీ నాయకులు మౌఖికంగా సిఫార్సు చేసిన వారికి పెద్ద పీట వేసినట్టు విమర్శలు ఉన్నాయి. రేషన్ కార్డు ఉండి పట్టణాల్లో 200 యూనిట్లకుపైగా విద్యుత్ వినియోగం ఉన్నా, ప్రభుత్వ ఉద్యోగం, ఆదాయపు పన్ను, జిఎస్‌టి రిటర్నులు, సొంత ఆస్తి లేదా సొంత ఇల్లు, నాలుగు చక్రాల వాహనం ఉన్నా, అద్దె, వడ్డీ, పింఛన్లు పొందుతున్నా అటువంటి వారు బంగారు కుటుంబాల ఎంపికకు అనర్హులని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో సొంత వ్యవసాయ భూమి, విద్యుత్ సౌకర్యం, తాగునీటి ట్యాప్, బ్యాంకు ఖాతా, టివి, ఫ్రిజ్, ఎసి, ల్యాప్ టాప్, పక్కా గృహం ఉన్న వారు బంగారు కుటుంబాలుగా ఎంపికకు అనర్హులని తెలిపింది. రెండోసారి కూడా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే జరగలేదనే విమర్శలు ఉన్నాయి

తొలి, మలి విడత జాబితాల్లోని బంగారు కుటుంబాల వివరాలు 7

9న హెల్త్ యూనివర్సిటీ 27, 28వ స్నాతకోత్సవాలు

- వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 27, 28వ స్నాతకోత్సవాలు ఈ నెల 9న నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పి చంద్రశేఖర్ తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ స్నాతకోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. 27వ స్నాతకోత్సవానికి 2021వ బ్యాచ్‌కు చెందిన 53 మంది విద్యార్థులకు, 28కు సంబంధించిన 2022 బ్యాచ్ విద్యార్థులకు 67 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందిస్తామన్నారు. రాజధాని అమరావతిలో హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు 25 ఎకరాల భూమి కావాలని సిఆర్‌డిఎకు లేఖ రాశామని తెలిపారు. ఢిల్లీలోని నేషనల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ కార్డియాక్ సర్జన్ ఓపి యాదవకు గౌరవ డాక్టరేట్ డిగ్రీకి ఎంపిక చేశామని పేర్కొన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి రాధికా రెడ్డి మాట్లాడుతూ.. 2021 బ్యాచ్‌లో 18 మందికి, 2022 బ్యాచ్‌లో 20 మందికి క్యాష్ ప్రైజ్‌లు అందిస్తామన్నారు. పిహెచ్‌డి పూర్తిచేసిన 5 మందికి పట్టాలు, సూపర్ స్పెషాల్టీలో ఒకరికి డిగ్రీ అందజేయనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌డి డైరెక్టర్ సూర్యప్రభ, జాయింట్ రిజిస్ట్రార్ కె నీలిమ, డిప్యూటీ రిజిస్ట్రార్ సుసన్న రామర్స్ పాల్గొన్నారు.

ఇద్దరు ఉల్లి రైతుల ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలింపు
- కర్నూలు కొత్త బస్టాండ్ వద్ద రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - సి బెళగల్, కర్నూలు కార్పొరేషన్

కర్నూలు సి బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో ఉల్లికి గిట్టుబాటు ధరలు లేవని, అప్పులెలా తీర్చాలని ఆందోళనకు గురైన ఇద్దరు రైతులు బోయ కృష్ణ, వెంకట నాయుడు తమ పొలంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నం చేశారు. ఇది గమనించిన పొరుగు రైతులు వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్య యత్నం సమయంలో వీడియోలు తీసి తమవారికి పంపారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకగా ఉందని వైద్యులు తెలిపారు. ఒక్కోరైతు నాలుగు ఎకరాల్లో ఉల్లిసాగు చేశారు. ఎకరాకు రూ.1,20,000 పెట్టుబడి పెట్టారని, ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం ఎకరాకు రూ.70 నుంచి రూ.80 వేలకంటే ఎక్కువ రావడం లేదని రైతులు, స్థానికులు తెలిపారు. రైతులు ఆసుపత్రిలో వైద్యం అందుకుంటున్న గంటల వ్యవధిలోనే జిల్లా వ్యవసాయ సంచాలకులు పిఎల్. వరలక్ష్మి, సి బెళగల్ తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఎఒ మల్లేష్ కుమార్ పోలకల్‌కు వచ్చారు.

బాధిత రైతుల పొలాల్లోకి వెళ్లి ఉల్లి నిల్వలు పరిశీలించారు. ఉల్లి క్వింటాలుకు రూ.750 ఉండగా ప్రభుత్వం అందుకు అదనంగా రూ.500 పెంచి రూ.1250 అందేలా దృష్టి సారించిందని అధికారులు తెలిపారు. గిట్టుబాటు ధరలు సరిపోవడం లేదంటే ప్రభుత్వం దృష్టికి లేదా ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని, ఇలా ఆత్మహత్యా యత్నం చేసుకోవడం బాధాకరమని అన్నారు. అనంతరం టిడిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కనీసం కిలోకు రూ.25 నుంచి రూ.30 ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం తెలియజేస్తున్న సిపిఎం, రైతు సంఘాల నాయకులు

కర్నూలులో ఉల్లిరైతుల రాస్తారోకో ఎపి రైతు సంఘం , సిపిఎం సంఘీభావం

పోలకల్ గ్రామ రైతు ఆత్మహత్య ప్రయత్నం చూసైనా ప్రభుత్వం స్పందించి ఉల్లి రైతులను ఆదుకోవాలని శనివారం కర్నూలు కొత్త బస్టాండ్ ప్రధాన రహదారిలో ఉల్లి రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఒకరోజు వినాయక నిమజ్జనం, మరోరోజు మిలాదున్‌నబీ వల్ల వరుసగా రెండు రోజులు సెలవులు వచ్చాయి. శనివారం భారీగా మార్కెట్‌కు ఉల్లి తెచ్చినా కొనుగోలు చేయలేదు. దీంతో, ఆగ్రహించిన రైతులు ఉల్లిపాయలను రోడ్డుపై పారబోసి రాస్తారోకోకు దిగారు. రైతుల ఆందోళనకు సంఘీభావం తెలిపిన ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ రైతులు పండించిన ఉల్లికి క్వింటాలుకు రూ.3000 చొప్పున ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో ప్రజా ప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. గంటకుపైగా రాస్తారోకో చేయడంతో రాకపోకలు స్తంభించాయి. ఉల్లి రైతుల ఆందోళనకు వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌పివైరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక సంఘీభావం తెలిపారు. ఎస్‌పివైరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు గిట్టబాటు ధర కల్పించే వరకూ ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జాయింట్ కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు కర్నూలు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య వచ్చి వారితో మాట్లాడారు. ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తామని, రైతుల వద్ద నుంచి వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసినా ప్రభుత్వం దానికి మిగతా ధరను కలిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు రాస్తారోకో విరమించారు.



గ్రామస్తులకు భోజనాలు అందిస్తున్న అధికారులు

తురకపాలెంలో ఎయిమ్స్ బృందాల పరీక్షలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ప్రజలకు వైద్య పరీక్షలు శనివారం కూడా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన తురకపాలెంలో 650 ఇళ్లకు సర్వే నిర్వహించి సింటమెటిక్ కేసులకు సంబంధించి 56 మందికి బ్లడ్ కల్చర్ తీసి మెడికల్ కళాశాలకు పంపినట్టు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శని, ఆదివారాల్లో ప్రత్యేకంగా నియమించిన 50 వైద్య బృందాలు ప్రతి ఇంటికి వెళ్ళి ఆరోగ్యానికి సంబంధించిన 41 పారామీటర్స్ అంశాలపై సర్వే చేసినట్లు చెప్పారు. ఆరోగ్యసూత్రాలపై మైక్‌ల ద్వారా అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. మంగళగిరి ఎయిమ్స్ నుండి ఎక్స్‌పర్ట్ టీం ఇన్వెస్టిగేషన్ బృందాలు గ్రామానికి చేరుకున్నాయి. రాష్ట్ర స్థాయి నోడల్ ఆఫీసర్స్ బృందం మొత్తం గ్రామంలోనే ఉండి వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి చేపట్టాల్సిన ప్రక్రియను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 895 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం మొత్తం 2,850 మందికి ఉపాహారం, 3500 మందికి మధ్యాహ్న భోజనం అందించారు. గ్రామం మొత్తంగా తొమ్మిది ప్రదేశాల్లో భోజనాలు ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో తురకపాలెంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. అన్ని శాఖల అధికారులు గ్రామం మొత్తం తిరిగి ఆయా శాఖలు చేపట్టాల్సిన పనులను ప్రారంభించారు.

అసాధారణ మరణాలపై వెల్లడి కాని కారణాలు

తురకపాలెంలో అసాధారణ మరణాలపై మెడికల్ ల్యాబ్ టెస్టు నివేదికల్లో స్పష్టమైన కారణాలు వెల్లడికాలేదు. మెలియోయిడోసిస్ అనే వైరస్ వల్ల మరణాలు సంభవిస్తున్నట్టు తొలుత భావించారు. 62 మంది నుంచి రక్తాన్ని సేకరించి బ్లడ్ కల్చర్ టెస్ట్ కోసం చెన్నయ్‌కు పంపారు. శనివారం రాత్రి పది గంటల ప్రాంతంలో జిల్లా అధికారులకు వీరిలో 55 మంది రిపోర్టులు వచ్చాయి. వారికి ఎవరికీ ఈ వైరస్ నిర్ధారణ కాలేదని, నెగిటివ్ వచ్చిందని వైద్య అధికారులు తెలిపారు. ఆలస్యంగా బ్లడ్ కల్చర్ టెస్టుకు పంపిన మిగతా ఏడుగురి రిపోర్టులు రావాల్సి ఉందని చెప్పారు. ఏ వ్యాధి లేక వైరస్ వల్ల 22 మంది చనిపోయారన్నది ఇంకా నిర్ధారణ కాలేదని తెలిపారు. మరణాలపై సందేహాలు అలాగే కొనసాగుతున్నాయి.

అణగారిన వర్గాలకు అన్ని రంగాల్లో
సమాన హక్కుల కోసం పోరాటం

- ఎస్‌సి, ఎస్‌టి, బిసి సమాలోచనలో వక్తలు

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

అణగారిన వర్గాలకు అన్ని రంగాల్లో సమాన భాగస్వామ్యం, హక్కుల కోసం పోరాటం నిర్వహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో 'ఎస్‌సి, ఎస్‌టి, బిసి రాష్ట్ర సమాలోచన సదస్సు' సదస్సు జెఎసి కన్వీనర్ కొరివి వినయకుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల్లో చైతన్యం, జ్ఞానంతో కూడిన ప్రత్యేక సంస్కృతిని పెంపొందించాలని, అప్పుడే సమాజంలో మెరుగైన జీవన ప్రమాణాలు వస్తాయని తెలిపారు. అణగారిన కులాలు ముఖ్యంగా దళితుల ఐక్యతకు అందరూ కృషి చేయాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యేక దళిత వ్యతిరేక విధానాలు కొనసాగిస్తోందని, వారిపై అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళితుల రక్షణ చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని వివరించారు. ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడం వల్ల అణగారిన కులాలు రిజర్వేషన్లను కోల్పోతున్నాయని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి, రక్షణ, విద్యా, ఉపాధి రంగాల్లో మెరుగైన రక్షణ సదుపాయాలు కల్పించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు.

అభివృద్ధి పేరుతో పేదల భూములు కొల్లగొట్టడం రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. తాడికొండ శాసనసభ్యులు టి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పథకాలు, ప్రత్యేక చట్టాల పట్ల దళిత బహుజన వర్గాల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు అందుకునే స్థాయికి దళితులను సన్నద్ధం చేయాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కొరివి వినయకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళిత సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాక్షులు కొలనుకొండ శివాజి, ఆర్‌పిఐ అధ్యక్షులు పిట్టా వరప్రసాద్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ నాయకులు మేళం భాగ్యారావు, తోటి చంగల్‌రావు, రెడ్డన్న, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌సి, ఎస్‌టి, బిసి రాష్ట్ర సమాలోచన సదస్సులో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

టెక్నాలజీని విస్మరించడం తగదు : ఐద్వా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టెక్నాలజీని విస్మరించి పాత విధానాలకే పరిమితమవ్వాలని, ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌కు తగదని ఐద్వా రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు శనివారం ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాల్లోని వివిధ వర్గాల్లోనూ విద్యార్థులు డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఆన్‌లైన్ బోధనతో కొత్త అవకాశాలు పొందుతున్నారన్నారు. పేద వర్గాలకు ఉపయోగపడుతున్న అవకాశాలను కత్తిరించాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. అందరికీ విద్యనందించడానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా ఆన్‌లైన్ లెర్నింగ్, డిజిటల్ క్లాస్‌రూమ్స్ అంటోందని, వారి పార్టీ నాయకులు మాత్రం ఇవేమి వద్దంటున్నారని తెలిపారు. విద్యార్థులు పోటీ ప్రపంచానికి డిజిటల్ వేదికలను ఉపయోగించుకుంటున్నారని, వాటిని తిరస్కరించడం ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారని వారు మాధవ్‌ను ప్రశ్నించారు. పాత పద్ధతుల్లోనే చదువులు ఉండాలని, గురువుతో మాత్రమే ముఖాముఖిగా నేర్చుకోవాలనడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉంటూ ఈ తరహా వ్యాఖ్యలు చేస్తుండటంపై భాగస్వామ్య పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు.



ట్రాక్టర్లను రహదారిపై నిలిపి ఆందోళన చేస్తున్న రైతులు

పొగాకు రైతుల రాస్తారోకో

- నాణ్యత సాకుతో తిరస్కరిస్తున్నారని, ధర సరిగా ఇవ్వడం లేదని ఆందోళన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)

తమ పొగాకును రకరకాల సాకులతో కొనకుండా తిరస్కరిస్తున్నారని రైతులు ఆగ్రహానికి గురయ్యారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం ఐదో మైలులో మద్రాసు రహదారిపై ఎండలోనే కూర్చుని శనివారం రాస్తారోకో చేపట్టారు. పొగాకు లోడు ట్రాక్టర్లను రహదారికి అడ్డంగా నిలిపి నిరసన వ్యక్తం చేశారు. ఆయా ట్రాక్టర్లకు టిడిపి జెండాలనూ కట్టారు. ఐదో మైలులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రెండ్రోజుల కిందట ప్రారంభించారు. తొలుత కాకుమాను మండలానికి చెందిన పలువురు రైతులు ట్రాక్టర్లలో పొగాను తీసుకొచ్చారు. నాణ్యత సాకుతో కేంద్రం అధికారులు తిరస్కరించడంతో పొగాకు ట్రాక్టర్లను రైతులు రోడ్డుపైకి తెచ్చి ఆందోళనకు దిగారు. దూరాబారం నుండి అనేక వ్యయప్రయాసలకోర్చి వచ్చిన తమను ఇలా ఇబ్బంది పెట్టడం తగదని ఆవేదనకు గురయ్యారు. 20 చెక్కలు తెస్తే 20 చెక్కలనూ తిరస్కరించారని చెప్పారు. ప్రభుత్వం ఎంత ధర నిర్ణయించిందో ధరల బోర్డు పెట్టలేదని, కొంతమందికి క్వింటాలుకు రూ.6 వేలు మాత్రమే వేస్తున్నారని, బయ్యర్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. గంటపాటు ఆందోళనతో ట్రాఫిక్ భారీగా నిలిచింది. దీంతో కొనుగోలు కేంద్రం అధికారి అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. కేంద్రం వద్ద ఇంకా పూర్తి సదుపాయాలు పెట్టలేదని, మార్క్‌ఫెడ్ అధికారులు మాత్రం ఎక్కువ మంది రైతులను పంపుతున్నారని అన్నారు. బయ్యర్ రోజుకు 300 బేళ్లు చూడగరని, రోజుకు 20-25 ట్రాక్టర్లు వస్తుండడంతో పరిశీలన ఆలస్యమవుతోందని తెలిపారు. రైతులకు సర్దిచెప్పి వాహనాలను మళ్లీ కొనుగోలు కేంద్రంలోకి తీసుకురావాలని చెప్పడంతో ఆందోళన ముగిసింది.



నివాళులర్పిస్తున్న సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్ , ఇతర నాయకులు

అశ్రునయనాల మధ్య వీరారెడ్డి అంత్యక్రియలు

ప్రజాశక్తి - బనగానపల్లె

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి తండ్రి కె.వీరారెడ్డి అంత్యక్రియలు అశ్రు నయనాల మధ్య శనివారం నిర్వహించారు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామంలోని ఆయన స్వగృహం నుంచి శ్మశాన వాటిక వరకు అంతిమయాత్ర కొనసాగింది. శ్మశాన వాటికలో వీరారెడ్డి చితికి ఆయన పెద్దకుమారులు కె.ప్రభాకర్‌రెడ్డి నిప్పంటించారు. అంతకు ముందు సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి రమేష్, కర్నూలు జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, బనగానపల్లె మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గాలి మద్దిలేటి రెడ్డి, ఐలు రాష్ట్ర అధ్యక్షులు విజయకుమార్, సిపిఎం, వివిధ సంఘాల నాయకులు నరసింహ, ఆనంద్‌బాబు, నాగరాజు, రాజశేఖర్, రామచంద్రుడు వీరారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు.

బాపట్లలో నిలిచిన 'శబరి'

ప్రజాశక్తి- బాపట్ల

హైదరాబాద్ నుండి తిరువనంతపురం వెళ్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజన్లో సాంకేతిక సమస్య తలెత్తడంతో శనివారం సాయంత్రం బాపట్ల రైల్వే స్టేషన్లో గంటపాటు నిలిపివేశారు. రైల్వే అధికారులు మరో రైలు ఇంజన్‌ను అమర్చి బాపట్ల నుండి పంపించారు. స్టేషన్లో గంటకుపైగా రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.

పోలీసులకు చిక్కిన పరారీ నిందితులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

చోడవరం సబ్ జైలు వార్డర్‌ను సుత్తితో కొట్టి పరారైన నిందితులు శనివారం విశాఖపట్నంలో సిటీ టాస్క్‌ఫోర్సు పోలీసులకు చిక్కారు. పోలీసుల కథనం మేరకు చోడవరం సబ్ జైలు వార్డర్ వీరరాజుపై శుక్రవారం సాయంత్రం సుత్తితో దాడి చేసి రిమాండ్ ఖైదీలు బెజవాడ రాము, నక్క రవికుమార్ పరారయ్యారు. వారు విశాఖ వైపు వెళ్లినట్టు భావించి... విశాఖ నగరంలో నాలుగు సిటీ టాస్క్‌ఫోర్స్ బృందాలు రైల్వేస్టేషన్, బస్ స్టేషన్, ఇతర నివాస స్థలాలు, హోటళ్లు, హాస్టళ్లలో శుక్రవారం రాత్రి నుంచి విస్తృతంగా సోదాలు నిర్వహించాయి. ఎస్ఐ భరత్ కుమార్, కానిస్టేబుల్ ఎస్‌కె బక్షి, జహీర్ హుస్సేన్‌ల బృందం గొల్లలపాలెం, రామ్‌నగర్ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా స్థానిక ఎస్‌బిఐ సమీపంలో నిందితులు పట్టుబడ్డారు. వారిని పట్టుకోవడంలో ఎపిఎస్‌పి 16వ బెటాలియన్ పోలీస్ ఎస్.సంతోష్ సహకరించారు.

'ఆరోగ్యశ్రీ'ని ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

- ప్రజారోగ్యవేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో: ఆరోగ్యశ్రీ పథకాన్ని ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, వైద్య వ్యవస్థలను అభివృద్ధి చేయాలని ప్రజారోగ్యవేదిక డిమాండ్ చేసింది. కొత్తగా ప్రారంభించే వైద్యకళాశాలల్లో సగం రిజర్వేషన్ల సీట్లను అమ్ముకునేందుకు వీలుగా తెచ్చిన జిఓ 107, 108లను వెంటనే రద్దు చేయాలంది. ఈ మేరకు ప్రజారోగ్యవేదిక రాష్ట్ర కమిటీ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభించిన 10 మెడికల్ కాలేజీలను పిపిపి మోడ్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలనుకోవడం దారుణమని పేర్కొంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్య కళాశాలలు నడిచినప్పుడు పేద కుటుంబాల నుంచి కూడా వైద్యులయ్యే అవకాశం ఉంటుందని తెలిపింది. ప్రభుత్వ వైద్యానికి ప్రత్యామ్నాయంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టడం కొన్ని పెద్ద జబ్బులకు కొంత ఊరట కలిగించినప్పటికీ ఇది పూర్తి పరిష్కారం కాదంది. ఈ కొద్ది సహాయం చేస్తున్న ఆరోగ్యశ్రీని కూడా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకోవాలనుకోవడం దుర్మార్గమని ప్రజారోగ్యవేదిక అభిప్రాయపడింది. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలు వ్యాపారం చేస్తాయేగానీ, సేవ చేయవని పేర్కొంది. రాజ్యాంగ హామీగా ప్రజలకిచ్చిన వైద్య సేవల్ని కూడా ప్రైవేటు వ్యాపారానికి అప్పజెప్పడం మానవహక్కుల ఉల్లంఘనే అవుతుందని ప్రజారోగ్యవేదిక పేర్కొంది. ఆరోగ్యసేవలను ప్రభుత్వమే అందించేలా వైద్యశాలలను అభివృద్ధి చేసి నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని కోరింది. వైద్య కళాశాలలను పిపిపి పేరుతో ప్రైవేటుపరం చేయడాన్ని ఆరోగ్యశ్రీలో ఇన్సూరెన్స్ కంపెనీల ప్రమేయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష శ్రేణులు

అమెరికా అధిక సుంకాలపై ఆగ్రహం

- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
- తగ్గించుకుంటే ప్రజాఉద్యమం : వామపక్షాల హెచ్చరిక

ప్రజాశకి- యంత్రాంగం

అమెరికా 50 శాతం సుంకాలు విధించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. అడ్డగోలుగా పెంచిన సుంకాలను వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదని వామపక్ష నాయకులు హెచ్చరించారు. సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఎస్‌యుసిఐసి నాయకులు మాట్లాడుతూ సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకోవడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. దీనిపై మన దేశం కిక్కురుమనకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సుంకాలను వెనక్కి తీసుకోకపోతే ప్రజాఉద్యమం తప్పదని హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లా గణేష్ సర్కిల్లో జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర్లు, వి.రాంభూపాల్ మాట్లాడుతూ మనదేశ ఎగుమతులపై ట్రంప్ 50 శాతం సుంకం విధిస్తూ నిర్ణయం చేశారని, దీనిని మోడీ వ్యతిరేకించకపోగా అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఎలాంటి సుంకాలూ విధించరాదంటూ ట్రంప్ విధించిన షరతులకు అంగీకరించడం సిగ్గుచేటన్నారు. సుంకాల పెంపు వల్ల రాష్ట్రంలో పత్తి, ఆక్వా తదితర ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపనుందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడనున్నారని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, వైసిపి అధ్యక్షులు జగన్ నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. గుంటూరులో వామపక్షాల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, సిపిఎం, సిపిఐ ఎంఎల్ నాయకులు ప్రసంగించారు. నరసరావుపేటలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద నిరసన తెలిపారు. శ్రీకాకుళంలో అంబేద్కర్ కూడలి, విజయనగరంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద, అల్లూరి జిల్లా కూనవరం జంక్షన్లో, విశాఖపట్నం, అనకాపల్లిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రాజమహేంద్రవరం, కాకినాడ జిల్లా పెద్దాపురం, సామర్లకోట, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో ధర్నా చేశారు. పార్వతీపురంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఏలూరు జిల్లా కుక్కునూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. జీలుగుమిల్లిలో జాతీయ రహదారిపై ధర్నా చేశారు. బుట్టాయగూడెం సెంటర్‌లో అఖిలభారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో వామపక్షాల ఆధ్వర్యాన ధర్నా చేశారు. తాడేపల్లిగూడెం, కేశవరంలో సెంటర్లో నిరసన తెలిపారు. అనంతపురంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా విస్సన్నపేటలో నిరసన తెలిపారు. తిరుపతి, గూడూరు, సూళ్లూరుపేట, రేణిగుంట, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, పుత్తూరులలో నిరసనలు హోరెత్తాయి. ప్రకాశం జిల్లా ఒంగోలు, కడప, అన్నమయ్య జిల్లా రాయచోటి, మదనపల్లెలో నిరసన తెలిపారు. కర్నూలు, నంద్యాల జిలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.



పాలకొల్లులో జరిగిన 4 వ అంతర్జాతీయ లఘు చిత్రాల పోటీల సందర్భంగా తుమ్మలపల్లి సత్యనారాయణను సన్మానిస్తున్న మంత్రి రామానాయుడు

సమాజానికి మంచి సందేశాల వేదిక లఘు చిత్రాలు

- యువతలో సృజనాత్మకత, కొత్త ఆలోచనలు
- నాల్గో అంతర్జాతీయ లఘు చలనచిత్రాల పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

సమాజంలోని ప్రజలను చైతన్యపరిచి, రుగ్మతలను ఎత్తిచూపుతూ మంచి సందేశాలిచ్చే వేదికగా లఘు చలన చిత్రాలు నిలుస్తున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని శ్రీ రామచంద్ర మినీ గార్డెన్లో శనివారం జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నాలుగో అంతర్జాతీయ లఘు చలనచిత్ర పోటీల ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోటీల్లో పలు లఘు చిత్రాలు అందర్నీ ఆకట్టుకోవడంతోపాటు ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు మాజీ ఎంపి చేగొండి వెంకటహరిరామ జోగయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరిలో సామాజిక బాధ్యతను గుర్తు చేయడంతోపాటు వినోదాన్ని లఘు చిత్రాలు అందిస్తున్నాయన్నారు. నిడివి తక్కువ గల లఘు చిత్రాలకు స్మార్ట్ ఫోన్లు వచ్చాక విపరీతమైన ఆదరణ పెరిగిందన్నారు. నేటి యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను, కొత్త ఆలోచనలను వెలికి తీసేందుకు లఘుచిత్రాలు దోహదపడుతున్నట్లు వివరించారు. ఈ చిత్రాల ద్వారా కొత్త దర్శకులు, నటీనటులు తమ ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. ఫిలింనగర్ కల్చరల్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరాజుకు విశేష సేవా భూషణ్ పురస్కారం, ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణకు విశేష ప్రతిభా పురస్కారాలను మంత్రి అందజేసి ఘనంగా సన్మానించారు. పరిషత్ జాతీయ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, రాజేంద్ర కుమార్, పెనుమత్స కోటి రామచంద్రరాజు తదితరులు మాట్లాడారు.

యూరియా కోసం అగచాట్లు

- అన్నదాతలకు తప్పని తిప్పలు
- గంటల తరబడి రైతుల బారులు..

ప్రజాశక్తి -యంత్రాంగం

యూరియా కొరతతో అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. తెల్లవారుజాము నుంచే ఆధార్‌కార్డు పట్టుకొని క్యూ లైన్ లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజంతా నిల్చున్నా ఒక్క బస్తా కూడా దొరక్క వెనుతిరుగుతున్నారు. పురుగు మందులు దుకాణాల యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే విమర్శలు నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై ప్రయివేట్ దుకాణాల వద్ద ముందుగా టోకెన్లు ఇచ్చి క్రమ పద్ధతిలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్నం, నీళ్లు లేకుండా ఎండలో నిరీక్షించినప్పటికీ చాలామంది రైతులుకు యూరియా దొరక్క నిరాశతో వెనుదిరుగుతున్నారు. జిల్లా ఉనతాధికారులతో పాటు, వ్యవసాయ అధికారులు సరిపడా యూరియాను రైతు సేవా కేంద్రాల వద్దకు నేరుగా చేరే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నాట్లు వేసి రోజులు గడుస్తున్నా ఎరువులు లేకపోవడంతో చేలు ఎదుగుదల ఉండదని రైతులంతా ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం అందరికీ యూరియా అందిస్తామని అంటున్నారు.

విజయనగరంజిల్లా గజపతినగరం రైతు సేవా కేంద్రం 2 వద్ద శనివారం వ్యవసాయ అధికారులు వారి సిబ్బంది స్లిప్పులు పంపిణీ చేసి, మెంటాడ రోడ్డు లో ఉన్న సత్య ట్రేడర్స్ గొడౌన్లో యూరియా ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున 267 బస్తాలు పంపిణీ చేశారు. కాలం రాజుపేట, పిడిశిల , పాత శీరంగరాజుపురం, కొత్త శ్రీరంగరాజుపురం, డోలపాలెం, సీతారాంపురం గ్రామంలో రైతు సేవ కేంద్రాల వద్ద 267 యూరియా బస్తాలు పంపిణీ చేసినప్పటికీ కొంతమంది రైతులు యూరియా అందక వెనుతిరిగారు. గజపతినగరం పిఎసిఎస్‌లో నిల్వ ఉన్న 267 యూరియా బస్తాలను తెల్లవారుజాము నుంచి వ్యవసాయ అధికారులు పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది సహకారంతో ఇ-పాస్ యంత్రాల్లో ఆధార్ నమోదు చేసి రైతుకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. డెంకాడ మండల కేంద్రంలో పిఎసిఎస్ వద్ద పోలీసు పహరాలో రైతులకు యూరియాను అందజేశారు. యూరియా కోసం వెళ్తే యూరియాతోపాటు సుమారు 500 నుంచి 1000 రూపాయల వరకు ఇంకొక ఎరువును అంటగట్టి యూరియా ఇస్తున్నారని , వ్యవసాయ అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోతోందని రైతులు చెబుతున్నారు. అరకొరగా యూరియా వచ్చినా అధికారులు వారికి కావాల్సిన వారికే ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎంత భూమి ఉన్నా ఒక బస్తా మాత్రమే ఇవ్వడంతో ఏం చేయాలో రైతులకు పాలుపోవడం లేదని, రైతు పేరు మీద ఒక వన్ బి మాత్రమే ఉంటుందని, అధికారులు వన్‌బికి ఒక బస్తా చొప్పున ఇస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. డెంకాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద ముందస్తుగా పోలీసు బందోబస్తుతో మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత ఆధ్వర్యంలో యూరియాను రైతులకు పంపిణీ చేశారు.



బాపట్ల జిల్లా బట్టిప్రోలు మండలంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలోని ఐలవరం గ్రామానికి శనివారం సాయంత్రం యూరియా లారీ రాగా దానిలో 220 కట్టలు సచివాలయం-1సమీపంలోని ఆర్‌ఎస్‌కె వద్ద దించారు. రైతు ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నప్పటికీ ఒక కట్ట మాత్రమే అందించారు. పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని నిలబడి రూ. 275 చెల్లించి ఒక కట్టను పొందారు. ఐదు నుండి పది ఎకరాల వరకు సాగు చేసే వారికి ఒక్క కట్ట యూరియా ఇస్తే ఏ విధంగా సరిపోతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నెల్లిమర్ల మండలంలోని సతివాడ సత్యనారాయణ ట్రేడర్స్, నెల్లిమర్ల మన గ్రోమోర్ షాపుల్లో అధికారులు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో యూరియా అమ్మకాలు జరిగాయి. సతివాడ సత్యనారాయణ ట్రేడర్స్ మాత్రం ఒక్కొక్క బస్తా మీద రూ. 30 నుంచి రూ. 40 అదనపు ధరకు అమ్మడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పల్నాడు జిల్లాలోని మండల కేంద్రమైన ముప్పాళ్లలో యూరియా కోసం బారులు తీరారు. క్యూలైన్లలో తోపులాట తలెత్తింది. జిల్లా కేంద్ర మార్కెటింగ్ సొసైటీ (జిడిసిఎంఎస్) ఎరువుల కేంద్రానికి రెండ్రోజుల కిందట 440 బస్తాల యూరియా వచ్చింది. మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ సోమేశ్వరరావు అక్కడికి చేరుకుని అందరికీ సర్దిచెప్పి సజావుగా విక్రయాలు సాగేలా పర్యవేక్షించారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున విక్రయించారు. రైతులు అన్నం నీళ్లు మానుకుని, ఆధార్‌కార్డు కాపీలు చేతిలో పట్టుకుని ఎండలోనే గంటల తరబడి నిరీక్షించారు. మరికొందరు రైతులు ఎరువుల కోసం వచ్చినా అప్పటికే ఉన్న పెద్ద క్యూను చూసి వెనుదిరిగి వెళ్లిపోయారు. కొంతమంది చివరి వరకూ నిరీక్షించినా యూరియాను దక్కించుకోలేకపోయారు. మొత్తంగా ఉట్టిచేతుల్తో వెనుదిరిగిన వారి సంఖ్య వందకుపైగా ఉంటుంది.

అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం కెజె.పురం పిఎసిఎస్ కార్యాలయానికి శుక్రవారం 22 టన్నుల యూరియా వచ్చింది. ఈ విషయం తెలిసి శనివారం తెల్లవారు నాలుగు గంటల సమయానికే రైతులు పిఎస్‌సిఎస్ ప్రాంగణంలో బారులుతీరారు. ఒక్కొక్క రైతుకు ఒక్క యూరియా కట్ట మాత్రమే ఇస్తామని, ఆధార్, వన్‌బి తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు చెప్పడంతో క్యూ లైన్‌లో ఉన్న రైతన్నలు ఆధార్, వన్‌బి కోసం పరుగులు తీశారు. క్యూలైన్లలో కాసేపు గందరగోళ వాతావరం నెలకొంది. విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారి అనసూయ, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ కొంకి అప్పారావు, పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న మాల్యాద్రి

తురకపాలెంలో క్వారీ నీటిని పరీక్షించాలి

- మృతుల్లో 26 మంది ఎస్‌సి కాలనీ వాసులే
- గ్రామాన్ని సందర్శించిన కెవిపిఎస్ బృందం

ప్రజాశక్తి-గుంటూరు

తురకపాలెంలో ప్రజలకు సరఫరా చేసిన క్వారీ నీటిని పరీక్ష చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. శనివారం కెవిపిఎస్ బృందం ఈ గ్రామాన్ని సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాల్యాద్రి మాట్లాడుతూ నెలక్రితం వరకూ క్వారీలో నీటిని ప్రజలకు సరఫరా చేశారని తెలిపారు. గ్రామంలో 16 చోట్ల నీటిని పరీక్షించిన ప్రభుత్వం, క్వారీలో నీటిని మాత్రం పరీక్షించలేదన్నారు. మృతులలో అత్యధికంగా 26 మంది ఎస్‌సి కాలనీ వాసులు ప్రజలు ఉన్నారని, తక్షణమే క్వారీ నీటినీ పరీక్షించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారికి రూ.25 లక్షల చొప్పున పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, వైద్యం పొందుతున్న వారి ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరించాలని కోరారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని హెల్త్ క్లినిక్‌ను బలోపేతం చేయాలని, వైద్యశిబిరాన్ని కొనసాగించాలని కోరారు. గ్రామంలో పారిశుధ్యం, రోడ్లు సరిగాలేవన్నారు. ఇతర ప్రాంతాల నుండి కార్మికుల్ని రప్పించి నీటిని శుభ్రం చేయిచండంతోపాటు నిరంతర పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గ్రామంలో రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సుగాలి ప్రీతి కేసు విషయంలో ఆమె తల్లి న్యాయం అడిగినందుకు జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు బెదిరింపు ధోరణిలో మాట్లాడడం సరికాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సుగాలి ప్రీతి కేసును ఎన్నికల స్టంట్‌గా ఉపయోగించుకున్న పవన్ అధికారంలోకి రాగానే ఎందుకు న్యాయం చేయట్లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాన్ని సందర్శించిన వారిలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జె నవీన్‌ప్రకాష్, ఉపాధ్యక్షులు జి లూథర్‌పాల్, నాయకులు జె వెంకటస్వామి, సిఐటియు నగర కార్యదర్శి బి ముత్యాలరావు, ఖాసిం షహీద్ ఉన్నారు.



గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న సురేంద్ర తదితరులు

హైడ్రో ప్రాజెక్టుల ఒప్పందాలు రద్దు చేయండి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణ ఒప్పందాలను, జిఒ 51ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి అరకులోయలో ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ మజ్జి సురేష్ కుమార్, కో-కన్వీనర్ మజ్జి కృష్ణంరాజు, బూర్జ ఎంపిటిసి మజ్జి హరి, కమిటీ సభ్యులు కొర్ర బొంజుబాబు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలోని చిట్టంవలస, కుసుమవలస, గుజ్జేలి, పెదకోటల్లో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి జిఒ 51ని విడుదల చేసిందని తెలిపారు. ఈ క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణానికి చేస్తున్న సర్వేలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీసా, గ్రామ సభ తీర్మానం లేకుండా హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం ఎలా చేస్తారన్నారు. చిట్టంవలస, కుసుమవలస వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం డ్యాం చేపడితే బూర్జ, వెంగడ, వాలసి, పెదబిడ్డ, టోకూరు, బస్కీ పంచాయతీల్లోని గ్రామాలు, అనంతగిరి మండలం గుజ్జేలిలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడితే లోతేరు, గుమ్మకోట పంచాయతీ పరిధిలోని 120 గిరిజన గ్రామాల్లోని 10 వేల మంది ఆదివాసిలు జలసమాధి అవుతారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఒప్పందాలు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుంకరమెట్ట సర్పంచ్ జి.చిన్నబాబు, బూర్జ పంచాయతీ గ్రామస్తులు, పీసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో 77 వేల టన్నుల ఎరువులు

- సిఎం చంద్రబాబు
- రబీకి వెబ్‌ల్యాండ్, ఇ-పంట ఆధారంగా ఎరువులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో ఎరువుల సరఫరా సక్రమంగా జరుగుతోందని, రైతులకు డిమాండు మేరకు అందుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎరువుల లభ్యత, సరఫరా అంశంపై జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, వ్యవసాయశాఖ అధికారులతో సిఎం శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎరువుల సరఫరాపై ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమీక్ష నిర్వహించారు. అధికారులు ఇచ్చే సమాచారంతోపాటు ఆయా జిల్లాల నుంచి తెప్పించుకున్న సమాచారాన్ని పోల్చి ఎంత స్థాయిలో అందుబాటులో ఉన్నాయో వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 77,396 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. మరో 10 రోజుల్లో 41 వేల టన్నుల ఎరువులు రాష్ట్రానికి అదనంగా రానున్నాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

బాపట్ల, కృష్ణా, వైఎస్‌ఆర్ కడప జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొరత ఉందని, ఆ సమస్యను పరిష్కరించేందుకు ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. సమస్యను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నుంచి జిల్లా కలెక్టరు వరకూ క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎరువుల సరఫరాను పరిశీలించాలన్నారు. ఎరువుల లభ్యత గురించి రైతులకు వివరించి వాళ్లు ఎటువంటి ఇబ్బందీ పడకుండా చూడాలన్నారు. అందరికీ ఎరువులు అందుతాయనే భరోసాను రైతులకు కలిగించాలని చెప్పారు. వచ్చే రబీలో వెబ్‌ల్యాండ్, ఇ-పంట అనుసంధానంతో రైతుల ఆధార్ ఆధారంగా ఎరువుల సరఫరా చేపట్టాలని సిఎం తెలిపారు. దీనికోసం ఇప్పటి నుంచే సమాయత్తం కావాలన్నారు. ఎవరు ఎంత పంట వేస్తారో ఇ-పంట నమోదు ద్వారా చూసి వారికి అవసరమైన మేరకు ఎరువులు ఇచ్చే మెకానిజం తీసుకురావాలని అన్నారు. కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి బాధ్యత తీసుకుని రైతులకు ఎరువుల సరఫరాపై అవగాహన కల్పించడాన్ని ముఖ్యమంత్రి ప్రసంశించారు. అన్ని జిల్లాల్లో ఈ తరహా కార్యక్రమం చేపట్టి ఎరువులు సరఫరాలో ఉన్న అన్ని అనుమానాలనూ తొలగించాలన్నారు.



ఎంపి మిథున్‌రెడ్డికి మధ్యంతర బెయిల్

- 11న లొంగిపోవాలని షరతు
- మరో ముగ్గురికి బెయిల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో,
రాజమహేంద్రవరం ప్రతినిధి

మద్యం కేసులో నలుగురు నిందితులకు స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మందిని సిట్ అధికారులు అరెస్టు చేయగా వారిలో నలుగురికి బెయిల్ శనివారం వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జైలులో రిమాండ్ ఖైదీగా ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి శనివారం విజయవాడ ఎసిబి కోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు వీలుగా కోర్టు అనుమతినిచ్చింది. తిరిగి ఈ నెల 11న సాయంత్రం 5 గంటలలోపు రాజమండ్రి సెంట్రల్ జైలులో సరెండర్ కావాలని ఎసిబి కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎంపి మిథున్ రెడ్డి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. ఇదే కేసులో కీలక నిందితులుగా సిట్ భావిస్తున్న వారిలో ఎ-31 ధనంజయ్‌రెడ్డి, ఎ-32 కృష్ణమోహన్‌రెడ్డి, ఎ-33 బాలాజీ గోవిందప్పకు ఎసిబి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరు రూ.లక్ష, రెండు పూచీకత్తులు చొప్పున ష్యూరిటీ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ ముగ్గురు నిందితులు విదేశాలకు వెళ్లకుండా వారి పాస్‌పోర్టులు అందించాలని పేర్కొంది.

లిక్కర్ కేసులన్నీ రాజకీయ కుట్రే

- వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజకీయ కుట్రలో భాగంగానే లిక్కర్ స్కాం పేరుతో అక్రమ కేసులు బనాయించారని వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అక్రమ కేసులన్నీ న్యాయస్థానాల ముందు నీరుగారిపోతున్నాయని తెలిపారు. న్యాయవ్యవస్థ ముందు సిట్ దర్యాప్తులోని డొల్లతనం బయటపడిందని పేర్కొన్నారు. లిక్కర్ స్కాం ఛార్జిషీటులో 21 అభ్యంతరాలు ఉన్నాయని, వాటిని న్యాయస్థానం ఎత్తి చూపిందని పేర్కొన్నారు. 90 రోజుల్లో ఎక్కడ బెయిల్ వస్తుందోననే భయంతో 88వ రోజున తప్పులతో కూడిన ఛార్జిషీటును దాఖలు చేశారని పేర్కొన్నారు. తప్పుల తడకలుగా ఉండటంతో డిఫాల్ట్ బెయిల్ వేయడంతో పలువురికి కోర్టు బెయిల్ ఇచ్చిందన్నారు.

తాడిపత్రికి కేతిరెడ్డి పెద్దారెడ్డి

- భారీ బందోబస్తు నడుమ తన ఇంటికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దాదాపు 15 నెలల తర్వాత అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామం తాడిపత్రిలోని తన ఇంటికి వెళ్లారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దారెడ్డిని తాడిపత్రికి రానివ్వబోమంటూ మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై పెద్దారెడ్డి హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారు. పలుమార్లు తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించినా శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందన్న కారణంతో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డిని తాడిపత్రికి పంపే బాధ్యతను జిల్లా పోలీసులు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. శనివారం ఉదయం జిల్లా ఎస్‌పి జగదీష్ పర్యవేక్షణలో దాదాపు 300 మంది పోలీసులు తాడిపత్రిలోని ఇంటికి తీసుకువెళ్లారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గట్టి బందోబస్తు నిర్వహించారు. తన ఇంటికి వెళ్లిన అనంతరం పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను ప్రజాస్వామ్యబద్ధంగానే నడుచుకుంటానని, తాడిపత్రిలో శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. ప్రస్తుతం పోలీసుల ఆంక్షలు ఉన్నాయని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ తన ఇంటి వద్దకు రావొద్దని కోరారు. కొద్దిరోజుల తర్వాత తానే ప్రతి కార్యకర్త వద్దకు వచ్చి కలుసుకుంటానని తెలిపారు.

రైతు సమస్యలపై ప్రభుత్వం మొద్దునిద్ర

- 9న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
- పోస్టర్ ఆవిష్కరణలో సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు సమస్యలపై కూటమి సర్కారు మొద్దునిద్ర పోతోందని, నిరసనగా ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడం ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపించాలని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైసిపి ఆధ్వర్యాన చేపట్టనున్న అన్నదాత పోరు పోస్టర్‌ను శనివారం తాడేపల్లి వైసిపి కార్యాలయంలో సజ్జల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి నేతల కనుసన్నల్లోనే యూరియా బ్లాక్ మార్కెట్ దందా నడుస్తోందని ఆరోపించారు. అడిగిన రైతులను వేధిస్తోందని, రాష్ట్రంలో అన్ని పంటలకూ గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహించడం ద్వారా సర్కారు మెడలు వంచుతామని, వారికి న్యాయం జరిగే వరకూ ఊరుకునేది లేదని అన్నారు. 9న రాష్ట్రంలో ఉన్న అన్ని ఆర్‌డిఒ కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించాలని, టమాట, ఉల్లి, చీనీ, బొప్పాయితోపాటు రైతులు పండించే అన్ని పంటలకూ మద్దతు ధర చెల్లించాలని కోరారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి మార్కెట్లో పోటీ పెంచాలన్నారు. ప్రైవేటు వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ఒప్పించి రైతులకు అండగా నిలవాలని కోరారు. యూరియా కోసం డిపోల వద్ద కిలోమీటర్ల దూరం క్యూలైన్లు ఏర్పాటవుతున్నాయని పేర్కొన్నారు. యూరియా ఇవ్వలేని ఉప ముఖ్యమంత్రి కేన్సర్ వస్తుందంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి వెలంపల్లి, మాజీ ఎంపి నందిగం సురేష్, పార్టీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు టిజెఆర్ సుధాకర్‌బాబు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పలువురు పాల్గొన్నారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు చంద్రబాబు పచ్చజెండా : విడదల రజిని

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు సిఎం చంద్రబాబు పచ్చజెండా ఊపారని మాజీ మంత్రి విడదల రజిని విమర్శించారు. ఆరోగ్యశ్రీలో ఇన్సూరెన్స్ విధానానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఇది పూర్తిగా ప్రజావైద్య రంగాన్ని నిర్వీర్యం చేయడమేనని పేర్కొన్నారు. రూ.8,500 కోట్ల వ్యయంతో చేపట్టిన 17 కొత్త మెడికల్ కళాశాలల్లో ఐదు ప్రారంభమయ్యాయని వివరించారు. ఈ ఏడాది ప్రారంభానికి మరో ఐదు సిద్ధంగా ఉన్నాయని, వాటిని ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.

జగన్ హయాంలో వైద్యరంగ నిధులు దుర్వినియోగం

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ జగన్ పాలనలో వైద్యరంగ నిధులు దుర్వినియోగమయ్యాయని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి హయాంలో 17 మెడికల్ కళాశాలలు స్థాపించినట్లు ప్రచారం చేసినప్పటికీ వాస్తవంగా విజయనగరం, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి, నంద్యాల కళాశాలల నిర్మాణాలు ప్రారంభించినప్పటికీ అవి కూడా అసంపూర్తిగా వదిలేశారన్నారు. పిపిపి మోడల్‌లో 10 కొత్త మెడికల్ కాలేజీలను స్థాపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంతేకాకుండా ఆయా కళాశాలలను చారిటబుల్ ట్రస్ట్ లేదా సెక్షన్ 8 కంపెనీల ద్వారా లాభాపేక్ష లేకుండా సేవా భావంతో నిర్వహించబడతాయని పట్టాభి తెలిపారు. ఇందులో దోపిడీ ఎక్కడ జరిగిందో జగన్ నిరూపించాలని డిమాండ్ చేశారు.



ఎలన్ మస్క్‌కు రూ.88 లక్షల కోట్ల జీతం..!

వాషింగ్టన్ : టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ముందుకు ఆ కంపెనీ కనీవినీ ఎరుగని జీతాన్ని ప్రతిపాదించింది. టెస్లాకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా ఉన్న మస్క్‌కు ఏకంగా ఏడాదికి లక్ష కోట్ల డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.88 లక్షల కోట్లు) విలువైన ప్యాకేజీని ఆఫర్ చేసింది. అయితే దీనికి చాలా కఠినమైన షరతులను విధించింది. వాటిని అధిగమిస్తే ఈ ప్యాకేజీ పొందవచ్చని ప్రతిపాదించింది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.03 ట్రిలియన్లుగా ఉండగా.. దీనిని 2 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలి. సంవత్సరానికి 2 కోట్ల వాహనాలు డెలివరీ చేయాలి. 10 లక్షల సెల్ఫ్ డ్రైవింగ్ రోబో టాక్సీలను ఉత్పత్తి చేయాలి. 10 లక్షల హ్యూమనాయిడ్ ఎఐ బాట్స్ రూపొందించాలి. టెస్లాలో మస్క్ కనీసం 7.5 సంవత్సరాలు కొనసాగాలి. సిఇఒ పదవికి వారసత్వ ప్రణాళిక రూపొందించాలని తదితర షరతులను విధించింది. ఈ ప్రతిపాదనను టెస్లా వాటాదారుల వార్షిక సమావేశంలో ఓటింగ్‌కు ఉంచనుందని తెలుస్తోంది.

భారత ఇంజనీరింగ్ ఎగుమతులకు రూ.70వేల కోట్ల నష్టం

- ట్రంప్ అధిక టారిఫ్‌ల ప్రభావం



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు భారత ఇంజనీరింగ్ ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీయనున్నాయి. ఈ సుంకాలతో భారతదేశం నుండి అమెరికాకు చేసే ఇంజనీరింగ్ ఎగుమతులు 7.5 నుండి 8 బిలియన్ డాలర్ల మేర తగ్గుముఖం పట్టనున్నాయని అంచనా. భారత కరెన్సీలో ఈ విలువ దాదాపు రూ.70వేల కోట్లు కావడం తీవ్ర ఆందోళనకరం. "ట్రంప్ అధిక సుంకాలతో ఇప్పటికే వ్యాపారం 50 శాతం తగ్గింది. పూర్తి టారిఫ్ ప్రభావం అమలులోకి రాకముందే ముందస్తుగా పంపిన ఎగుమతుల తర్వాత కొత్త ఆర్డర్లు నిలిచిపోయాయి." అని ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఇఇపిసి) ఛైర్మన్ పంకజ్ చద్దా తెలిపారు. ఆర్థిక సంవత్సరం 2024-25లో అమెరికాకు 20 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.75 లక్షల కోట్ల) ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇందులో 5 బిలియన్ డాలర్లు స్టీల్, అల్యూమినియం సంబంధిత ఉత్పత్తులు, 2.6 బిలియన్ డాలర్లు ఆటో రంగం ఎగుమతుల నుండి, మిగిలిన 12.5 బిలియన్ డాలర్లు ఇతర ఇంజనీరింగ్ వస్తువుల నుండి నమోదయ్యాయి. ఈ రంగం భారత సరుకు ఎగుమతులలో అత్యంత ముఖ్యమైందిగా ఉంది. మొత్తం ఎగుమతులలో నాలుగో వంతు కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. స్టీల్, అల్యూమినియం ఎగుమతులు 20 శాతం పడిపోవచ్చని అంచనా వేశారు. 12.5 బిలియన్ డాలర్ల విలువైన ఇతర ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతుల్లో ప్రధాన సవాల్ నెలకొని ఉంది. వీటిలో 50 శాతం పడిపోవచ్చని పరిశ్రమ వర్గాలు ఆందోళనలో ఉన్నాయి.

వినాయక నిమజ్జనంలో విషాదం

- సముద్రంలో మునిగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కొత్తపట్నం (ప్రకాశం జిల్లా)

వినాయక నిమజ్జన కార్యక్రమానికి వెళ్లి.. ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి.. ఇద్దరు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ప్రతి సంవత్సరం కొత్తపట్నం మండలం, మోటుమాల గ్రామంలోని వినాయక నిమజ్జనాలు అన్నీ ఒకేరోజు గుండుమాల సముద్ర తీరంలో జరుపుకుంటారు. ఈ సంవత్సరం కూడా శనివారం నిమజ్జనాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంటకు నిమజ్జన కార్యక్రమం ముగించుకొని అందరూ ఇళ్లకు చేరారు. మోటుమాల గ్రామానికి చెందిన పురిని నాగరాజు (50), సముద్రంలో కొట్టుకుపోతుండగా ఆయనను కాపాడేందుకు పురిని పాలచంద్రరావు (45) ప్రయత్నించగా ఇద్దరూ కొట్టుకుపోయి మృతి చెందారు. నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు, పాలచంద్రరావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్‌ఐ వి.సుధాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిఎస్‌టి కొత్త స్లాబులతో రాష్ట్రానికి మరింత ఆదాయం

- బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిఎస్‌టి కొత్త స్లాబులతో రాష్ట్రానికి మరింత ఆదాయం వస్తుందని, ప్రజల కొనుగోలు శక్తి పెరిగేలా నూతన జిఎస్‌టి స్లాబులను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎపి బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన జిఎస్‌టి సంస్కరణలను కూటమి ప్రభుత్వం స్వాగతిస్తోందన్నారు. కొత్త స్లాబులతో వ్యవసాయ, వ్యాపార, రియల్ ఎస్టేట్ రంగాలకు భారీ ఊరట లభిస్తుందని, పౌల్ట్రీ, పాడి పరిశ్రమల అభివృద్ధికి మరింత ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

కాలువలో జారి చిన్నారి మృతి

- తల్లి బహిర్భూమికి తీసుకెళ్లిన సమయంలో ఘటన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తల్లి తనతోపాటు బహిర్భూమికి తీసుకెళ్లిన ఆరు నెలల చిన్నారి కాలువలో జారి ప్రాణాలు కోల్పోయిన ఘటన చిత్తూరు జిల్లా తిరుపతిలోని కొరమేను గుంటలో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొరమేను గుంటకు చెందిన భూపతి భార్య, తన ఆరు నెలల చిన్నారితో కలిసి నివసిస్తున్నాడు. భార్య తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్తూ కుమార్తెను కూడా తీసుకెళ్లింది. అక్కడ కాలువ దాటుతుండగా చిన్నారి కాలువలో పడిపోయింది. అయితే ఈ విషయాన్ని ఇంట్లో చెప్పేందుకు భయపడి పాప కనిపించడం లేదంటూ భర్తకు చెప్పింది. వెంటనే తండ్రి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మూడు ప్రత్యేక బృందాలతో జిల్లావ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్‌పి హర్షవర్ధన్ రాజు అక్కడ పరిస్థితులను పరిశీలించారు. సిసి కెమెరాల ద్వారా ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులను నిలదీయగా చిన్నారి తల్లి అసలు విషయం పోలీసులకు తెలిపింది. దీంతో, పోలీసులు కాల్వలో గాలించడంతో చిన్నారి మృతదేహం బయటపడింది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సంపాదకీయం

డిజె కల్చర్ !

తెలుగు సంస్కృతి సంగీతం...ఆనందానికి, ఉత్సాహానికి, ఆత్మీయతలకు ప్రతీక. 'సంగీతం దేవ భాష' అంటాడు ప్రముఖ జర్మన్ స్వరకర్త, పియానిస్ట్ లుడ్విగ్ బేతోవెన్. 'డప్పు' అనే పదం వినగానే మనకు గుర్తొచ్చేది ఊరంతా గర్జించే జాతర, పల్లె ప్రజల ఉత్సాహం, ఆత్మీయత. మన సంప్రదాయ వాయిద్యాలనగానే... డప్పు, తబల, తాళం, హార్మోనియం, సన్నాయి, నాదస్వరాలు వంటివి చప్పున గుర్తొస్తాయి. పుట్టుక నుంచి చావు వరకూ సందర్భాన్ని బట్టి ఒక్కో వాయిద్యాన్ని ఒక్కోరకంగా పలికిస్తారు. సంగీత కళాకారుల పేరు ఊరువాడా మారుమోగిపోతుండేది. పండిత పామరులను రంజింపజేసే ఈ కళ క్రమేణా మసకబారుతోంది. ఈ రోజుల్లో డప్పు శబ్దం వినిపించడమే అరుదైపోయింది. కచేరీలు, నాదస్వర విద్వాంసులు పెద్దపెద్ద నగరాలకే పరిమితమై పోయారు. కానీ, పల్లె సంస్కృతిలో సంగీతం ఒక జీవన విధానం. పుట్టుకలు, పెళ్ళిళ్లకు తాళం వాయించి శుభం కోరేవారు. చనిపోయినప్పుడు నాదస్వరంతో గౌరవించేవారు. డప్పు, తంబుర, శెణాయి, నాదస్వరాలు... కేవలం వాయిద్యాలు మాత్రమే కాదు...ఒక భావవ్యక్తీకరణలు. ఈ సహజ సంగీత సౌరభాన్ని కృత్రిమ శబ్దాలను గర్జించే బాక్సులు మింగేస్తున్నాయి. సందర్భంతో పనిలేకుండా కృత్రిమ శబ్దాల వికృత గర్జనలు జనాన్ని కకావికలం చేస్తున్నాయి. 'భూమిపై స్వర్గం వుందంటే... అది సంగీతమే' అంటాడు ప్రముఖ రచయిత అమీర్ ఖుస్రో. ఇప్పుడు మనం ఆ స్వర్గాన్ని కోల్పోతున్నాం.

ఇటీవల కాలంలో, సంప్రదాయ సంగీతం రూపం మారిపోయింది. లయబద్ధంగా సాగే డప్పుల మోత, పారాయణాలు, గజల్స్, శెణాయి వంటి వాయిద్యాలు వినబడాల్సిన చోట కూడా డిజె బాక్సుల చప్పుళ్లు వినిపిస్తున్నాయి. 'స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లి లాంటిదే బ్రదర్' అంటారు ఆచార్య ఆత్రేయ. పుట్టుక, పెళ్లి, మరణ సంస్కారాల్లో డిజె తప్పనిసరి అనే కొత్త ఆచారం ఏర్పడింది. ఈ మార్పు వెనుక ఆనందం ఎంతుందో... విషాదం అంతకంటే ఎక్కువగానే వుందని ఇటీవల జరుగుతున్న అనేక సంఘటనలు రుజువు చేస్తున్నాయి. డిజె బాక్సుల నుంచి వెలువడే అధిక శబ్దాల వల్ల గుండెపోటు, మానసిక ఒత్తిడి, వృద్ధులకు ఆరోగ్య సమస్యలు, చిన్నారుల చెవులకు వినికిడి లోపం వంటి అనేక వైద్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. మామూలు వ్యక్తులకు కూడా డిజె శబ్దాల ఉధృతికి గుండె వేగం ఒక్కసారిగా పెరిగిపోతోంది. అంతేకాదు, కొన్నిసార్లు డిజె వేడుకల సమయంలో జరిగే గొడవలు, వాహన ప్రమాదాలు, మద్యం మత్తులో జరిగే హింసాత్మక సంఘటనలు మరణాలకు దారితీస్తున్నాయి. తాజాగా విజయనగరంలో వినాయక ఊరేగింపులో పాల్గొన్న ఓ యువకుడు డిజె శబ్దాల హోరులో గుండె ఆగి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆనందంగా ప్రారంభమైన డిజె నృత్యం...ఆ రాత్రికి రోడ్డు ప్రమాద వార్తగానో, గుండెపోటు మృతి వార్తగానో మారిపోతోంది. హృదయాన్ని పరవశింపజేయాల్సిన సంగీతాన్ని...శబ్ద పోటీగా మార్చుకుంటున్నాం.

మనం సంగీతాన్ని మద్యం మత్తులో, శబ్ద హింసలో, వేడుకల్లో కోల్పోతున్నాం. ఇది ఆగాలి. డిజెలను పూర్తిగా నిషేధించాల్సిన అవసరం లేదు. కాని, ఈ శబ్దాల తీవ్రతను నియంత్రించాలి. సందర్భాన్ని బట్టి సంప్రదాయక సంగీతాన్ని అనుసంధానం చేసుకోవాలి. డప్పు మోగాలి, నాదస్వరం వినిపించాలి, తాళం పలకాలి. సంగీతం శోకానికి, ఆందోళనకు హేతువు కాకుండా, సాంస్కృతిక వికాసానికి, ఆత్మీయతలకు ఆలవాలం కావాలి. సంప్రదాయ కళలను పునర్జీవింపచేయాలంటే...మనం మారాలి. ప్రభుత్వాలు సంప్రదాయ కళాకారులను, కళలను ప్రోత్సహించాలి. వారికి అసరానివ్వాలి. పండుగలు, ఉత్సవాల్లో డిజెలు వాడినా, సంప్రదాయ వాయిద్యాలకు స్థానం కల్పించాలి. సంగీతం అంటే... వినికిడి సమస్యను కలిగించేలాంటి హోరెత్తే శబ్దాలు కాదని, మనసుకు ఉపశమనం కలిగించేదని యువతకు తెలియజెప్పాలి. 'ఎక్కడ మనసు భయం లేకుండా వుంటుందో...' అన్న టాగూర్ ఉదాత్త భావన మన సంగీత జీవనంలోనూ ప్రతిబింబించాలి. సంగీతం మన సంస్కృతిని చాటేదిగా వుంటే...డిజె కూడా తన స్థాయిలో అద్భుతమే. కానీ శృతి మించితే, అది దుఃఖ గీతంగా మారుతుంది. 'సంగీతం మనసుకు మధురతను కలిగించే మంత్రం' అంటాడు కాళిదాసు. ఆ మంత్రాన్ని మన జీవితాల్లోకి తీసుకురావాలి.

మహనీయుని మాట



ఒక దేశ భవిష్యత్తును అంచనా వేయాలంటే అక్కడి విద్యా విధానాలను పరిశీలించి చూస్తే చాలు.

- పి.బి. షెల్లీ, బ్రిటిష్ రచయిత.

6

ప్రాంతీయ పార్టీల వివాదాలు, బిజెపి ఒత్తిళ్లు



తెలకపల్లి రవి

బి.ఆర్.ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ కుమార్తె కవితను ఆ పార్టీ నుండి సస్పెండ్ చేయడం, తర్వాత ఆమె రాజీనామాతో మరోసారి ప్రాంతీయ పార్టీల తీరుతెన్నులు చర్చలోకి వచ్చాయి. నిజానికి ఈ చర్చ మే నెలలోనే మొదలైంది. కవిత కె.సి.ఆర్ కు రాసిన అంతర్గత లేఖ లీక్ కావడం ఇందులో మొదటి ఘట్టం. ఆ తర్వాత దాన్ని మించి సంచలన విషయాలు చెప్పి షాక్ ఇచ్చారు. తమ పార్టీని బిజెపితో విలీనం చేయడానికి పార్టీలో కీలక వ్యక్తులు కుట్ర పన్నారని, ఈ అంశం పార్టీ అధినేత దృష్టికి తీసుకు రావడానికి తాను రాసిన అంతర్గత లేఖను లీక్ చేయడం కూడా కుట్రలో భాగమని ఆమె ధ్వజమెత్తారు. కె.సి.ఆర్ దేవుడేనని కానీ చుట్టూ దయ్యాలున్నాయని తీవ్ర భాషలో మాట్లాడారు. రజతోత్సవ సభలో కె.సి.ఆర్ బిజెపి పైన రెండు నిముషాలు మాత్రమే చెప్పి కాంగ్రెస్ ఏకైక విలన్ అని ప్రకటించడం ముందే సందేహాలు పెంచగా కవిత ఆరోపణలు దాన్ని మరింత వేడెక్కించాయి. అప్పటి నుంచి ఆమెకూ పార్టీకి మధ్య దూరం పెరిగిందే గాని తగ్గింది లేదు. ఇలాంటి తరుణంలో కాళేశ్వరం అవినీతిపై కె.సి.ఆర్, హరీశ్ రావు తదితరులపైన వచ్చిన ఆరోపణలను సిబిఐ కి నివేదించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించడంతో కవిత మరోసారి బహిరంగ విమర్శలు సంధించారు. ఈ విషయంలో హరీశ్ రావు చేసిన తప్పులను కె.సి.ఆర్ ఎప్పుడో గుర్తించారనీ, అందుకే రెండవసారి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టి ఆలస్యం చేశారని వ్యాఖ్యానించారు. కె.టి.ఆర్ కూడా హరీశ్ కుట్రకు గురికావలసి వస్తుందని హెచ్చరిస్తున్న కవిత అన్నీ ఆరోపించి 'జై కె.సి.ఆర్' అంటూ ముగించడం కొసమెరుపు. బిజెపి తో విలీనం అంటూ గతంలో లేఖ రాసిన ఆమె ఇప్పుడు ఆ ఊసే తీసుకురాలేదు. రేవంత్ రెడ్డి పైనే కుట్ర ఆరోపణ చేయడం మరో విశేషం. ఇదంతా జరిగినప్పుడు లండన్‌లో వున్న హరీశ్ రావు శుక్రవారం రాత్రి తిరిగి రాగానే ఇతరులు చేసిన ఆరోపణలనే ఆమె వినిపించారనీ వాటిని తన విజ్ఞతకే వదిలేస్తున్నానని సరిపెట్టారు. కె.టి.ఆర్, అలాగే అధికారిక ప్రతినిధులు నాయకులూ కూడా తాము హరీశ్‌తోనే వున్నామని స్పష్టం చేస్తూ కవితపై ధ్వజమెత్తారు. వారి కుటుంబ తగాదాలు తమకు ఆపాదించవద్దని ముఖ్యమంత్రితో సహా పాలక నేతలు ఎదురు వడ్డిస్తుంటే బిజెపి నేతలు, కేంద్రమంత్రులూ సిబిఐ విచారణకు సిద్ధమని చెప్పే బదులు ప్రభుత్వం రాసిన లేఖ సమగ్రంగా లేదని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.

ఇతరులను కుటుంబ పార్టీలుగా తిట్టిపోసే బిజెపి లోనూ వారసత్వాల జాబితా పెద్దదే. రాజ కుటుంబాలు కార్పొరేట్ సంబంధాలు మరీ ఎక్కువ. ఆ యా పార్టీలలో తల దూర్చి రకరకాల ప్రలోభాలు, బెదిరింపులతో తన పట్టు పెంచుకోవడం దాని వ్యూహం. ఇందులో భాగంగానే ప్రధాని మోడీ యువ నాయకులతో ఎక్కువగా కలసి వ్యవహరిస్తుంటారు. ఆ పైన కేసుల ప్రయోగం మరొకటి. ఏమైనా పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యం కాపాడుకోవలసింది ఆ పార్టీల నాయకులూ శ్రేణులే. బి.ఆర్.ఎస్ అంతర్గత వివాదాలలోనూ ఈ లక్షణాలన్నీ వున్నాయి. ఇందులో బిజెపి / కేంద్రం తెర వెనక నిర్వహించే పాత్ర ఏమిటో త్వరలో తెలియకపోదు. ఎందుకంటే తెలంగాణలో రెండు పార్టీలూ బిజెపితో కుమ్మక్కు అయినట్టు పరస్పరం ఆరోపిస్తుంటాయి. ఎ.పి లో మూడు ప్రాంతీయ పార్టీలదీ అదే పరిస్థితి.



ఎ.పి తో ముడి?

ఈ పరిణామాల తర్వాత బి.ఆర్.ఎస్ ఎలా వుంటుందనేది ఒకటైతే రేవంత్ రెడ్డి ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలసి తమపై కుట్ర చేస్తున్నారని వారి ఆరోపణగా వుంటోంది. కాంగ్రెస్ బిజెపి కూటమితో కలసి ఎలా వ్యవహరిస్తుందనేది ఒక చిక్కు ప్రశ్న అయితే బి.ఆర్.ఎస్ నాయకులు కూడా తమ వంతు ఆరోపణలు తేవడం జరుగుతున్నది. కె.సి.ఆర్ మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌తో కలసి వ్యవహరిస్తున్నారని టిడిపి దాన్ని బలపర్చే మీడియా వాదనగా వుంది. నిజానికి బనకచర్ల నుంచి ప్రతి సందర్భంలోనూ తెలంగాణలో బి.ఆర్.ఎస్ చంద్రబాబు ప్రసక్తి తేవడం తప్పనిసరి వ్యవహారంగా మారింది. ఇదేగాక ఇంకో విధంగా కూడా ఎ.పి రాజకీయాలు చర్చకు వస్తున్నాయి. వై.ఎస్ కుటుంబంలో జగన్ కూ ఆయన సోదరి వై.ఎస్ షర్మిలకూ మధ్య వచ్చిన పదవీ వివాదాలను, ఆస్తి తగాదాలను ఈ ఉదంతంతో పోల్చి మాట్లాడటం జరుగుతున్నది. షర్మిల మొదట తెలంగాణ రాజకీయాలలో ప్రవేశించి, వైఎస్ఆర్‌టిపి పెట్టి చాలా హడావుడి చేశారు. సరిగ్గా ఎన్నికల తరుణంలో అటూ ఇటూ ఊగిసలాడి చివరకు కాంగ్రెస్‌లో విలీనమైనట్టు ప్రకటించారు. ఆ తర్వాత ఎ.పి కి కార్యక్షేత్రం మార్చి ఎపిసిసి అధ్యక్షురాలయ్యారు. 2024 ఎన్నికలలో ఆమె రాజకీయంగా కనీస పభావం చూపింది లేదుగానీ అప్పటి ముఖ్యమంత్రిపై చెల్లెలే విమర్శ చేయడం అన్నది కూటమికి ప్రచారాస్త్రమైంది. ప్రతికూల తీర్పునకు అదీ ఒక కారణమై వుండొచ్చు. అయితే కూటమి వచ్చాక కూడా షర్మిల ఇదే ధోరణి కొనసాగించడం కాంగ్రెస్‌కు సమస్యగా మారింది. తమ కుటుంబ తగాదాలే ముందుకు తెస్తూ కాంగ్రెస్ రాజకీయ విధానాంశాలనూ స్వంత పెరుగుదలనూ పక్కదోవ పట్టిస్తున్నారని కొంతమంది ఎ.పి నేతలు ఫిర్యాదు చేయడం తెలిసిందే.

ఎందుకీ కలహాలు?

అయితే ప్రాంతీయ నేతల కుటుంబాలలో వ్యక్తుల మధ్య ఆస్తులు, అధికారాల పంపిణీలలో తేడాలు ఇప్పుడు పరిపాటి. తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ నుంచి ఇప్పుడు బి.ఆర్.ఎస్ వ్యవస్థాపకుడు కె.సి.ఆర్ వరకూ ఇలాంటి కీచులాటలు సాగుతూనే వున్నాయి. తమిళనాడులో డి.ఎం.కె అధినేత కరుణానిధి కుమారుడైన అలగిరిని సస్పెండ్ చేస్తే అన్నా డి.ఎం.కె లో ఎం.జి.ఆర్ మరణం తర్వాత జానకి, జయలలిత ఘర్షణ సాగింది. చివరకు జయలలితే నిలబడినా ఆమె ఆఖరి దశలో శశికళ ముప్పు తిప్పలు పెట్టారు. ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ నుంచి ముఖ్యమంత్రిగా వున్న అఖిలేశ్ యాదవ్‌కూ ఆయన బాబాయి శివలాల్ యాదవ్‌కూ తీవ్ర పోటీ నడిచింది. బీహార్ ఆర్.జె.డి లో తేజస్వి యాదవ్ కీలక నేతగా ఎదిగిన నేపథ్యంలో మరో సోదరుడైన తేజ్ ప్రతాప్‌ను లాలూ ప్రసాద్ యాదవ్ బయటికి పంపించాల్సివచ్చింది. కర్ణాటకలో దేవెగౌడ కుటుంబంలోనూ రేవణ్ణ కుమారస్వామి గౌడ తగాదా తెలిసిందే. మహారాష్ట్రలో ఉద్ధవ్ ధాకరే, రాజ్ ధాకరేలు అలాగే విడిపోయి మళ్లీ ఇటీవలే కలిశారు. ఎన్‌సిపిలో శరద్ పవార్‌కూ అజిత్ పవార్‌కూ ఇలాంటి తగాదాలే నడిచాయి. ఆయన కుమార్తె సుప్రియా సూలేను శరద్ పవార్ పైకి తేవడం అజిత్‌కు మింగుడు పడలేదు. ఆ రాజకీయ నాటకం చాలా కాలం చాలా మలుపులతో నడిచింది. ఇతర రాష్ట్రాలలోనూ ఇలాంటి చాలా ఉదాహరణలున్నాయి. సమస్య ఏమిటంటే వీటికి విధానాలు, ప్రజా ప్రయోజనాలతో ఏ సంబంధం లేదు. వ్యక్తిగతంగా తమకు, తమ వర్గానికి పదవులు దక్కలేదన్న అసహనం, అక్రమ సంపాదనలో అవతలి వారికి అధిక భాగం దక్కిందనే ఉక్రోశం ఈ తరహా తగవులకు కారణమవుతుంటాయి. ఎక్కడైనా ఆ వ్యక్తులు కుటుంబ సభ్యులైనంత మాత్రాన రాజకీయాలలో పాల్గొనరాదని, పార్టీలలో వుండరాదని ఎవరూ అనరు. వారి ఉత్సాహం ఆసక్తితో పాటు ప్రజాస్వామిక హక్కుగా కూడా పాల్గొనవచ్చు. ఒకే కుటుంబ సభ్యులు విధానాల పరంగా వేర్వేరు రాజకీయాలతో పని చేయడం కూడా చూస్తాం. కానీ ప్రజాస్వామ్యంలో అధికారం ఇవ్వవలసిన వారు ప్రజలే. తమ వారసత్వాలు, బంధుత్వాల ఆధారంగానే అధికారంలోనో లేదా ఆర్థిక ప్రయోజనాలలోనో పెద్ద పీట కావాలనే పేచీలు ప్రజలకు సంబంధం లేనివి. అక్రమ పద్ధతులూ ఆశ్రిత పక్షపాతాలు తప్పు కూడా. ప్రాంతీయ పార్టీలలో ఆ నాయకుల కుటుంబాలు వుంటేనే నిలబడతాయనే వాదన వుంటుంది. ఆ పార్టీల వెనక ఖచ్చితంగా ఆర్థిక, సామాజిక శక్తులు వుంటాయి. అయితే ఆ క్రమంలో ఎవరి పట్ల ఏ వైఖరి తీసుకోవాలనే దానిలో వ్యూహాలు మారడం వల్లనే ఈ తరహా తగాదాలు పెరుగుతాయి. వాటిలో కొన్ని వ్యతిరేకంగా మారినప్పుడు ఆ పార్టీలు చీలిపోవడం లేదా కలహించుకోవడం చూస్తాం. ఎన్టీఆర్ స్థానంలో చంద్రబాబు ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చి 30 ఏళ్లు పూర్తయిన సమయంలో తెలుగువారికి ఆ సంగతులు గుర్తు రావడం సహజం. ఇప్పుడు లోకేశ్ నాయకత్వం గురించి చంద్రబాబుతో సహా బహిరంగంగానే సంకేతాలివ్వడం జరుగుతున్నది. చంద్రబాబు తరచూ తరాల మార్పు గురించి కూడా ప్రస్తావిస్తున్నారు. మరోవైపున కేవలం ఎన్టీఆర్ మనవడనే కారణంతో హీరో ఎన్టీఆర్‌ను వారసుడవుతాడని బాబు వ్యతిరేకులు వాదిస్తుంటే వైసిపి ఎక్కువ ప్రచారమివ్వడం వారి రాజకీయ వ్యూహం. ఆయన రాజకీయాలలోకి రాకుండానే ఈ ప్రచారం చేస్తే ప్రయోజనం ఏముంటుంది? రాజకీయ పార్టీలు కుటుంబ సంస్థలు కాదు కదా? అయితే జనసేనలో కూడా పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు కీలక పాత్రలు చేపట్టడం కూడా తెలిసిందే. ప్రాంతీయ పార్టీలే గాక కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలోనూ ఈ లక్షణాలు వున్నా అక్కడ అనేక ఇతర కోణాలు పని చేస్తుంటాయి. నెహ్రూ కుటుంబంలో ఇందిరా గాంధీ తర్వాత రాజీవ్ గాంధీ ప్రధాని కావడం కూడా ఆమె దారుణ హత్య నేపథ్యంలోనే సాధ్యమైందని మర్చిపోరాదు. అయితే తర్వాత సోనియా, రాహుల్ గాంధీలు ప్రభుత్వాల సారథ్యం తీసుకోలేదు. నిర్ణయాత్మక నేతలుగానే వుండిపోయారు.

కవిత కె.సి.ఆర్ కు రాసిన అంతర్గత లేఖ లీక్ కావడం ఇందులో మొదటి ఘట్టం. ఆ తర్వాత దాన్ని మించి సంచలన విషయాలు చెప్పి షాక్ ఇచ్చారు. తమ పార్టీని బిజెపితో విలీనం చేయడానికి పార్టీలో కీలక వ్యక్తులు కుట్ర పన్నారని, ఈ అంశం పార్టీ అధినేత దృష్టికి తీసుకు రావడానికి తాను రాసిన అంతర్గత లేఖను లీక్ చేయడం కూడా కుట్రలో భాగమని ఆమె ధ్వజమెత్తారు. కె.సి.ఆర్ దేవుడేనని కానీ చుట్టూ దయ్యాలున్నాయని తీవ్ర భాషలో మాట్లాడారు. రజతోత్సవ సభలో కె.సి.ఆర్ బిజెపి పైన రెండు నిముషాలు మాత్రమే చెప్పి కాంగ్రెస్ ఏకైక విలన్ అని ప్రకటించడం ముందే సందేహాలు పెంచగా కవిత ఆరోపణలు దాన్ని మరింత వేడెక్కించాయి. అప్పటి నుంచి ఆమెకూ పార్టీకి మధ్య దూరం పెరిగిందే గాని తగ్గింది లేదు.

ఆచరణే గీటురాయి

ఇతరులను కుటుంబ పార్టీలుగా తిట్టిపోసే బిజెపి లోనూ వారసత్వాల జాబితా పెద్దదే. రాజ కుటుంబాలు కార్పొరేట్ సంబంధాలు మరీ ఎక్కువ. ఆ యా పార్టీలలో తల దూర్చి రకరకాల ప్రలోభాలు, బెదిరింపులతో తన పట్టు పెంచుకోవడం దాని వ్యూహం. ఇందులో భాగంగానే ప్రధాని మోడీ యువ నాయకులతో ఎక్కువగా కలసి వ్యవహరిస్తుంటారు. ఆ పైన కేసుల ప్రయోగం మరొకటి. ఏమైనా పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యం కాపాడుకోవలసింది ఆ పార్టీల నాయకులూ శ్రేణులే. బి.ఆర్.ఎస్ అంతర్గత వివాదాలలోనూ ఈ లక్షణాలన్నీ వున్నాయి. ఇందులో బిజెపి / కేంద్రం తెర వెనక నిర్వహించే పాత్ర ఏమిటో త్వరలో తెలియకపోదు. ఎందుకంటే తెలంగాణలో రెండు పార్టీలూ బిజెపితో కుమ్మక్కు అయినట్టు పరస్పరం ఆరోపిస్తుంటాయి. ఎ.పి లో మూడు ప్రాంతీయ పార్టీలదీ అదే పరిస్థితి. రేపు ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వీరంతా ఒకే వైపు ఓటేస్తున్నారు. కనుకనే తెలుగునాట ప్రాంతీయ పార్టీలేవీ బిజెపి మత రాజకీయాలను సూటిగా ఎదుర్కొనే పరిస్థితి లేదు. కవిత కూడా గతంలో వలె ఇప్పటికైతే బిజెపి పేరెత్తడం లేదు. ఈ అంతర్గత బహిరంగ యుద్ధాలు చివరకు ఏ మలుపు తీసుకునేది ఆచరణలో చూడవలసిందే గాని ఇలాంటి వాటితో విశ్వసనీయతకు విఘాతం అనివార్యమే. లౌకిక ఎజెండాతో తమ తమ రాష్ట్రాల ప్రజల హక్కుల కోసం నిలబడితేనే ఏ పార్టీకైనా, నాయకులకైనా సార్థకత సాధ్యం.

★

పెన్షనర్లపై సంస్కరణల ప్రభావం



పి. అజయ కుమార్

సంస్కరణల అమలులో భాగంగా 1995లో ప్రవేశ పెట్టిన మొదటి పథకం ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ (ఇ.పి.ఎస్). ప్రభుత్వం లేదా ప్రైవేటు యజమానికి బాధ్యత లేకుండా కార్మికుల డబ్బు నుండి ప్రవేశ పెట్టిన పథకం ఇది. అటు యజమానిపై బాధ్యత ఉంచకుండా, ఇటు తను ఆ బాధ్యతను మోయకుండా కేంద్ర ప్రభుత్వం ఇ.పి.ఎస్ పెన్షనర్లకు చుక్కలు చూపిస్తోంది. ఇ.పి.ఎస్ కనీస పెన్షన్ రూ.వెయ్యి నుండి రూ.2 వేలకు పెంచటానికి తన వద్ద స్తోమత లేదని లోక్‌భలో వేసిన ప్రశ్నలపై సమాధానం చెబుతోంది. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలిచ్చి, పెన్షనర్లకు మొండి చెయ్యి చూపిస్తోంది.

ఇ.పి.ఎస్ ఫండ్ నిల్వలు 2025 మార్చి 31 నాటికి రూ.9 లక్షల 93 వేల కోట్లు ఉన్నాయి. సంవత్సరానికి వడ్డీ, ఇతర ఆదాయాలు కలిపి రూ.60 వేల కోట్లు వచ్చింది. నిధికి చెల్లింపులు రూ.71,780 కోట్లు ఉన్నాయి. మొత్తం రాబడి సంవత్సరానికి రూ.లక్షా 31 వేల కోట్లు వస్తోంది. కానీ పెన్షన్ చెల్లింపులు సంవత్సరానికి రూ.23 వేల కోట్లు మించి లేవు. వచ్చే ఆదాయంలో సగం కూడా లేవు. మొత్తం 81 లక్షల మంది పెన్షనర్లలో 60 శాతం మందికి కేవలం రూ.1,500 లోపు పెన్షన్ ఇస్తున్నారు. 97 శాతం మందికి వచ్చే పెన్షన్ రూ. 4 వేల లోపు మాత్రమే.

ఇ.పి.ఎస్ నిధులు కార్మికులవి. అవి కార్మికులకే ఉపయోగపడాలి. ప్రభుత్వ విధానం దీనికి కూడా వ్యతిరేకంగా ఉంది. 2018-2019 నుండి 2023-2024 వరకు ఆరు సంవత్సరాల్లో ఇ.పి.ఎస్ నిధుల నిల్వలు 102 శాతం పెరిగితే, పెన్షన్లు ఇదే కాలంలో 27 శాతం మాత్రమే పెరిగాయి. పెన్షనర్ల సంఖ్య కూడా కేవలం 17.45 శాతమే పెరిగింది. ఇంత పెద్ద ఎత్తున నిల్వలు పోగు పడుతున్నప్పుడు 2025 మార్చి 31 నాటికి ఉన్న రూ.10 లక్షల కోట్లు ఫండ్ నిల్వలను ఖరారు చేసి, ఆపై ప్రతి సంవత్సరం వచ్చే జమలు రూ. లక్షా 30 వేల కోట్లతో ఇప్పుడు ఇచ్చే పెన్షన్ కంటే 6 రెట్లు పెన్షన్ ఎక్కువ ఇవ్వవచ్చు. పెన్షనర్లు కోరుతున్న కనీస పెన్షన్ రూ.9 వేలను సులభంగా ఇవ్వవచ్చు.

ఇ.పి.ఎస్ నిధులు కార్మికులవి. అవి కార్మికులకే ఉపయోగపడాలి. ప్రభుత్వ విధానం దీనికి కూడా వ్యతిరేకంగా ఉంది. 2018-2019 నుండి 2023-2024 వరకు ఆరు సంవత్సరాల్లో ఇ.పి.ఎస్ నిధుల నిల్వలు 102 శాతం పెరిగితే, పెన్షన్లు ఇదే కాలంలో 27 శాతం మాత్రమే పెరిగాయి. పెన్షనర్ల సంఖ్య కూడా కేవలం 17.45 శాతమే పెరిగింది. ఇంత పెద్ద ఎత్తున నిల్వలు పోగు పడుతున్నప్పుడు 2025 మార్చి 31 నాటికి ఉన్న రూ.10 లక్షల కోట్లు ఫండ్ నిల్వలను ఖరారు చేసి, ఆపై ప్రతి సంవత్సరం వచ్చే జమలు రూ. లక్షా 30 వేల కోట్లతో ఇప్పుడు ఇచ్చే పెన్షన్ కంటే 6 రెట్లు పెన్షన్ ఎక్కువ ఇవ్వవచ్చు. పెన్షనర్లు కోరుతున్న కనీస పెన్షన్ రూ.9 వేలను సులభంగా ఇవ్వవచ్చు.

మోడీ ప్రభుత్వం ఆలోచన దీనికి విరుద్ధంగా ఉంది. పార్లమెంట్‌లో పాస్ చేసిన సామాజిక భద్రత చట్టాన్ని అడ్డం పెట్టుకొని స్కీములను మార్చి పెన్షన్ నిధులను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడుల లాభాలను పెంచేందుకు వాటిని వినియోగించాలని చూస్తోంది. తమకు చెందిన నిల్వలను తమకు ఉపయోగించకుండా, ద్రవ్య పెట్టుబడుల ప్రయోజనాలకు మరల్చడాన్ని ఇ.పి.ఎస్ పెన్షనర్లు వ్యతిరేకించి పోరాడాలి.

ఇ.పి.ఎస్ పెన్షన్ సంస్కరణలకు తోడుగా స్వల్ప కాలంలోనే ఇతర పెన్షనర్లపై దాడి మొదలైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు-ఇన్సూరెన్స్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ డిపార్ట్‌మెంట్లు కార్పొరేషన్లుగా మారిన విద్యుత్తు, బి.ఎస్.ఎన్.ఎల్ లో చేరిన ఉద్యోగులు ఈ సంస్కరణల ప్రభావ తీవ్రతను ఎదుర్కొంటున్నారు. ప్రథమంగా 1997లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లపై దశలవారీగా ఖర్చు తగ్గించుకుంటామని అందులో పేర్కొంది.

1998లో వాజ్‌పేయి ప్రభుత్వం వృద్ధుల సామాజిక, ఆదాయ భద్రత పేరుతో 'సెబి' మొదటి చైర్మన్‌గా పనిచేసిన ఎస్.ఎ.దవే అధ్యక్షతన కమిటీ వేసింది. కమిటీ నివేదిక ఆధారంగా తన ఉద్యోగులకు పెన్షన్ ఇచ్చే బాధ్యత నుండి తప్పుకున్న వాజ్‌పేయి ప్రభుత్వం 2004 జనవరి 1 నుండి, ఆ తరువాత చేరిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ హక్కును హరించింది.

సర్వీసు ఆఖరి వేతనంలో 50 శాతం, దానిపైన డిఏ, కొత్త పి.ఆర్.సి వచ్చినప్పుడల్లా పెన్షన్ పెంపు ఉన్న పాత పెన్షన్ పథకం స్థానంలో, కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సి.పి.ఎస్) వచ్చింది. ఈ సి.పి.ఎస్ కాస్త ఆచరణలో ఎన్.పి.ఎస్. (నో పెన్షన్ స్కీం)గా మారింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా 2004 సెప్టెంబర్ 1 నుండి దీన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ బ్యాంకులు, ఇన్సూరెన్స్ రంగాల్లో 2010 ఏప్రిల్ 1 నుండి చేరిన ఉద్యోగులు కూడా పెన్షన్ హక్కు కోల్పోయారు.

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏపీ విద్యుత్ బోర్డును కార్పొరేషన్లుగా విడగొట్టిన తర్వాత చేరిన ఉద్యోగులు, వాజ్‌పేయి ప్రభుత్వం టెలికమ్యూనికేషన్ శాఖను బి.ఎస్.ఎన్.ఎల్ గా మార్చిన తరువాత చేరిన ఉద్యోగులు పెన్షన్ హక్కు కోల్పోయారు. అతి స్వల్పంగా పెన్షన్ వచ్చే ఇ.పి.ఎఫ్ పథకంలోకి చేర్చారు.

కొత్త పెన్షన్ పథకంలో రిటైరైన వారికి వచ్చే పెన్షన్ అతి స్వల్ప స్థాయిలో వస్తుందని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సి.పి.ఎస్. (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)ను రద్దుచేసి ఓ.పి.ఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్)ను పునరుద్ధరించాలని పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నారు. ఈ పోరాటాలను నీరుగార్చేందుకు కేంద్రంలో మోడీ ప్రభుత్వం తెచ్చిన ఏకీకృత పెన్షన్ స్కీం (యు.పి.ఎస్.), రాష్ట్రంలో వై.సి.పి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీడ్ పెన్షన్ స్కీం (జి.పి.ఎస్.) లను సి.పి.ఎస్ ఉద్యోగులు ఆమోదించలేదు.

బాండ్లలో, షేర్ మార్కెట్లలో మదుపు చేసిన సి.పి.ఎస్. నిధుల నుండి ఎక్కువ ఆదాయం రావటం లేదని ఆచరణలో తేలింది. పబ్లిక్, ప్రైవేట్ పెన్షన్ ఫండ్ మేనేజ్‌మెంట్స్ రంగంలో ఉన్నాయి. 2025 జనవరి నాటికి గత ఐదు సంవత్సరాలలో ఎల్.ఐ.సి పెన్షన్ ఫండ్ 8.94, యు.టి.ఐ పెన్షన్ ఫండ్ 8.85, ఎస్.బి.ఐ. పెన్షన్ ఫండ్ 8.59 శాతాల చొప్పున మాత్రమే ఆదాయాన్ని ఆర్జించాయి. ఇవి కూడా ద్రవ్య మార్కెట్ ఒడిదుడుకుల్లో ఎంత పోతాయి, ఎంత నిలుస్తాయనేది ఎవరూ చెప్పలేరు. ఇటువంటి స్వల్ప ఆదాయాలను పెన్షన్‌గా భావించే అవకాశం లేదు. అందుకే సి.పి.ఎస్ ఉద్యోగులు ఆందోళన చెంది పోరాటాల్లోకి వస్తున్నారు.

భద్రతతో కూడిన పాత పెన్షన్ పథకంపై కూడా మోడీ ప్రభుత్వం దాడి మొదలు పెట్టింది. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు వారి పెన్షన్ అప్‌డేషన్ లేకుండా చేస్తూ చట్టంలో మార్పు చేసింది. ఇక నుండి ఏ పి.ఆర్.సి హయాంలో ఉద్యోగ విరమణ పొందితే, ఆ పి.ఆర్.సి స్కేళ్లు, డి.ఏ ల ప్రకారం పెన్షన్ వస్తుంది. అంతకు ముందు ఉన్న పెన్షనర్ల పెన్షన్లు తాజా పర్చరు. పెన్షనర్ల మధ్య విభజన రేఖ గీసింది. రాబోయే కాలంలో పాత పెన్షన్ పథకానికి కూడా గ్యారంటీ లేని పరిస్థితి మొదలైంది.

ఒక్క వామపక్ష పార్టీలు మినహా మిగతా పాలక పార్టీలన్నీ పెన్షన్ సంస్కరణలను బాహాటంగా సమర్థిస్తున్నాయి. కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నష్టదాయకమైన ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఇ.పి.ఎస్)ను రెండో బెనిఫిట్‌గా (పి.ఎఫ్ బదులు పెన్షన్) తీసుకొస్తే, అదే కేంద్రంలో ఉన్న వాజ్‌పేయి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం, తన ఉద్యోగులకు పెన్షన్ హక్కు నిరాకరిస్తూ 2004, జనవరి 1 నుండి సి.పి.ఎస్ అమలు చేసింది. బిజెపి ని నిత్యం వ్యతిరేకించే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, 2004 సెప్టెంబర్ 1 నుండి సి.పి.ఎస్ ను అమలు చేసింది. వాజ్‌పేయి ప్రభుత్వం తీసుకొచ్చిన సి.పి.ఎస్ కు చట్టబద్ధతనిస్తూ, 2013లో కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ ప్రభుత్వం పార్లమెంట్‌లో పి.ఎఫ్.ఆర్.డి.ఏ బిల్లు ప్రవేశపెడితే వామపక్షాలు ఒక్కటే దాన్ని వ్యతిరేకించాయి. పాలక పార్టీలన్నీ బిల్లుకు అనుకూలంగా ఓటేశాయి. వామపక్ష పార్టీలు పశ్చిమ బెంగాల్, త్రిపుర, కేరళ రాష్ట్రాల్లో తాము అధికారంలో ఉన్నంతకాలం సి.పి.ఎస్ ను అమలు చేయకుండా, పాత పెన్షన్ పథకాన్ని కొనసాగించాయి.

పెన్షనర్లందరూ తమ హక్కులను కాపాడుకునేందుకు ఏక తాటి మీదకు రావలసిన అవసరం ఉంది. ఇ.పి.ఎస్, సి.పి.ఎస్, జి.పి.ఎస్, యు.పి.ఎస్ లేదా ఓ.పి.ఎస్ లతో నిమిత్తం లేకుండా ఐక్యం కావాలి. అలా అయితేనే ఉద్యోగులు, కార్మికులు తాము పని చేయగలిగిన కాలంలో... యజమానులు, ప్రజల సేవలో తమ శ్రమను ధారపోసినందుకుగాను, ఉద్యోగ విరమణ తర్వాత జీవితానికి భద్రత కల్పించే పెన్షన్ హక్కును కాపాడుకోగలుగుతారు.

దీనికోసం పెన్షనర్లందర్నీ ఐక్యం చేసే వేదికగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎ.పి.ఆర్.పి.ఎ), ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. పెన్షనర్లనే కాక పెన్షన్లు లేకుండా రిటైరైన వారిని కూడా ఐక్యం చేస్తుంది. ఒక యజమాని అంటూ లేకుండా పనిచేసి, వృద్ధాప్యంలో సామాజిక పెన్షన్లు పొందుతున్న వారిని కూడా ఏ.పి.ఆర్.పి.ఏ ఐక్యం చేస్తుంది. పెన్షనర్లందరి ఐక్యతే ఆయుధంగా పనిచేసే ఏ.పి.ఆర్.పి.ఏ రాష్ట్ర సదస్సు విజయవాడలో ఈ నెల 13న జరుగుతుంది.

/ వ్యాసకర్త ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు /



మార్పు గీతం

మరో ప్రపంచం మరో ప్రపంచం
మన ముందే నిజమై నిలుస్తోందా?
సుంకాల వంకలకు వాతలేస్తోందా?
పెద్దన్న పెత్తనం వద్దనే రోజొచ్చిందా?
ప్రపంచ పాలన తీరు మారుతోందా?

తమదే వేదం ప్రసాదమనే వాదానికి
ఎదురు బోధలు మొట్ట సాగాయా?
ఏకపక్షం బహుళపక్షం దారిపట్టి
సహకారంతో సాగే పొద్దు
పొడిచిందా?
పెత్తనాలు చెల్లవనే ప్రకటనొచ్చిందా?



సోషలిజం మౌనంగానే ఎదిగెదిగి
అదునులో పదును చూపిందా?
తనకు తానుగా తానే శాశ్వతమనే
పెట్టుబడి కూతలు కోతలయ్యాయా?
ప్రపంచీకరణ ప్రవచనాల జోల
ఆగిందా?

ఏకధృవం ఇక చెల్లని కానీయేనా?
బహుళ ధృవమే బ్రతుకని చాటిందా?
ఆర్థికాభివృద్ధికి ఎ.ఐ, షాంఘై బ్యాంకు
తోడేసుకునే వ్యూహం ఖరారైందా?
పశ్చిమ రంకెలకు సంకెళ్ళు పడ్డాయా?

- ఉన్నం వెంకటేశ్వర్లు

మీ వ్యాసాలను, అభిప్రాయాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

రూపాయి గుబులు..!

- ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు
- డాలర్ ₹88.27
- ఆల్‌టైం కనిష్టంతో అధిక ధరలకు ఆజ్యం
- సామాన్యుడిపై తీవ్ర ప్రభావమే
- మోడీ హయాంలో 40 శాతం మేర పతనం

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

విశ్వగురుగా పదేపదే చెప్పుకొంటున్న ప్రధాని నరేంద్ర మోడీ హయంలో రూపాయి విలువ రికార్డ్ పతనాన్ని చవి చూసింది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో వరుస పతనంతో రూపాయి చరిత్రలోనే అత్యంత పేలవ ప్రదర్శనను చవి చూసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువను పడిపోనివ్వమని.. అమాంతం పెంచుతామని.. రూపాయి కరెన్సీల కోసం విదేశాలు లైన్ కట్టాలని నరేంద్ర మోడీ 2013లో చేసిన ప్రచార అర్బాటాలకు భిన్నంగా శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 88.27 కనిష్టానికి దిగజారింది. ఇది రూపాయి చరిత్రలోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం గమనార్హం. మోడీ ప్రధానిగా పదవీ స్వీకారం చేసిన 2014లో రూపాయి విలువ 62.33 వద్ద ఉండగా.. ఇప్పటి వరకు 38.87 శాతం క్షీణించడం ఆందోళనకరం. 2019 రెండో సారి అధికారంలోకి వచ్చేటప్పటికి డాలర్‌తో రూపాయి 72కు పడిపోయింది. గడిచిన ఐదేళ్లలోనే 20 శాతం పైగా విలువ కోల్పోగా.. వచ్చే ఐదేళ్లలోనూ ఇదే స్థాయిలో పతనం కావొచ్చని పలు రిపోర్టులు చెబుతోన్నాయి. 2030 నాటికి అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 100కు పడిపోవచ్చని పలు రిపోర్ట్‌లు అంచనా వేస్తున్నాయి. ఇటీవల ట్రంప్ టారిఫ్ చిచ్చులకు రూపాయి చిత్తడి అవుతోంటే ప్రధాని మోడీ సహా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ ఒక్కసారి కూడా నోరు విప్ప లేదు. రూపాయి పతన కట్టడికి తీసుకుంటున్న చర్యలను వెల్లడించడం లేదు.



పతనానికి ప్రధాన కారణాలు..

భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లకు తోడు, విదేశీ నిధులు బయటకు తరలిపోవడం, ఎఫ్‌డిఐలు ముఖం చాటేయడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం తదితర పరిణామాలు దేశీయ కరెన్సీని అగాథంలోకి నెట్టాయి. దేశంలో అధిక ద్రవ్యోల్బణం, దిగుమతుల కంటే ఎగుమతులు పెరగడం వల్ల ఫారెక్స్ రిజర్వులపై ఒత్తిడి, డాలర్‌కు విలువ పెరగడం, చమురు ధరల పెరుగుదల వల్ల విదేశీ చెల్లింపులు పెరగడం, దేశంలో అనాలోచిత ఆర్థిక విధానాలు రూపాయి విలువను క్రమంగా పడేస్తున్నాయి. దేశీయ మార్కెట్ల నుంచి ఆగని విదేశీ మదుపరుల పెట్టుబడుల ఉపసంహరణలు రూపాయి పరిస్థితుల్ని మరింత దిగజార్చుతున్నాయి.

పొంచి ఉన్న ప్రమాదాలు..

- దిగుమతి వ్యయాలు భారం
- ద్రవ్యోల్బణం పెరుగుదల
- వడ్డీ రేట్లు పెరగొచ్చు
- విదేశీ రుణ చెల్లింపులు భారం కానున్నాయి
- వెనుతిరగనున్న విదేశీ పెట్టుబడులు
- వాణిజ్య లోటు పెరగనుంది
- విదేశీ ప్రయాణాలపై అధిక వ్యయం
- దిగుమతి ఆధారిత కంపెనీల ఆదాయాలపై ఒత్తిడి
- సన్నగిల్లనున్న స్టాక్ మార్కెట్‌లపై విశ్వాసం

విదేశీ అప్పు చెల్లింపులు భారమే..

భారత్‌లోకి వచ్చి.. పోయే విదేశీ కరెన్సీ ఆధారంగా లెక్కించే కరెంట్ ఖాతా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ లోటును ఎదుర్కోవచ్చని స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ అంచనా వేసింది. డాలర్ విలువ పెరగడం.. రూపాయి అమాంతం బక్కచిక్కడంతో ప్రపంచ దేశాల నుంచి భారత్ తీసుకున్న అప్పులపై అధిక వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. దిగుమతులు, అప్పులు, వడ్డీలకు చేసే విదేశీ చెల్లింపులతో భారత మారకం నిల్వలపై ఒత్తిడి చోటు చేసుకోనుంది. దిగుమతులు ఎక్కువ కావడం వల్ల వర్తక లోటు పెరిగి, రూపాయిపై ఒత్తిడి చోటు చేసుకోనుంది. ఆయిల్, గ్యాస్, సోలార్, టెలికాం రంగాలలోని కంపెనీలపై ఖర్చులు పెరిగడంతో వాటి లాభాలు తగ్గుతాయి.

ఏడాది	రూపాయి విలువ
2014	62.33
2015	66.79
2018	70.64
2020	74.31
2022	81.62
2025	88.27

2027 నాటికి 95కు క్షీణత..!

మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు 2014లో 62.33గా ఉన్న రూపాయి విలువ.. రెండో సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టే నాటికి 2019లో డాలర్‌తో రూపాయి విలువ 70కి పడిపోయింది. గడిచిన ఐదేళ్లలో మోడీ 2.0 హయంలో 20 శాతం పతనమై 85కు దిగజారింది. మోడీ 3.0 నేతృత్వంలోని 2029 డిసెంబర్ నాటికి 100కు దిగువకు పతనం కావొచ్చని అంచనా. 2025 డిసెంబర్ నాటికి 87-88 మధ్య ఉండొచ్చని.. 2027 నాటికి రూ.95కు క్షీణించొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రజల ఆదాయాలకు గండి..

దేశీయ కరెన్సీ వరుస పతనం వల్ల ముఖ్యంగా దిగుమతి ఉత్పత్తులు భారంగా మారనున్నాయి. విదేశీ విద్యా, అంతర్జాతీయ ప్రయాణాలు. వాహనాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, చమురు, బంగారం, వంటనూనెలు, పప్పు దినుసులు తదితరాల ధరలు మరింత పెరుగుతాయి. విదేశాల్లో చదువుకునే భారతీయ విద్యార్థులు విద్యా, వీసాలు, వసతి కోసం భారీగా చెల్లించాల్సి వస్తుంది. అదానీ కోసం కేంద్రం భారీగా బొగ్గు దిగుమతులకు అనుమతిస్తోన్న విషయం తెలిసిందే. ఈ రంగానికి అధికంగా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఆ బొగ్గుతో ఉత్పత్తి చేసిన విద్యుత్ భారం కానుంది. చమురు దిగుమతులపై భారీగా చెల్లింపులు జరగడంతో పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరగనున్నాయి.

ఈ పరిణామాలు భారత్‌లో అధిక ధరలకు ఆజ్యం పోయడంతో ద్రవ్యోల్బణం మరింత ఎగిసిపడనుంది. దీంతో వడ్డీ రేట్లు పెరిగే అవకాశం ఉంది. దేశంలో ఇప్పటికే అధిక ధరలు బెంబేలెత్తి స్తున్న తరుణంలో కరెన్సీ క్షీణత ద్రవ్యోల్బణానికి మరింత ఆజ్యం పోయనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హెచ్చు ధరలతో ప్రజల ఆదాయానికి గండి పడనుంది. వస్తువులకు డిమాండ్ తగ్గనుంది. అంతిమంగా ఇది తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారి తీయనుందని హెచ్చరిస్తున్నారు.

ఫ్రాన్స్ అధ్యక్షుడికి మోడీ ఫోన్

- ఉక్రెయిన్ సహా పలు అంశాల ప్రస్తావన



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్‌తో ఫోన్లో మాట్లాడారు. ఉక్రెయిన్ యుద్ధానికి త్వరగా ముగింపు పలికేందుకు ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాలపై ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్, ఫ్రాన్స్ సంబంధాలను సమీక్షించారు.

ఉక్రెయిన్ విషయంలో ట్రంప్ తీసుకుంటున్న తాజా చొరవల నేపథ్యంలో ఈ ఫోన్ సంభాషణ చోటు చేసుకుంది. గత నెల్లో వైట్‌హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ చర్చలు జరిపే సమయంలో వున్న యురోపియన్ నేతల్లో మాక్రాన్ కూడా వున్నారు.

అధ్యక్షుడు మాక్రాన్‌తో మంచిగా సంభాషణ సాగింది. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకార పురోగతిపై సమీక్షించామని మోడీ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నాం. అంతర్జాతీయ శాంతి సుస్థిరతలను నెలకొల్పడంలో భారత్, ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం కీలకపాత్ర పోషిస్తుందని మోడీ ఆ పోస్టులో వ్యాఖ్యానించారు. అయితే అమెరికా టారిఫ్ విధానం పర్యవసానాలు వారి మధ్య చర్చకు వచ్చిందా లేదా అన్నది తెలియరాలేదు.

కొనసాగుతున్న ఇజ్రాయిల్ మారణహోమం

గాజా : 64 వేల మందికిపైగా పాలస్తీనియన్లు మరణించినా ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆపడం లేదు. గాజాపై శుక్రవారం జరిపిన దాడుల వల్ల ఏడుగురు చిన్నారులతో సహా 50 మందికిపైగా పాలస్తీనియన్లు మృతి చెందారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఇజ్రాయిల్ దాడులకు పాల్పడింది. ఉత్తర గాజాలోని పాలస్తీనియన్ల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. గాజా నగరంలో జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఒక ఎత్తైన భవనాన్ని ఇజ్రాయిల్ సైన్యం ధ్వంసం చేసింది. శనివారం అల్ షిఫా ఆసుపత్రిపై జరిపిన దాడిలో ఒక చిన్నారుతో సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అల్ షుహదా స్క్వేర్‌కు పశ్చిమాన ఉన్న శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం బాంబుదాడికి పాల్పడడంతో ఐదుగురు మరణించగా, పలువురికి గాయాలయ్యాయి. 2023 అక్టోబర్ అక్టోబర్ 7 నుంచి ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధంలో అధికారిక లెక్కల ప్రకారం 64,300 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. 162,005 మంది గాయాలపాలయ్యారు.

ఇప్పటివరకూ పర్యటించనందుకు మోడీ క్షమాపణ చెప్పాలి : గౌరవ్ గొగోయ్

గౌహతి : మణిపూర్‌లో హింస చెలరేగి రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు ఆ రాష్ట్రంలో పర్యటించనందుకు ప్రజలకు ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత గౌరవ్ గొగోయ్ డిమాండ్ చేశారు. ప్రధాని మణిపూర్‌లో పర్యటిస్తారనే వార్తలు వచ్చిన నేపథ్యంలో గౌరవ్ గొగోయ్ స్పందించారు. గౌహతిలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మణిపూర్ సందర్శనను రెండేళ్ల క్రితమే ప్లాన్ చేసుకుని ఉండాల్సిందని అన్నారు. ఆ రాష్ట్రానికి జరగాల్సిన న్యాయం కూడా ఆలస్యమైందని అని ఆయన విమర్శించారు. ప్రధాని మణిపూర్‌కి వెళ్లినప్పుడు ఆయన చేయాల్సిన మొదటి పని గత రెండు సంవత్సరాలుగా మణిపూర్‌కు రానందుకు ఆ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పడమేనని అన్నారు.

పెచ్చుమీరిన నేరాలు, అవినీతి

- బీహార్‌లో ఎన్‌డిఎ సర్కారుపై తేజస్వియాదవ్ ఆగ్రహం

పాట్నా : బీహార్‌లో జెడియు నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో నేరాలు, అవినీతి విపరీతంగా పెరిగాయని ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్షనేత తేజస్వియాదవ్ విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బీహార్‌లో నేరాలు, అవినీతి విపరీతంగా పెరిగిపోయాయి. ఇదీ బీహార్ పరిస్థితి. ఇక విద్య, నీటిపారుదల, ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు మరీ అధ్వానంగా ఉన్నాయి. రాష్ట్ర తలసరి ఆదాయం, తలసరి పెట్టుబడి విషయానికొస్తే చాలా అత్యల్పంగా ఉంది. రైతుల ఆదాయాల్లో బీహార్ చివరి స్థానంలో ఉంది. ఎలాంటి పరిశ్రమ లేదు. వ్యాపారం లేదు' అని అన్నారు. నితీష్ కుమార్ ఎన్నేళ్లు అధికారంలో ఉన్నా.. రాష్ట్రాభివృద్ధి జరిగే పరిస్థితి లేదని చెప్పారు.

యూనివర్సిటీలోని పోస్టులు భర్తీ చేయాలి

- గవర్నరుకు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యాన ఉన్న యూనివర్సిటీల్లోని 4,500 ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు చొరవ తీసుకోవాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు గవర్నర్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్లుగా పోస్టులు భర్తీ చేయకపోవడంతో యూనివర్సిటీల్లో విద్యా ప్రమాణాలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ను అమలు చేసి డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. జిఓ 114ను అమలు చేసి కాంట్రాక్టు అధ్యాపక, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు.

బాలుడి మృతితో ఇద్దరిని కొట్టి చంపిన అల్లరిమూక

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లా నిశ్చింతపూర్ ఏరియాలో టార్పాలిన్‌లో చుట్టబడిన మైనర్ బాలుడి మృత దేహాన్ని కనుగొనడంతో శనివారం ఉదయం ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఈలోగా కొంతమంది గుంపు అక్కడ గల ఇద్దరు స్థానికులపై దాడి చేసి ఈ బాలుడి మృతికి వారే కారణమని ఆరోపిస్తూ వారిని హతమార్చిందని పోలీసులు తెలిపారు. బాలుడి ఇంటి పక్కన గల ఆ ఇద్దరి ఇళ్ళలోని వస్తువులను మృతుడి కుటుంబం, ఆ అల్లరి మూక కలిసి ధ్వంసం చేశారని చెప్పారు. ఇద్దరు వ్యక్తులను తీవ్రంగా చితకబాదారు. వారిని ఆస్పత్రికి తీసుకెళ్ళగా వారు అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుండి ఆ బాలుడు కనిపించకుండా పోయాడు. శనివారం ఉదయానికి సమీపంలోని చెరువులో శవమై తేలాడని పోలీసు అధికారి తెలిపారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలను అదుపులోకి తీసుకురావడానికి అనేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. ప్రస్తుతం పరిస్థితి అదుపులో వుందని, కాగా ఈ దాడులకు సంబంధించి ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడు మృతి

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖ)

విశాఖ స్టీల్‌ప్లాంట్ సిడిసిపి విభాగంలో శనివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఒక కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, పోలీసుల కథనం ప్రకారం... స్టీల్‌ప్లాంట్‌లో మల్టీ టెక్ కాంట్రాక్టర్ వద్ద సిహెచ్.అప్పలనాయుడు పనిచేస్తున్నారు. సిడిసిపి విభాగంలో శనివారం ఎత్తుగా ఉన్న ప్రదేశంలో పనిచేసి కిందికి దిగుతున్న సమయంలో ఎంఎస్ చక్కెర ప్లేట్ నట్లు ఊడిపోవడంతో కింద పడిపోయారు. తలకు బలమైన గాయమై రక్తస్రావం కావడంతో ఫస్ట్ ఎయిడ్ విభాగానికి పంపించారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం తీసుకెళ్లాలని చెప్పడంతో అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో అప్పలనాయుడు మృతి చెందారు. ఆయన పెదగంట్యాడ పరిధి నడుపూరులో నివాసం ఉంటున్నాడు. భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కార్మిక సంఘాల నేతలు కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపారు. రూ.2 లక్షలను రెండు రోజుల్లోగా కార్మికుని కుటుంబానికి చెల్లించడానికి కాంట్రాక్టర్ అంగీకరించాడు.

గత రెండు నెలల కాలంలో భద్రత లేని కారణంగా ఆరుగురు కాంట్రాక్టు కార్మికులు మృతి చెందారని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకుడు నమ్మి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా భద్రత చర్యలు చేపట్టాలని కోరారు.



హిమాచల్ ప్రదేశ్‌లో విరిగిపడ్డ కొండచరియలు

న్యూఢిల్లీ : ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్థమైంది. జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. భారీ వర్షాలకు తోడు ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. అనేక చోట్ల భారీగా కొండచరియలు విరిగిపడుతున్నాయి.

హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. సిమ్లా జిల్లాలోని రాంపూర్ సబ్‌డివిజన్‌లోని జూరి సమీపంలో బండరాళ్లు రోడ్డుపై పడ్డాయి. దీంతో ఆ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరోవైపు గాంచ్వా ప్రాంతంలోనూ కొండచరియలు విరిగిపడటంతో చెట్లు, రోడ్లు దెబ్బతిన్నాయి. సిర్మౌర్ జిల్లా నౌహ్రాధార్ సమీపంలోనూ చౌకర్ గ్రామంలో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. సుమారు 200 మీటర్ల కొండభాగం కూలిపోయింది. ఆయా ప్రాంతాల్లో రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టామని, ప్రాణాపాయం సంభవించలేదని అధికారులు తెలిపారు.

గుజరాత్‌లో రోప్‌వే తెగిపడి ఆరుగురు కార్మికులు మృతి

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని పంచమహల్ జిల్లాలో శనివారం పావగఢ్ హిల్ టెంపుల్ వద్ద రోప్‌వే తెగిపడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు మృతి చెందారు.. నిర్మాణ సామగ్రి తీసుకువెళ్తున్న రోప్‌వే కేబుల్ తెగిపోవడంతో ట్రాలీ క్రిందికి పడిపోయిదని. ఈ ప్రముఖ తీర్థయాత్ర స్థలానికి ప్రతి సంవత్సరం సుమారు 25 లక్షల మంది భక్తులు వస్తారని పంచమహల్ డిప్యూటీ ఎస్పి హర్ష్ దుధాట్ తెలిపారు. సహాయక కార్యక్రమాలు జరుగుతున్నాయని, పోలీసులు, ఫైర్ బ్రిగేడ్ బృందాలు ప్రమాద స్థలంలో పనిచేస్తున్నాయని చెప్పారు. పావగఢ్ హిల్ పైన ఉన్న కాళీమాత టెంపుల్ భూమి నుంచి దాదాపు 800 మీటర్ల ఎత్తులో ఉంది. దాన్ని చేరుకోవడానికి సుమారు 2 వేల మెట్లు ఎక్కాలి లేదా కేబుల్ కార్లు వాడాలి. వాతావరణం సరిగ్గాలేని కారణంగా యాత్రికులను రోప్‌వేలోకి అధికారులు అనుమతించ లేదు. కానీ నిర్మాణ పనుల కోసం రోప్‌వేను ఉపయోగిస్తున్నారు. మృతి చెందినవారిని గుర్తించామని, ఈ ప్రమాదానికి కారణాలు తెలుసుకోవడానికి టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.



రాజారఘువంశీ హత్య కేసులో 790 పేజీల చార్జిషీట్



రాంచీ : హనీమూన్ పేరుతో మధ్యప్రదేశ్ నుంచి మేఘాలయ తీసుకెళ్లి భర్తను హత్య చేయించిన కేసులో మేఘాలయ పోలీసులు 790 పేజీల చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం మేఘాలయ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బందం తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ కుటుంబం ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తోంది. ఈ ఏడాది మే 11న అతడికి సోనమ్‌తో వివాహం జరిగింది. ప్రియుడి కోసం భర్త హత్యకు ప్లాన్ చేసిన సోనమ్ రఘువంశీ.. మే 20న హనీమూన్ పేరుతో భర్తను మేఘాలయకు తీసుకెళ్లింది. అక్కడ మే 22న రాజా రఘువంశీని ప్రియుడి స్నేహితులతో హత్య చేయించింది. సోనమ్‌ను ఆమె ప్రియుడు కుశ్వాహా ఓ అద్దె ఇంట్లో ఉంచాడు. హనీమూన్‌కు వెళ్లిన కొడుకు, కోడలు తిరిగి రాకపోవడంతో రఘువంశీ కుటుంబ సభ్యులు మిస్సింగ్ కేసు పెట్టారు. జూన్ 1న సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలోగల లోతైన లోయలో పోలీసులు కత్తిపోట్లతో ఉన్న రాజారఘువంశీ మృతదేహాన్ని గుర్తించారు. జూన్ 7న ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో కనిపించిన సోనమ్ తనను ఎవరో కిడ్నాప్ చేసి, ఘాజీపూర్‌లో వదిలివెళ్లినట్లు చెప్పింది. పోలీసులు ఆధారాలను చూపించి, విచారించడంతో నేరాన్ని అంగీకరించింది. పోలీసుల దర్యాప్తులో ఆమెతోపాటు ఆమె ప్రియుడు రాజ్ కుశ్వాహా సహా ఐదుగురు నిందితులపై పోలీసులు అభియోగాలు మోపి, అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆ ఐదుగురు నిందితులు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో మరిన్ని ఫోరెన్సిక్ రిపోర్టులు అందిన తర్వాత మరో ముగ్గురు సహ నిందితులపై అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు సిట్ వెల్లడించింది. సోనమ్‌ను ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా పేర్కొన్నారు. హత్య అనంతరం 17 రోజులపాటు సోనమ్ దాగివున్న భవన యజమానిని కూడా ఈ కేసులో నిందితుడిగా చేర్చారు. ఈ ఛార్జిషీట్‌ను పరిశీలించిన తర్వాత కోర్టు ఈ కేసులో తదుపరి విచారణ జరపనుంది.

పడవ కార్మికుల ఆకలి కేకలు

- 20 రోజులుగా ఇసుక ర్యాంపుల మూత
- పది వేల మంది కార్మికుల ఉపాధికి గండి
- వరదతో నిలిచిన ఇసుక తవ్వకాలు


కొవ్వూరు మండలం వాడపల్లిలో వెలవెలబోతున్న ఇసుక ర్యాంపు

ప్రజాశక్తి- కొవ్వూరు (తూర్పుగోదావరి జిల్లా)

గోదావరిలో వరద పోటెత్తడంతో పడవ కార్మికుల ఉపాధికి గండి పడింది. సుమారు మూడు వారాల నుంచి ఇసుక తవ్వకం పనులు నిలిచిపోవడంతో కార్మికులు ఉపాధి లేక అల్లాడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో పడవల సాయంతో నడిచే ఇసుక ర్యాంపుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు పదివేల మంది కార్మికులు ఉపాధి ఉపాధి పొందుతున్నారు. ర్యాంపులు మూతపడి 20 రోజులు కావస్తుండడంతో ఉపాధి కరువై వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను చవిచూస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నదిలో ప్రవాహ జలాల ప్రభావం తగ్గుముఖం పట్టడంతో ఇసుక ర్యాంపులను తెరిపించాలని కార్మికులు వేడుకుంటున్నారు. పడవ కార్మికులతోపాటు ప్రొక్లెయిన్ డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, పడవల నిర్వాహకులు, ఫైబర్ పనులు చేసుకునే కార్మికులు, లోడింగ్ ట్రాక్టర్ డ్రైవర్లు, కార్మికుల ఉపాధిపైనా తీవ్ర ప్రభావం పడింది.

వినియోగదారులకు పడవల ఇసుక మక్కువ

పడవల సాయంతో సేకరించే ఇసుక నాణ్యతగా ఉంటుంది. దీంతో, ఎక్కువమంది నిర్మాణ పనులు చేపట్టే వారు అధికంగా పడవల ఇసుక వినియోగించడానికే ఇష్టపడతారు. పడవల సాయంతో నడిచే ర్యాంపుల్లో ప్లాస్టిక్ అవసరమైన మెత్తని ఇసుకతోపాటు, కాంక్రీట్ పనులకు వినియోగించే ఇసుక, ఇతర పనులకు వాడే మీడియం ఇసుక అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వం వర్షాకాల అవసరాలను దృష్ట్యా భారీగా స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ ఒకే రకమైన, లేదంటే అన్ని రకాలు కలిసినా ఇసుక మాత్రమే లభ్యమవుతోంది. దీంతో, వినియోగదారులు పడవల సాయంతో సేకరించిన ఇసుక వినియోగించడానికి అధికంగా మక్కువ చూపిస్తుంటారు. స్టాక్ పాయింట్లలో ఎంత ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ వినియోగదారులు మాత్రం పడవల సాయంతో సేకరించిన ఇసుక పట్ల ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవన నిర్మాణ కార్మికుల ఉపాధిపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.

ఇతర రాష్ట్రాల కార్మికులపైనా ప్రభావం

స్థానిక కార్మికులతో పాటు ఛతీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కార్మికుల సాయంతో నడిచే ఇసుక ర్యాంపుల్లో పనుల నిమిత్తం ఏటా ఈ ప్రాంతానికి వలస వస్తారు. ప్రస్తుతం ఇసుక తవ్వకం పనులు నిలిచిపోవడంతో సుమారు 20 రోజుల నుంచి ఇక్కడే ఉపాధి కోసం పడిగాపులు పడుతున్నారు. ఇప్పటికే కొన్ని ముఠాలు పనులు లేక స్వస్థలాలకు వెళ్లిపోయారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 800 పడవల వరకు ఉన్నాయి. ఒక్కో పడవపై పది నుంచి 12 మంది వరకు ఉపాధి పొందుతుంటారు. వీరి ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది.

వ్యాపారులపైనా ప్రభావం

ర్యాంపులు నడవడం మూలంగా పరిసర ప్రాంతాల్లో ఉండే హోటళ్లు, కిరాణా, రైస్, కూరగాయలు వంటి దుకాణాలకు డిమాండ్ ఉంటుంది. పడవలు ఉండడంతో వాటి మరమ్మతుల నిమిత్తం మెకానిక్‌లు, ఫైబర్ వర్కర్లు, ఆటోమొబైల్ దుకాణాలు, ఫైబర్ సామాన్లు, ఇంజన్లు విక్రయించే దుకాణాలు, పడవ సామగ్రి అమ్మే దుకాణాలకు వ్యాపారం సాగుతుంది. మూడు వారాల నుంచి పడవలు నడవకపోవడంతో వీరందరి ఉపాధిపైనా ప్రభావం పడింది.

తగ్గుముఖం పట్టిన గోదావరి వరద

గోదావరిలో వరద గత రెండు రోజుల నుంచి తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతం నుంచి ప్రవాహ జలాలు తక్కువగా రావడంతో ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది.

శనివారం ఉదయం 11 గంటలకు ఇక్కడ నీటిమట్టం 10.20 అడుగులుగా నమోదైంది. ఆనకట్ట నుంచి 8,06,068 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. ఆదివారం సాయంత్రానికి వరద సాధారణ స్థితికి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

డోలీలో గర్భిణి తరలింపు


గర్భిణిని డోలీలో తరలిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- చింతపల్లి (అల్లూరి జిల్లా)

అల్లూరి చింతపల్లి మండలంలోని పలు గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారులు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలంబంద గ్రామానికి చెందిన నిండు గర్భిణి గెమ్మెలి మంగమ్మ ప్రసవ వేదనతో బాధపడుతుండగా అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేక గ్రామస్తులు డోలీ మోతతో తరలించారు. ఆశా కార్యకర్త వంతల కాంతమ్మ సహాయంతో గ్రామస్తులు మంగమ్మను డోలిలో రావిమానుపాకాల వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు మోసుకెళ్లారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా, వైద్యుల పర్యవేక్షణలో మంగమ్మ సురక్షితంగా ప్రసవించినట్లు సమాచారం. కిటుముల పంచాయతీ ఉప సర్పంచ్ సుర్ల నూకలమ్మ మాట్లాడుతూ పొలంబంద గ్రామానికి వెళ్లే మట్టి రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. తమ గ్రామానికి వెంటనే తారు రహదారి నిర్మాణం చేయాలని కోరారు.

చాకర్లపల్లిలో చిరుత సంచారం

ప్రజాశక్తి- సోమందేపల్లి (శ్రీసత్యసాయి జిల్లా)



శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం చాకర్లపల్లి గ్రామ సమీప పొలాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ సమీపంలోని తన కోళ్ల ఫారంలో చిరుత సంచరిస్తున్నట్లు సిపి కెమెరాలో రికార్డు అయిందని రైతు గోవిందరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి కోళ్ల ఫారంలో ఒక కోడి మృతి చెందిందని, దీంతో అనుమానం వచ్చి సిసి కెమెరా ఫుటేజీని పరిశీలించగా అందులో చిరుత సంచరిస్తున్నట్లు గుర్తించానని ఆయన చెప్పారు.

రక్షణ రంగ ఎగుమతుల హబ్‌గా మడకశిర!

ప్రజాశక్తి- మడకశిర టౌన్ (శ్రీసత్యసాయి జిల్లా)

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి కియా కార్లు, హార్టికల్చర్ పండ్ల ఎగుమతే కాదు.. ఇకపై అత్యాధునిక రక్షణ పరికరాలు కూడా తయారు చేసి రక్షణ రంగ ఎగుమతులు హబ్‌గా మారబోతోంది. దేశ రక్షణ రంగంలో దిగ్గజమైన భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ అయిన అగ్నేయాస్త్ర ఎనర్జెటిక్స్ లిమిటెడ్ మడకశిర నియోజకవర్గంలో మెగా ప్లాంట్ ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేసుకుంది. ఇప్పటికే ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అగ్నేయాస్త్ర ఎనర్జెటిక్స్ రూ. 2,400 కోట్ల భారీ పెట్టుబడితో అత్యాధునిక రక్షణ రంగ ఉత్పత్తుల కేంద్రం నిర్మించనుంది. ఈ ప్లాంట్‌ను కేవలం దేశీయ అవసరాల కోసమే కాకుండా పలు దేశాలకు సరఫరా చేయడానికి గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటివరకూ చర్చల దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు అధికారికంగా ఖరారైంది. భారత్ ఫోర్జ్ తన అనుబంధ సంస్థ అగ్నేయాస్త్ర ఎనర్జెటిక్స్ లిమిటెడ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపిఐఐసి)తో భూమి కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)కు అధికారికంగా తెలిపింది.

కేన్సర్ వ్యాక్సిన్ ఇవ్వరాయే..!

- రెండు జిల్లాల్లో ప్రబలుతున్న మహమ్మారి
- స్క్రీనింగ్ పరీక్షల్లో వేలాది అనుమానిత కేసులు


హ్యూమన్ పాపిలోమా వైరస్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కేన్సర్ రోగుల సంఖ్య పెద్ద ఎత్తున పెరుగుతోంది. మారిన జీవన విధానం, ఆహారంలో మార్పులతో ఈ వ్యాధి చుట్టుముడుతోంది. మహిళల్లో కేన్సర్‌ను ముందస్తుగా అడ్డుకునే హెచ్‌పివి (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చినా ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందించని పరిస్థితి. దీంతో, కేన్సర్ నివారణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2024 నవంబర్ 14న ప్రభుత్వం ఈ రెండు జిల్లాల్లో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించింది. ఇప్పటివరకూ పశ్చిమగోదావరి జిల్లాలో 18 ఏళ్లు దాటినా 10.94 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు జరపగా, 3,908 మంది ఓరల్ కేన్సర్ అనుమానితులు, 2,035 మంది బ్రెస్ట్ కేన్సర్, 1,798 మంది సర్వేకల్ కేన్సర్ అనుమానితులను గుర్తించారు. ఏలూరు జిల్లాలోనూ కేన్సర్ అనుమానిత కేసులు ఇదే రీతిన ఉన్నారు. కేన్సర్ అనుమానిత కేసుల పెద్ద సంఖ్యలో బయటపడుతున్నాయి. కేన్సర్ నివారణకు మహిళలకు ఇచ్చే ముందస్తు వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి లేకుండా చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సొమ్ములు చెల్లిస్తే హెచ్‌పివి వ్యాక్సిన్

మహిళలకు కేన్సర్ రాకుండా అరికట్టేందుకు హెచ్‌పివి వ్యాక్సిన్ అందుబాటులోకొచ్చినా సామాన్యులకు అందని ద్రాక్షగానే ఉంది. ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందించకపోవడంతో సామాన్య ప్రజానీకం ఈ వ్యాక్సిన్‌కు వేసుకోలేని పరిస్థితి ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 40 లక్షల జనాభా ఉంది. ఇందులో దాదాపు 20 లక్షల వరకూ మహిళలు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా బుధ, శనివారాల్లో మెదడువాపు, కామెర్లు, కోరింత దగ్గు, ధనుర్వాతం, కంటసప్పి వంటి అనేక వ్యాక్సిన్‌లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. కేన్సర్‌కు సంబంధించిన హెచ్‌పివి వ్యాక్సిన్ మాత్రం ఇవ్వడం లేదు. ఈ హెచ్‌పివి వ్యాక్సిన్ 14 ఏళ్లలోపు బాలికలకు రెండు డోసులు, అంతకు మించి వయస్సున్న మహిళలకు మూడు డోసులు ఇవ్వాల్సి ఉంటుంది. మొదటి డోసు తర్వాత మూడు నెలలకు మరొకటి, ఆరు నెలల తర్వాత మరో డోసు వేయాలి. ఇంతటి ముఖ్యమైన వ్యాక్సిన్ ప్రయివేటులో మాత్రమే దొరుకుతుంది. ప్రయివేటులో హెచ్‌పివి వ్యాక్సిన్ కొనుగోలు చేయాలంటే రూ.11 వేల వరకూ ఖర్చవుతోంది. సామాన్యులు అంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయలేక వ్యాక్సిన్ వేయించుకోవడం లేదు. మహిళల్లో అత్యధికంగా ఓరల్, బ్రెస్ట్ కేన్సర్ ఎక్కువగా వస్తోంది. కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఆరోగ్యశ్రీలో ఉండడం లేదు. పెట్‌స్కాన్ వంటివి చేయించాలంటే రూ.20 వేల వరకూ ఖర్చవుతోంది. కేన్సర్ నిర్ధారణకు అయ్యే పరీక్షల ఖరీదు రూ.35 వేల వరకూ ఉంటుంది. హెచ్‌విపి వ్యాక్సిన్‌ను ఉచితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

ప్రజాశక్తి- సీతానగరం (తూర్పుగోదావరి)


నల్లగొండలో అక్రమంగా తవ్వేసిన గ్రావెల్ ప్రాంతం

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నల్లగొండలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులూ లేకుండా భారీగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి, రాత్రికి రాత్రే అక్రమంగా రవాణా చేస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం కోల్పోతోందని అంటున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో అక్రమార్కులు గ్రావెల్‌ను తవ్వకాలు చేపడుతున్నారు. ఈ అక్రమ కార్యకలాపాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని, రవాణా సమయంలో రోడ్లు పాడవుతున్నాయని వారు చెబుతున్నారు. ఈ అక్రమాలపై స్థానిక మైనింగ్, రెవెన్యూ, మరియు పర్యావరణ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా, ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, రవాణా చేసినవారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన అక్రమార్కులచే అపరాధ పన్ను కట్టించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఘాట్ రోడ్డులో జీపు బోల్తా

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు మండలం కుమ్మడ పంచాయతీ పరిధిలోని దిగువ కుమ్మడ గ్రామం సమీపంలో ఘాట్ రోడ్డు వద్ద శనివారం జీపు అదుపు తప్పి బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. స్థానికుల కథనం ప్రకారం... మండల కేంద్రంలో ప్రతి శనివారం వారపు సంతకు బూసి పుట్టు పంచాయతీ పలు గ్రామాల ఆదివాసి గిరిజనులు సరుకులు కొనుగోలు చేసుకుని తిరుగు వెళ్లే ప్రయాణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పలువురికి తీవ్ర, స్వల్ప గాయాలు కావడతో చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనంలో తరలించారు. ఈ విషయంపై స్థానిక ఎస్ఐ రామకృష్ణను ఫోన్లో సంప్రదించి వివరణ కోరగా, క్షతగాత్రులను వైద్య సేవల నిమిత్తం సిహెచ్‌సికి తరలిస్తున్నారని, వైద్యం అనంతరం వివరాలు తెలుసుకుంటామని తెలిపారు.

ఎరువుల అక్రమ రవాణా

- సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు
- కేసలి పిఎసిఎస్ నుంచి తరలింపు
- టిడిపి నాయకుడే సూత్రధారి!

ప్రజాశక్తి- పార్వతీపురం


అధికారులు సీజ్ చేసిన ఎరువుల ఆటో

జిల్లాలో ఒకవైపు ఎరువుల కోసం రైతులు అల్లాడిపోతున్న సమయంలో ఓ టిడిపి నాయకుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు దర్జాగా ఎరువులను అక్రమంగా రవాణా చేస్తున్న ఆటో శనివారం విజిలెన్స్ అధికారులకు దొరికింది. పాచిపెంట మండలం పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ అధికారి తనిఖీలు చేస్తుండగా పాచిపెంట వైపు నుంచి ఆటోలో ఎరువుల తరలింపు వారి కంట పడింది. వెంటనే అధికారులు ఆటోలో ఉన్న ఎరువులను పరిశీలించగా వాటికి ఏ విధమైన పత్రాలూ లేకపోవడంతో సీజ్ చేశారు. పాచిపెంట మండలంలోని కేసలి పిఎసిఎస్ నుంచి 11 యూరియా, 3 పొటాష్ బస్తాలను ఆటోలో తరలిస్తుండగా పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అధికారులు పట్టుకున్న తర్వాత కేసలి పిఎసిఎస్ అధ్యక్షులు మాదిరెడ్డి మధ్యారావు అక్కడికి చేరుకుని ఆ ఎరువులు తనవేనని, పొలానికి తీసుకెళ్తున్నానని చెప్పారు. ఆ బస్తాలకు సంబంధించిన బిల్లులు చూపించాలని అధికారులు కోరగా ఆయన చూపించలేకపోయారు. దీంతో, విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన ఎరువులను మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావుకు అప్పగించారు. ఆయన ఎరువులను సమీపంలో ఉన్న పి.కోనవలస రైతు సేవా కేంద్రానికి తరలించారు. అనంతరం విజిలెన్స్ సిఐ సింహాచలం, వ్యవసాయ అధికారి కె తిరుపతి రావు కేసలి పిఎసిఎస్‌కి వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. సొసైటిపై 6ఎ కేసు నమోదు చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో స్టాక్ ఉన్న 155 బస్తాల పొటాష్‌ను సీజ్ చేశారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఈ ఎరువులను విక్రయించరాదని ఆదేశించారు. పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద ఎరువులతో వెళుతున్న ఆటోని సీజ్ చేసిన సమయంలో ఓ కీలక టిడిపి నేత విజిలెన్స్ సిఐకి ఫోన్ చేసి ఎరువులను వదిలేయాలని ఒత్తిడి చేసే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయితే, సిఐ తమ విధులకు ఆటంకం కలిగించొద్దని వాదించడంతో ఆ నేత ఏమీ చేయలేని పరిస్థితిలోకి వెళ్లారు.

బెంగళూరు, గుజరాత్ గెలుపు

- ప్రొ కబడ్డీ సీజన్-12

విశాఖపట్నం: ప్రొ కబడ్డీ సీజన్-12 భాగంగా శనివారం జరిగిన లీగ్ పోటీల్లో బెంగళూరు బుల్స్, గుజరాత్ జెయింట్ విజయాలను నమోదు చేసుకున్నాయి. తొలి మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 38-32పాయింట్లతో పట్నా పైరెట్స్‌ను చిత్తుచేయగా.. రెండో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 37-28పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై ఘన విజయం సాధించింది. పవన్ షెహ్రావత్ సారథ్యంలోని తమిళ్ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. గుజరాత్ జట్టులో నితిన్ పన్వార్(8పాయింట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చగా.. రాకేశ్(6), హిమాన్షు(4) రైడ్‌లలో రాణించారు. ఇక కెప్టెన్ మహ్మద్‌రేజా(6) ఆల్‌రౌండ్ ప్రదర్శన చూపాడు. ఇక తమిళ్ తలైవాస్ జట్టు కెప్టెన్ పవన్(6) రైడ్ పాయింట్లు మాత్రమే సాధించి నిరాశపర్చగా.. అర్జున్(7) ఫర్వాలేదనిపించాడు. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ చివర్లో వరుసగా పాయింట్లు సాధించి పట్నాకు చెక్ పెట్టింది. బుల్స్ జట్టులో ఆశీశ్(8), అలీరేజా(10) రైడ్స్‌లో రాణించారు. డిఫెండర్లు సంజయ్, సత్యప్ప ఫర్వాలేనిపించగా.. కెప్టెన్ యోగేశ్, దీపక్ మెరిసారు. ఇక పట్నా జట్టులో అయాన్(10) ఒంటరి పోరాటం మినహా.. మరే ఆటగాడు రాణించలేదు.

ప్రొ కబడ్డీలో నేడు..

బెంగాల్ వారియర్స్ X తెలుగు టైటాన్స్ (రాత్రి 8.00గం॥లకు)

దబాంగ్ ఢిల్లీ X జైపూర్ పింక్‌ప్యాంథర్స్(రాత్రి 9.00గం॥లకు)

సెంట్రల్ జోన్‌కు ఆధిక్యత

- దులీప్ ట్రోఫీ సెమీఫైనల్స్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో సెంట్రల్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతను సంపాదించింది. వెస్ట్‌జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ సెమీస్‌లో సెంట్రల్ జోన్ జట్టు ఇప్పటికే 118పరుగుల ఆధిక్యతను సంపాదించింది. అంతకుముందు వెస్ట్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 438పరుగులకు ఆలౌట్ కాగా.. అనంతరం సెంట్రల్ జోన్ జట్టు మూడోరోజు ఆట నిలిచే సమయానికి 8వికెట్ల నష్టానికి 556పరుగులు చేసింది. మలేవార్(76), శుభమ్ శర్మ(96), రజత్ పాటిధర్(77), ఉపేంద్ర యాదవ్(87), హర్ష్ దూబే(75) అర్ధసెంచరీలతో మెరిసారు. సరాన్ష్ జైన్(37), యశ్ ఠాకూర్(4) క్రీజ్‌లో ఉన్నారు. వెస్ట్‌జోన్ బౌలర్లు ధర్మేంద్ర జడేజాకు నాలుగు, నాగస్వాల్లా, సామ్స్ ములానీ, తనుష్ కోటియన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

హోరాహోరీగా సౌత్‌జోన్-నార్త్‌జోన్ మ్యాచ్

సౌత్‌జోన్-నార్త్‌జోన్ జట్ల మధ్య జరుగుతున్న రెండో సెమీస్ హోరాహోరీగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో సౌత్‌జోన్ జట్టు 536పరుగులు చేయగా.. మూడోరోజు ఆట నిలిచే సమయానికి నార్త్‌జోన్ జట్టు 5వికెట్ల నష్టానికి 278పరుగులు చేసింది. ఆ జట్టు ఇంక 258పరుగులు వెనుకబడి ఉంది. మూడోరోజు నార్త్‌జోన్ ఓపెనర్ ఖజురియా(128నాటౌట్)కి తోడు నిషాంత్ సింధు(82) బ్యాటింగ్‌లో రాణించారు. సౌత్‌జోన్ బౌలర్లు గుర్‌ప్రీత్ సింగ్‌కు మూడు, నితీష్‌కు ఒక వికెట్ దక్కాయి.

భారత్‌కు రెండు పతకాలు ఖాయం

- ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్

వాంగ్జు(కొరియా): ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారతజట్టుకు రెండు పతకాలు ఖాయమయ్యాయి. పురుషుల, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. దీంతో భారత్‌కు కనీసం రెండు పతకాలు ఖాయమయ్యాయి. శనివారం నుంచి ప్రారంభమైన ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా రిషబ్ యాదవ్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో 709పాయింట్లతో 8వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాడు. అమన్ సైనీ, ప్రథమేశ్ కూడా రాణించడంతో భారత పురుషుల ఆర్చరీ జట్టు 232-232పాయింట్లతో ఆస్ట్రేలియాతో సమంగా నిలిచింది. షూట్ ఆఫ్‌లో భారత్ 30-28పాయింట్లతో ఆస్ట్రేలియా జట్టును చిత్తుచేసి ఫైనల్‌కు చేరింది. అమెరికా 234-233తో టర్కీ 234-232తో గెలిచి ఫ్రాన్స్‌తో టైటిల్ పోరుకు సిద్ధమయ్యాయి. ఇక కాంపౌండ్ మిక్స్‌డ్ మహిళల విభాగంలో టాప్ ర్యాంకర్ వెన్నం జ్యోతి సురేఖ 707పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. పర్ణీత్ కౌర్, ప్రతిక ప్రదీప్‌లతో కూడిన భారతజట్టు 160-152పాయింట్లతో జర్మనీని ఓడించి ఫైనల్‌కు చేరింది. మరో పోటీలో సాల్వడార్ 157-153, చైనీస్ తైపీ 157-155పాయింట్లతో గెలిచాయి.

భూసేకరణ వేగవతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి- ఏలూరు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శనివారం పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ భూసేకరణపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు, తూర్పుగోదావరి, మన్యం జిల్లాల్లోని పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా భూమికి భూమి, ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణం తదితర పనులకు జిల్లాలో 4,434 ఎకరాల భూమి అవసరమని, ఇప్పటికే బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో 2,181 ఎకరాల భూమిని గుర్తించామని తెలిపారు. నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా భూమికి భూమి, ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణం తదితర పనులు, జిల్లాలో మిగిలి ఉన్న భూసేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో భూసేకరణకు అవసరమైన భూములను గుర్తించి భూసేకరణ ప్రకటనలు జారీ చేయాలని అన్నారు. భూ సేకరణ కోసం భూమిని గుర్తించిన తర్వాత ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూములు గుర్తించిన తర్వాత ఆయా రైతులతో ఆర్‌డిఒ, డిఎస్‌పి స్థాయి అధికారులు చర్చించి వారి సమక్షంలో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. భూములకు పరిహారాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు చెల్లించటానికి అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళ వందనం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి- సీలేరు (అల్లూరి జిల్లా)

సీలేరు కాంప్లెక్స్ పరిధి దిగువ సీలేరు డొంకరాయి జలాశయం నీటిమట్టాలు నిలకడగా ఉండడంతో వెయ్యి క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నట్లు ఎపి జెన్‌కో ఎడిఇ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ శుక్రవారం రాత్రి జలాశయం నీటిమట్టం 1035.10 అడుగులకు చేరుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గేట్ల ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశామన్నారు. శనివారం పది గంటల సమయానికి డొంకరాయి పరిసర ప్రాంతాల్లో వర్షాలు నిలిచిపోవడంతో నదీ పరిసర ప్రాంతాల్లో పిల్ల కాలువల ద్వారా వచ్చే నీటి ఇన్‌ఫ్లో తగ్గిందని, దీంతో జలాశయం నీటి నిల్వలు సమాంతరంగా ఉంచుతూ వెయ్యి క్యూసెక్కులు నీటిని మాత్రమే దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జలాశయంలో 1034.5 అడుగులు నీటిమట్టం నిలకడగా ఉందని తెలిపారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి విద్యుతుత్పత్తి నిమిత్తం డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు.

పలుచోట్ల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- జి.మాడుగుల, పాడేరు టౌన్ (అల్లూరి జిల్లా)

జి.మాడుగుల మండల కేంద్రానికి కూతవేటు దూరంలో పెదలంక గ్రామ సమీపాన శనివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గంజా యితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్లు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... అటుగా రెండు ద్విచక్ర వాహనదారులు వస్తుండగా వాటిని ఆపి తనిఖీ చేయడంతో గోనెసంచిలో 34 కేజీల గంజాయి బయటపడింది. ముగ్గురు వ్యక్తులు అదుపులోకి తీసు కొని వారి వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. వారిని విచారించగా మరో ఇద్దరు వ్యక్తులకు గంజాయితో సంబంధం ఉన్నట్టు తేలింది. పట్టుబడ్డ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సమీపంలోని కరకపుట్టు జంక్షన్ వద్ద 3.63 కిలోల గంజాయి నూనె స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశామని అనకాపల్లి ఎఇఎస్ కె.సురేష్ శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. గంజాయి నూనె రవాణా చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారంతో అనకాపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్‌వి మహేష్ ఆదేశాలతో సిబ్బంది అక్కడకు వెళ్లి నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నామన్నారు. నాలుగు ప్యాకెట్లతో ఉన్న 3.63 కిలోల గంజాయి నూనెను పట్టుకుని జి.మాడుగుల మండలం అలగం గ్రామానికి చెందిన ఇద్దరి నిందితుల్లో చిన్నబాలన్న (41)ను అరెస్టు చేసినట్టు తెలిపారు. మరో నిందితుడు కృష్ణారావు (25) పరారీలో ఉన్నట్టు చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం సిఐ జగదీశ్వరరావు, ఎస్ఐలు గిరిబాబు, చిన్నవీర్రాజు, హెచ్ సిలు రాజు, నాయుడు, పిఇసిలు కిరణ్, సంతోష్, రమేష్ తనిఖీల్లో పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ఉత్తరాది వరదలు

- కేంద్రానికి సిపిఎం పొలిట్‌బ్యూరో వినతి
- యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలకు డిమాండ్

న్యూఢిల్లీ : ఉత్తర భారతంలో వరదలు, కొండచరియలు కూలిపడడం వంటి అసాధారణ పరిస్థితులు నెలకొనడంపై సిపిఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని, బాధిత రాష్ట్రాలను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సిపిఎం పొలిట్‌బ్యూరో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్, ఢిల్లీల్లో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు కూలడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కనివినీ ఎరుగనిరీతిలో చోటు చేసుకున్న ఈ ప్రకృతి వైపరీత్యంలో జరిగిన ప్రాణనష్టంపై సిపిఎం విచారం వెలిబుచ్చింది. పంజాబ్ ఈ వరదలకు బాగా దెబ్బతింది. రాష్ట్రంలోని 23 జిల్లాలు వరద తాకిడికి గురయ్యాయి. రాష్ట్రంలోని 1655 గ్రామాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో చేతికి వచ్చిన పంట పూర్తిగానో లేదా పాక్షికంగానే మునిగిపోయింది. నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు వరదల బాధితులని వార్తలు పేర్కొంటున్నాయి. ఒకవైపు భారీ వర్షాలు, మరోవైపు అనేక డ్యామ్‌ల నుండి మిగులు నీటిని విడుదల చేయడంతో బియాస్, సట్లెజ్, రావి, ఘగ్గర్ వంటి నదులు పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా పంజాబ్, హర్యానాలో పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది.

హర్యానాలో 12 జిల్లాల్లో 1402 గ్రామాల్లో 2.5లక్షల ఎకరాల్లో పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. జమ్మూ కాశ్మీర్‌లోనూ వేలాది ఎకరాల్లో వరి పంట కుండపోత వర్షాలకు, వరదలకు పూర్తిగా కొట్టుకుపోయింది. 170మందికి పైగా మరణించినట్లు వార్తలందాయి. రాజస్థాన్, ఢిల్లీల్లో పలు ప్రాంతాల్లో కూడా విస్తృతంగా నష్టం వాటిల్లింది. హిమాచల్ ప్రదేశ్ కూడా తీవ్రంగా నష్టాలను చవిచూసింది. 320మందికి పైగా మరణించారు. చాలామంది గల్లంతయ్యారు. పౌర సదుపాయాలు, భూములు, ఇళ్ళు, పశువులు, పళ్ళ చెట్లు, పంటలు, వాహనాలు, గోశాలలకు తీవ్ర స్థాయిలో విధ్వంసం చోటు చేసుకుంది. సిమ్లా, కులూల్లోని యాపిల్ తోటలు బాగా దెబ్బతిన్నాయి. దాదాపు 25వేల ఎకరాల్లో ఉద్యానవన తోటలకు నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. ఉత్తరాఖండ్‌లో కూడా ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడడం ఊహించని నష్టాన్ని కలగచేశాయి. అనేకమంది గల్లంతయ్యారు. ఇంతటి భారీ విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కొనడంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. యుద్ధ ప్రాతిపదికన సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని కోరింది. బాధిత ప్రాంతాల్లో సిపిఎం బృందాలు చురుకుగా పనిచేస్తున్నాయి. బాధితులకు అవసరమైన సహాయ, సహకారాలు అందచేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో చేపడుతున్న సహాయక, పునరావాస చర్యల్లో పాల్గొన్ని సహాయమందించాల్సిందిగా సిపిఎం తన కార్యకర్తలకు పిలుపునిచ్చింది. బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు నిధులను సేకరించాల్సిందిగా కూడా పార్టీ పిలుపిచ్చింది.



ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వం కనీసం సహాయక శిబిరాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో 'ఫ్లై ఓవర్' వంతెనల కిందే తలదాచుకున్న వరద బాధిత ప్రజలు

బ్రిక్స్ సదస్సుకు మోడీ దూరం

- ట్రంప్ ఆగ్రహాన్ని చల్లార్చేందుకేనంటున్న పరిశీలకులు

న్యూఢిల్లీ : వారం రోజుల క్రితం తియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సదస్సుకు హాజరై చైనా, రష్యా అధ్యక్షులు జిన్‌పింగ్, పుతిన్‌తో కలివిడిగా తిరుగుతూ కరచాలనాలు, ఆలింగనాలతో హడావిడి చేసిన ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే వారం జరగబోయే బ్రిక్స్ దేశాల వర్చువల్ సదస్సుకు మాత్రం దూరంగా ఉండబోతున్నారు. అమెరికా తీసుకున్న టారిఫ్ చర్యలపై షాంఘై సదస్సులో చర్చ జరిగిన విషయం తెలిసిందే. బ్రిక్స్ సదస్సులో కూడా ఈ అంశమే ప్రధానంగా చర్చకు రాబోతోంది. ఈ నేపథ్యంలో మోడీ దీనికి గైర్హాజరు కావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. బ్రిక్స్ సమావేశం సోమవారం వర్చువల్‌గా జరగబోతోంది. దీనికి భారత్ తరపున విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరవుతారు. ఈ భారీ సదస్సు నాయకుల స్థాయిలో జరుగుతోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ విలేకరులకు చెప్పారు. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలు విధించిన నేపథ్యంలో చైనా, రష్యా దేశాలతో సంబంధాలను విస్తృతం చేసుకోవాలని భావించిన ప్రధాని మోడీ షాంఘై సదస్సులో ఆయా దేశాల అధినేతలకు స్నేహహస్తాన్ని చాపారు. బ్రిక్స్ సదస్సుకు మోడీ ఎందుకు హాజరు కావడం లేదనే విషయంపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక వివరణ రాలేదు. షాంఘై సదస్సులో భారత్, రష్యా, చైనా దేశాల నేతలు కలివిడిగా వ్యవహరించడం ట్రంప్‌కు ఏ మాత్రం రుచించడం లేదు. భారత్, రష్యా దేశాలను చైనాకు కోల్పోయామని, ఆ మూడు దేశాల మైత్రి చిరకాలం వర్ధిల్లాలని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ట్రంప్ ఆగ్రహాన్ని కొంతమేరకైనా చల్లార్చడానికే బ్రిక్స్ సదస్సుకు మోడీ దూరంగా ఉంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాగా ట్రంప్ టారిఫ్ విధానంపై చర్చించడానికి బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా బ్రిక్స్ నేతల వర్చువల్ సదస్సును ఏర్పాటు చేశారు. బ్రిక్స్‌కు ప్రస్తుతం బ్రెజిల్ అధ్యక్షత వహిస్తోంది. చైనా, రష్యా, ఇరాన్ కూడా అందులో సభ్య దేశాలే. లూలా గత నెలలో మోడీతో టెలిఫోన్‌లో సంభాషించారు. ట్రంప్ విధించిన సుంకాల ప్రభావంపై ఇరువురు నేతలు చర్చించారు. వాణిజ్యం, ఇంధన రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు.

బీహార్‌లో సీట్ల సర్దుబాటుపై చిక్కుముడి

- బిజెపి కంటే ఒక్క సీటైనా ఎక్కువ ఇవ్వాల్సిందే : జెడియు

పాట్నా : బీహార్ శాసనసభ ఎన్నికలలో సీట్ల సర్దుబాటుకు సంబంధించి అధికార జెడియు–బిజెపి కూటమిలో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. చెరి సగం స్థానాలకు (100–105 సీట్లు) పోటీ చేయాలని రెండు పార్టీలు ఒక అవగాహనకు వచ్చినప్పటికీ తుది ఒప్పందం మాత్రం కుదరలేదు. సీట్ల సర్దుబాటులో బిజెపి కంటే కనీసం ఒక్క సీటైనా ఎక్కువ సాధించుకోవాలని జెడియు పట్టుదలగా ఉండడమే దీనికి కారణంగా కన్పిస్తోంది. సీట్ల సర్దుబాటుపై వచ్చే వారం తుది విడత చర్చలు జరుగుతాయని ఎన్డీఏ వర్గాలు తెలిపాయి. ఈ నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నిక ఓటింగుకు సంబంధించి ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు ఎన్‌డిఎ ఎంపీలు, సీనియర్ నేతలు ప్రస్తుతం న్యూఢిల్లీ చేరుకుంటున్నారు. సీట్ల సర్దుబాటుపై వారితో కూడా సంప్రదింపులు జరుపుతారు. 'మా పార్టీకి కేటాయించే స్థానాల కంటే కనీసం ఒక్క సీటైనా ఎక్కువ పొందాలని జెడియు కోరుకుంటోందని తెలిసింది. దీనివల్ల ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్‌కు ఉన్న ప్రజాదరణ, ఆయన సామర్ధ్యంపై బిజెపి నాయకత్వానికి ఉన్న నమ్మకం ఇనుమడిస్తాయి' అని బిజెపి సీనియర్ నేత ఒకరు చెప్పారు. 'నరేంద్ర మోడీ నేతృత్వంలో మేము లోక్‌సభ ఎన్నికల బరిలో దిగాము. అప్పుడు బిజెపి 17 స్థానాలకు పోటీ చేస్తే మేము 16 సీట్లలో పోటీ పడ్డాం. ఇప్పుడు నితీష్ కుమార్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపి శాసనసభ ఎన్నికలకు వెళుతున్నాం. కాబట్టి మాకు ఒక్క సీటైనా ఎక్కువ కేటాయించాలని కోరడం సమంజసమే' అని జెడియు సీనియర్ నేత ఒకరు తెలిపారు. అయితే ఇక్కడ ఓ సమస్య ఎదురవుతోంది. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) తనకు 40 సీట్లు కేటాయించాలని పట్టుపడుతోంది. ఈ పార్టీకి ప్రస్తుతం లోక్‌సభలో ఐదుగురు ఎంపీలు ఉన్నారు. కాగా చిరాగ్ పార్టీ కోరుతున్న స్థాయిలో సీట్లు కేటాయించేందుకు బిజెపి, జెడియు సుముఖంగా లేవు. మహా అయితే ఆ పార్టీకి 20 సీట్లకు మించి వదిలే ప్రశ్నే లేదని చెబుతున్నాయి. పైగా కూటమిలో భాగస్వాములుగా ఉన్న ఉపేంద్ర కుష్వాహ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌మంచ్, జితన్ రామ్ మంజ్హీ నాయకత్వంలోని హిందుస్థాన్ ఆవామ్ మోర్చా పార్టీలకు కూడా కొన్ని సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. 2020 శాసనసభ ఎన్నికలలో జెడియు 115, బిజెపి 110 స్థానాలకు పోటీ చేశాయి. అయితే బిజెపికి అత్యధికంగా 74 సీట్లు లభించగా జెడియుకు 43 మాత్రమే వచ్చాయి.


బీహార్‌లో జరిగిన ఓ సభలో మోడీ, నితీష్ కుమార్ (ఫైల్)

ముస్లింలపై పగబట్టి.. స్నేహితుడిగా వంచించి

- ముంబయి పేల్చివేస్తామంటూ మెసేజ్ పెట్టిన జ్యోతిష్యుడు
- ఎట్టకేలకు నొయిడాలో అరెస్టు



న్యూఢిల్లీ : ముస్లింలపై పగబట్టిన ఒక హిందూత్వవాది, నోయిడాకు చెందిన జ్యోతిష్యుడు తీవ్ర నేరానికి ఒడిగట్టాడు. ముస్లిం అయిన తన చిరకాల స్నేహితుడినే వంచనకు గురి చేసే అతడిని ఉగ్రవాదిగా ఇరికించేందుకు సదరు జ్యోతిష్యుడు కుట్ర పన్నారు. ముంబయిని పేల్చేస్తామంటూ సందేశాలు పంపాడు. దీనిపై పోలీసులు కూపీ లాగడంతో జ్యోతిష్యుడి బండారం బయటపడింది. పోలీసుల కథనం ప్రకారం..నొయిడాకు చెందిన జ్యోతిష్యుడు అశ్విని కుమార్ (51) ముంబయి పోలీసులకు ఆర్‌డిఎక్స్ బెదిరింపు మెసేజ్ పంపారు. అయితే ఈ మేసేజ్‌ను తన స్నేహితుడైన ఫిరోజ్ పేరిట ముంబయి ట్రాఫిక్ పోలీసు అధికారిక వాట్సాప్ నెంబరుకు ఈ మెసేజ్ పంపాడు. 400 కిలోల ఆర్‌డిఎక్స్‌తో 34 మానవ బాంబులు ముంబయి నగరంలోకి ప్రవేశించాయి. 34 వాహనాల్లో వాటిని పెట్టి మొత్తంగా నగరాన్ని పేల్చివేస్తారు అనేది ఆ సందేశం సారాంశం. ఫిరోజ్‌ను లష్కరే జిహాదీ సంస్థకు చెందిన ఉగ్రవాదిగా పోలీసులు భావించి కటకటాల పాల్జేస్తారనే దురుద్దేశంతోనే అశ్వినీ కుమార్ ఈ మేసేజ్ పంపినట్లు తెలుస్తోంది. 14 మంది పాక్ జాతీయులు భారత్‌లోకి ప్రవేశించారని కూడా చెప్పాడు. అయితే ఈ తప్పుడు సందేశం పంపినందుకు శనివారం తెల్లవారు జామున ముంబయి పోలీసులు నొయిడాలో కుమార్‌ను అరెస్టు చేశారు. పాట్నాకు చెందిన కుమార్ గత ఐదేళ్ల నుండి తల్లిదండ్రులతో కలిసి నొయిడాలో వుంటున్నాడు. అయితే 2023లో ఫిరోజ్ కారణంగా అశ్వినీ కుమార్ మూడు నెలలపాటు జైలుకెళ్లినట్లు సమాచారం. అప్పటి నుంచి అతడిపై ద్వేషం పెంచుకున్న కుమార్ ఈ చర్యకు పాల్పడ్డాడని పోలీసులు చెప్పారు. కుమార్ నుండి పోలీసులు ఏడు మొబైల్ ఫోన్లను,మూడు సిమ్ కార్డులను, ఆరు మెమరీ కార్డులను, రెండు డిజిటల్ కార్డులు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. వర్లి పోలీసు స్టేషన్‌లోకేసు నమోదైంది. క్రైం బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది.

అరుదైన బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో కేరళలో మరొకరు మృతి

తిరువనంతపురం : అరుదైన, ప్రాణాంతకమైన మెదడు ఇన్ఫెక్షన్‌తో కొజికోడ్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 45ఏళ్ళ వ్యక్తి మరణించాడని ఆరోగ్య శాఖాధికారులు శనివారం చెప్పారు. మృతుడిని వాయనాడ్‌కి చెందిన రాథేష్‌గా గుర్తించారు. హృదయ సంబంధమైన సమస్యలతో కూడా ఆయన బాధపడుతున్నారని వారు తెలిపారు. ఇదే వ్యాధి లక్షణాలతో కొజికోడ్ మెడికల్ కాలేజీలో 11మంది చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఆగస్టు మాసంలో బ్రెయిన్ ఫీవర్‌తో ముగ్గురు మరణించారు. ఈ మరణాల నేపథ్యంలో ఈ వ్యాధి చికిత్స కోసం కేరళ ఆరోగ్య శాఖ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. కలుషితమైన నీటిలో వుండే అమీబా వల్ల ఈ అరుదైన బ్రెయిన్ ఇన్ఫెక్షన్ వస్తుంది. కాలుష్య నీటిలో ఈదినా లేదా స్నానం చేసినా ఈ వైరస్ సోకే ప్రమాదముందని అధికారులు చెప్పారు.

భారత్‌తో బంధానికి ముప్పేమీ లేదు

- అమెరికా అధ్యక్షులు డొనాల్ట్ ట్రంప్ వ్యాఖ్యలు
- ప్రధాని మోడీపైనా ప్రశంసలు

వాషింగ్టన్ : రష్యా నుంచి చమురు కొనుగోలు, అమెరికా వస్తువులను తన మార్కెట్‌లోకి అనుమతించేందుకు నిరాక రించడం, చైనాతో స్నేహ సంబంధాలను కొనసాగించడం వంటి భారత్ చర్యలు అమెరికా అధ్యక్షులు డోనాల్ట్ ట్రంప్‌ను ఆగ్రహానికి గురి చేస్తున్న విషయం తెలిసిందే. భారత్‌ను చైనాకు కోల్పోయామంటూ ఆయన తాజాగా తన ట్రూత్ సోషల్ వేదికలో వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు వీటన్నింటికీ భిన్నంగా ట్రంప్ తన ఓవల్ కార్యాలయంలో పాత్రికేయులతో ముచ్చటిస్తూ భారత్, అమెరికా మధ్య ప్రత్యేక సంబంధం ఉన్నదని చెప్పారు. ఈ సంబంధాలకు విఘాతం కలుగుతుందంటూ వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. 'విచారించాల్సిన అవసరమే లేదు. కొన్ని సందర్భానుసారంగా అలా జరిగిపోతూ ఉంటాయి' అని ట్రంప్ తెలిపారు. ప్రధానితో తన వ్యక్తిగత బంధం చెక్కుచెదరకుండా అలాగే ఉండిపోతుందని చిరునవ్వుతో అన్నారు. 'మోడీతో నా స్నేహం ఎప్పుడూ కొనసాగుతూనే ఉంటుంది. ఆయన చాలా గొప్ప ప్రధాని. గొప్ప వ్యక్తి. మేము ఎప్పుడూ స్నేహితులమే. అయితే ఆయన ప్రస్తుతం చేస్తున్న పని నాకు నచ్చడం లేదు' అని చెప్పుకొచ్చారు. ట్రంప్ వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్ వెలుగు చూడగానే మోడీ వెంటనే దానిని తన ఎక్స్ ఖాతాలో కోట్ చేశారు.

మాస్కో నుంచి భారత్ నిరంతరం చమురును కొనుగోలు చేస్తుండడంపై ట్రంప్ మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రష్యా నుంచి భారత్ పెద్ద మొత్తంలో చమురును కొనుగోలు చేయడం నన్ను ఎంతగానో అసంతృప్తికి గురిచేసింది. ఆ విషయాన్ని వారికి తెలియజేశాను. మేము భారత్‌పై భారీ సుంకాన్ని విధించాం. యాభై శాతం టారిఫ్...చాలా ఎక్కువ సుంకం. మోడీతో నేను బాగానే ఉంటున్నాను. ఆయన చాలా గొప్ప వ్యక్తి. కొన్ని నెలల క్రితం ఇక్కడికి వచ్చారు' అని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై మోడీ స్పందిస్తూ ఆయన అభిప్రాయాలను, తమ సంబంధాలపై ఆయన సానుకూల అంచనాను గౌరవిస్తానని తెలిపారు. భారత్, అమెరికా దేశాలు సానుకూలమైన, ముందుచూపుతో కూడిన సమగ్ర, అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని మోడీ చెప్పారు.

నిర్విఘ్నం... నిమజ్జనం

- కన్నుల పండుగగా ఖైరతాబాద్ గణేష్ శోభాయాత్ర
- ప్రజలతో కిక్కిరిసిన ట్యాంక్‌బండ్ పరిసరాలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ భాగ్యనగరంలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగుతోంది. నవ రాత్రులు ప్రత్యేక పూజలందుకున్న గణనాధులు డప్పు దరువులు, జానపద కళాజాతాలు, తీన్మార్ ఆటలు, పాటలు.. నడుమ మండపాల నుంచి సాగరసంగమానికి తరలిరావడంతో ట్యాంక్‌బండ్ పరిసరాలు జనంతో కిక్కిరిసిపోయాయి. శనివారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన 59 అడుగుల ఖైరతాబాద్ బడా గణేష్ శోభాయాత్ర కన్నుల పండుగగా సాగింది. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఎన్‌టిఆర్ మార్గ్‌లోని బాహుబలి క్రేన్ పాయింట్ 4 వద్ద ఖైరతాబాద్ బడా వినాయకుడు సాగర్ ప్రవేశం చేశారు. ప్రసిద్ధ బాలాపూర్ గణపతిని రాత్రి ఏడు గంటల ప్రాంతంలో క్రేన్ నెంబర్ 12 వద్ద నిమజ్జనం చేశారు. బాలాపూర్ గణేష్ లడ్డును ఈసారి కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ అనే వ్యక్తి రూ.35 లక్షలకు దక్కించుకున్నారు.

సామూహిక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. 30 వేల మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. డిజిపి జితేందర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అన్ని ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హరిచందన, నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ ఏరియల్ సర్వే నిర్వహించారు. ఆదివారం ఉదయం వరకు నిమజ్జనం ముగుస్తుందని డిజిపి జితేందర్ తెలిపారు.


ట్యాంక్‌బండ్‌పై సిఎం సందడి

నిమజ్జనం వేళ ట్యాంక్‌బండ్‌పై సిఎం సందడి చేశారు. ముందస్తు సమాచారం లేకుండా సాదాసీదాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యక్ష కావడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. క్రేన్ నెంబర్ 4 వద్ద నిమజ్జనాలను సిఎం పరిశీలించారు. యాత్రికులు, సందర్శకులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని సిఎం విజ్ఞప్తి చేశారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి వేదికపై నుంచి యాత్రికులకు అభివాదం చేశారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ యాత్రికులతో కలిసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విధుల్లో పాల్గొన్న అన్ని విభాగాల సిబ్బందిని సిఎం అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

బంగారు కుటుంబాలు కుదింపు

తొలి, మలి విడత జాబితాల్లో రూపొందించిన బంగారు కుటుంబాల వివరాలు

జిల్లా	తొలివిడత ఎంపిక	తొలగించిన కుటుంబాలు	శాతం
కాకినాడ	1,65,510	1,51,467	91.5
ఏలూరు	1,26,875	1,04,232	82.2
వైఎస్‌ఆర్ కడప	1,00,875	78090	77.4
అనంతపురం	1,08,020	81,601	75.5
పశ్చిమగోదావరి	92,378	69,673	75.4
శ్రీసత్యసాయి	87,589	64,822	74
అంబేద్కర్ కోనసీమ	1,12,973	82,827	73.3
నంద్యాల	69,841	42,543	60.9
విజయనగరం	1,26,304	71,115	56.3
బాపట్ల	1,05,110	56,940	54.2
శ్రీకాకుళం	1,43,219	71115	56.3
కృష్ణా	1,09,241	56,940	51.7
అనకాపల్లి	1,18,026	60,515	51.3
చిత్తూరు	1,01,840	51,841	50.9
తిరుపతి	1,16,973	56050	47.9
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు	1,50,329	60,279	40.1
తూర్పుగోదావరి	97,429	36,771	37.7
కర్నూలు	1,15,994	36,965	31.9
ప్రకాశం	1,29,994	39,561	30.4
అన్నమయ్య	91,243	26,303	28.8
ఎన్‌టిఆర్	1,27,489	34,508	27.1
గుంటూరు	1,36,751	32,999	24.1
విశాఖపట్నం	1,16,174	21,495	18.5
పల్నాడు	1,36,332	21,105	15.5
పార్వతీపురం	82,411	6440	7.81
అల్లూరి	1,42,780	3092	2.17
మొత్తం	**30,11,480**	**14,24,050**	**47.3**

ఐఎఎస్ అధికారికి ఎన్‌సిపి నేత క్షమాపణ

ముంబయి : డిప్యూటీ సిఎం అజిత్ పవార్‌తో జరిగిన వివాదంలో ఐపిఎస్ అధికారిణి అంజనా కృష్ణకు వ్యతిరేకంగా చేసిన ట్వీట్‌ను నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌సి అమోల్ మిట్కారి శనివారం ఉపసంహరించుకున్నారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానంటూ ఆమెకు క్షమాపణ చెప్పారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేశారు. యుపిఎస్‌సి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఆమె విద్యార్హత, కుల ధృవీకరణ పత్రాలను చూపాలంటూ ఆయన అంతకుముందు ప్రశ్నించారు. "ఇదేమీ పార్టీ వైఖరి కాదు. నా వ్యక్తిగత అభిప్రాయం. నిజాయితీగా సేవలందించే మన పోలీసు బలగాలు, అధికారుల పట్ల నాకు చాలా గౌరవం వుంది. పార్టీ సీనియర్ నాయకత్వం తీసుకున్న వైఖరితో పూర్తిగా ఏకీభవిస్తున్నాను." అంటూ మిట్కారి శనివారం ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమంగా సాగుతున్న ఇసుక తవ్వకాలను ఆపేందుకు వెళ్ళిన ఆమెపై డిప్యూటీ ముఖ్యమంత్రి, ఎన్‌సిపి అధ్యక్షుడు అజిత్ పవార్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. తక్షణమే అక్కడ పనులు ఆపేయాలని ఫోన్లో ఆదేశించారు. దీనిపై వివాదం రేగిన విషయం తెలిసిందే.

వెనిజులాపై దాడులకు అమెరికా యత్నాలు

- ఎఫ్–35 యుద్ధ విమానాల మోహరింపు

వాషింగ్టన్ : వెనిజులాలో మాదక ద్రవ్యాల వ్యాపారం చేసే వారిపై పోరాడే పేరుతో ఎఫ్–35 యుద్ధ విమానాలను పుయర్టో రికోలో మోహరించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ ఆదేశించారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై ఒత్తిడి పెంచడానికి ట్రంప్ ఈ ఎత్తుగడ పన్నారని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే పది యుద్ధ విమానాలను పుయర్టో రికో వైమానిక క్షేత్రానికి పంపడం జరిగిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లాటిన్ అమెరికాకు చెందిన మాదక ద్రవ్యాల వ్యాపారులు వెనిజులాలో కార్యకలాపాలు సాగిస్తున్నారని అమెరికా ఆరోపిస్తోంది. ఈ వ్యాపారులను 'నార్కో–ఉగ్రవాద' సంస్థలుగా చూపుతోంది. వెనిజులా భూభాగంలో మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేసే ముఠాలపై దాడులు చేయాలని ట్రంప్ ప్రభుత్వం యోచిస్తోందని సీఎన్‌ఎన్ వార్తా సంస్థ తెలిపింది.వెనిజులాలోనూ, మొత్తంగా లాటిన్ అమెరికాలోనూ హింసకు ఆజ్యం పోసే ప్రయత్నాలకు స్వస్తి చెప్పాలని అమెరికాను మదురో హెచ్చరించారు. సార్వభౌమత్వాన్ని, శాంతి హక్కును, స్వతంత్రతను అమెరికా గౌరవించాలని హితవు పలికారు. 'నేను ట్రంప్‌ను గౌరవిస్తాను. మా మధ్య విభేదాలు సైనిక ఘర్షణకు దారితీయకూడదు' అని అభిప్రాయపడ్డారు. చర్చలకు వెనిజులా ఎప్పుడూ సిద్ధమేనని తెలిపారు. ఒకవేళ వెనిజులాపై దాడి జరిగితే అది వెంటనే సాయుధ ఆందోళనకు దారితీస్తుందని మదురో ఈ వారం ప్రారంభంలోనే చెప్పారు. అయితే వెనిజులాలో అధికార మార్పిడి గురించి అమెరికా మాట్లాడడం లేదని ట్రంప్ అన్నారు. అక్కడ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని మాత్రమే కోరుకుంటోందని తెలిపారు. వెనిజులా ప్రాదేశిక జలాల వెలుపల అమెరికా ఇప్పటికే యుద్ధ విమానాలను, నౌకాదళ సిబ్బందిని, అణుశక్తితో అత్యంత వేగంగా దాడి చేయగల జలాంతర్గాములను మోహరించింది. కాగా తన క్షిపణి విధ్వంసక యూఎస్‌ఎస్ జాసన్ దన్‌హామ్ సమీపంలో ఎగిరేందుకు వెనిజులా రెండు ఎఫ్–16 ఫైటర్ విమానాలను పంపి కవ్వింపు చర్యలకు పాల్పడిందని అమెరికా ఆరోపించింది. వెనిజులా జెట్ విమానాలు తమ నౌకలకు హాని కలిగిస్తాయని షిప్ కమాండర్లు భావిస్తే వాటిని కూల్చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామని ట్రంప్ చెప్పారు.

విద్యార్థులపై పిడిగుద్దులు

(మొదటిపేజీ తరువాయి)

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేపట్టిన యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక విద్యార్థుల సమస్యల గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యారంగంలో చాలా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, పి రామ్మోహన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు శిథిలావస్థలో ఉన్నాయని, కనీస మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. మెస్, కాస్మోటిక్ చార్జీలను పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూనివర్సిటీల్లో విసిలు, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని పేర్కొన్నారు. ఎయిడెడ్ వ్యవస్థకు గుదిబండగా ఉన్న 35, 36, 42 జీవోలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


పోలీసుల దాడిలో గాయపడిన విద్యార్థినిని ఆసుపత్రిలో పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలు

విద్యార్థులను పరామర్శించిన సిపిఎం కార్యదర్శి శ్రీనివాసరావు

పోలీసుల దాడిలో గాయపడ్డ విద్యార్థులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు పరామర్శించారు. సింగ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కావ్య, యశస్వి, ఉమాలను వారు పరామర్శించారు. మంత్రికి వినతిపత్రం ఇచ్చేందుకు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి, విద్యార్థినుల పట్ల అమానుషంగా వ్యవహరించడం, పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడాన్ని వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. గాయపడిన విద్యార్థులను పోలీసులు ఆస్పత్రిలో చేర్చేందుకు కూడా తాత్సారం చేసి నిర్దయగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేసి, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, నాయకులు రమణ, సత్యబాబు తదితరులు విద్యార్థులను పరామర్శించారు.

బాక్సైట్ ప్రాజెక్టుకు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టుకు ఆమోదం తెలిపేముందు వీరి సమ్మతి కచ్చితంగా తీసుకోవాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది.

స్థానిక గిరిజనం చెబుతున్నదేమిటి?

2023 డిసెంబరు 8న గ్రామసభ నిర్వహించినట్లు, అందులో తమ ప్రాజెక్టుకు ఆదివాసీలు ఆమోదం తెలిపినట్లు వేదాంత తప్పుడు పత్రాలు సృష్టించిందని, తమ సంతకాలను ఫోర్జరీ చేసిందని స్థానికులు విమర్శించారు. రాయగడ జిల్లాలోని కాశీపుర్ బ్లాక్‌లో ఉన్న పలాసగూడ నుంచి గిరిజనేతరులను ఇక్కడకు తీసుకొచ్చారని, వారితోనే గ్రామసభను నిర్వహించారని ఈ ప్రాంతానికి చెందిన 'భూమి, ప్రకృతి వనరుల పరిరక్షణ సమితి' నాయకులు సుభా సింగ్ మాఝి విమర్శించారు. ఇదే రీతిలో రాయగడ, కలాహండి జిల్లాల్లో 10 గ్రామాల్లో బూటకపు గ్రామసభలు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామసభల్లో స్థానిక గిరిజనులే పాల్గొన్నట్లుగా నమ్మించేందుకు వారి సంతకాలను సైతం ఫోర్జరీ చేసినట్లు మాఝి తెలిపారు. కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న యువత వేలిముద్రలు వేసినట్లు ఆయా పత్రాల్లో ఉన్నాయని, వేదంత వంచనకు ఇంతకంటే రుజువులు ఇంకేం కావాలని ఆయన పేర్కొన్నారు.

స్థానికుల ఆందోళనలు పరిగణనలోకి తీసుకోవాల్సిందే

వేదాంత కుట్రలపై స్థానిక ఆదివాసీలు హైకోర్టును ఆశ్రయించడంతో ఆదివాసీల ఆందోళనలు పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరిందం సిన్హా, జస్టిస్ ఎంఎస్ సాహూతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి ఈ ఏడాది మార్చి 5న ఆదేశాలు జారీ చేసింది. వేదాంత ప్రతిపాదించిన ప్రాజెక్టుకు అనుమతి విషయంలో స్థానిక గిరిజనుల సమ్మతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని, అనుమతి ఇచ్చే అంశాన్ని పరిశీలించే ముందు వారి ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని ధర్మాసనం నిర్దేశించింది. ఈ నేపథ్యంలో వేదాంత ప్రతిపాదిత ప్రాజెక్టుకు అటవీ అనుమతుల జారీకి బ్రేకులు వేస్తూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు చెందిన అటవీ సలహా మండలి (ఎఫ్‌ఎసి) నిర్ణయం తీసుకుంది. అంతకు ముందు ఇదే అంశంపై ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ మాంఝి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఆపేయాలని కోరుతూ ఎఫ్‌ఎసికి ఈ ఏడాది జులై 30న ప్రతిపాదనలు పంపింది. కాగా ఈ అంశంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎఫ్‌ఎసి.. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

జీవన సౌరభం

మంచిని ప్రోత్సహించడమే కాదు, చెడును కూడా నిరోధించినప్పుడే సమాజంలో మార్పు సాధ్యం.

మీ కోసం

వాడిన టీపొడిని మరొకసారి నీటిలో మరిగించి, ఆ నీటితో అద్దాలు, గాజు పాత్రలు తుడిస్తే అవి బాగా మెరుస్తాయి.



చదువు విలువ



వాలాపూర్ అనే గ్రామంలో ప్రసాద్, సీత జీవిస్తున్నారు. వాళ్లకి శివ అనే కొడుకు ఉన్నాడు. శివ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. శివ చదువుతోపాటుగా తండ్రికి పనులలో ఆసరాగా ఉండేవాడు. అయితే కొడుకు చదువుకోవడం తండ్రి ప్రసాద్‌కు ఇష్టం ఉండదు. తనలా పనిచేస్తే పది రూపాయలు ఎక్కువ వస్తాయి కదా అనుకునేవాడు. కానీ శివ మాత్రం పని చేస్తూ చదువుకునేవాడు.

ఒకరోజు ప్రసాద్ తన కొడుకును పిలిచి 'చదువుకుంటే ఏం లాభం? స్కూలుకి వెళ్లడం మానేసి పని చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయి' అని గట్టిగా అరిచాడు. 'చదువుకుంటే ఉద్యోగమే కాదు, విజ్ఞానం వస్తుంది. సమాజంలో జరిగే మంచీ, చెడుపై అవగాహన వస్తుంది. వివేకం, విజ్ఞానం వున్న మనిషి ఉన్నతంగా ఎదుగుతాడు. ఆ దారిలో మరికొంతమందిని నడిచేలా చేస్తాడు' అని మా మాస్టర్ చెప్పారు నాన్న. అందుకే నేను బాగా చదువుకుంటాను' అని బతిమాలుతూ శివ చెప్పాడు.

కొడుకు మాటలు విన్న ప్రసాద్ తన తప్పును తెలుసుకున్నాడు. కష్టమైనా శివను చదివించాలని అనుకున్నాడు. శివ కూడా బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం తెచ్చుకొన్నాడు. మంచి వ్యక్తిగా ఎదిగాడు. కొడుకుని చూసి ప్రసాద్ ఎంతో సంతోషించాడు.



- గొల్ల నవ్య,
10వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హవేళి,
ఘణపురం, మెదక్ జిల్లా.

సరైన పదాలు రాయండి


పిల్లలూ, బొమ్మను చూసి కింది గళ్లల్లో సరైన పదం రాయండి.

1 --- చెట్టుపై ఉన్నది

2 పండ్లు ---లో ఉన్నాయి

3 ---- పండు తియ్యన







నేను గీసిన బొమ్మ





తత్తుల్య,
7వ తరగతి,
సెయింట్ జోసెఫ్స్ ఇంగ్లీషు స్కూలు,
ఎన్ఆర్ పేట,
కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



బోధన, సృజనాత్మక కళలు రెండు కళ్లుగా...

పర్యావరణ పరిరక్షణ కోసం ఆయన నిరంతరం పాటుపడతారు. వాయు, నీరు, భూమి, శబ్ద కాలుష్య కారకాలను ఆపేయాలంటూ కోరతారు. వాటి తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యామ్నాయాలను పాటించాలని సూచనలు చేస్తుంటారు. అవకాశం వచ్చిన వేదికలపై వాతావరణ మార్పులపై గళం విప్పుతారు. గ్లోబ్ వార్మింగ్, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, భూకంపాలు, వరదలు, ఓజోన్ పొర క్షీణత, వివిధ రకాలైన వ్యాధులు-జన్యుపరివర్తన, ఆమ్ల వర్షాలు తదితర పరిణామాలపై వివరిస్తారు. చెట్లను పెంచటం, ప్లాస్టిక్ వాడకం తగ్గించటం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం, రసాయనాల వాడకాన్ని తగ్గించటం గురించి చెబుతారు. సృజనాత్మక కళారూపాల్లో విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నిరంతరం పాటుపడుతుంటారు. ఆయనే కాట్రపాటి వెంకట సాయి దుర్గాప్రసాద్.



గుంటూరుకు చెందిన కె.వెంకట సాయి దుర్గాప్రసాద్ వృక్షశాస్త్ర నిపుణులు. ఎంఎస్సీ, (సైటోజెనెటిక్) పిహెచ్‌డి పూర్తిచేశారు. ఇంటర్మీడియట్, డిగ్రీ చదివిన హిందూ కళాశాలలోనే వృక్షశాస్త్ర అధ్యాపకులుగా నాలుగు దశాబ్దాల పాటు పనిచేస్తున్నారు. ప్రస్తుతం వైస్ ప్రిన్సిపల్‌గా తన సేవలు అందిస్తున్నారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా అంతర్జాతీయ ఘన వ్యర్థాలపై నిర్వహణపై గుజరాత్‌లో జరిగిన వర్క్‌షాపునకు హాజరయ్యారు. అంతర్జాతీయ



జర్నళ్లలో పర్యావరణ పరిరక్షణ అంశాలపై 10 పరిశోధనా పత్రాలు సమర్పించారు. దేశ, విదేశాల్లో జరిగిన జాతీయ సెమినార్లు, వర్క్‌షాపులకు హాజరయ్యారు. మాలిక్యులర్ బయాలజీపై మద్రాస్ ఐఐటి ఓఎతో కలిసి మూడురోజులపాటు జాతీయస్థాయి లెక్చరర్ వర్క్‌షాపు, ఆయుష్ సహకారంతో ఔషధ మొక్కలపై జాతీయ సింపోజియం నిర్వహించారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డుతో కలిసి పర్యావరణంపై సెమినార్, మరికొన్ని వెబినార్లు నిర్వహించారు. పలు ఓరియెంటేషన్ కార్యక్రమాలకు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఎఎన్‌యు ప్రాక్టికల్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా పనిచేశారు. ఎఎన్‌యు, ఇతర స్వయంప్రతిపత్తి కళాశాలల బిఒఎస్ సభ్యుడు, డిగ్రీ పరీక్షల పేపర్ సెట్టర్‌గా పనిచేశారు. ఎఎన్‌యు దూర విద్య, ఇతర ప్రచురణలకు పుస్తకాలు రాశారు. జవహర్ నవోదయ పాఠశాలలకు విద్యా సలహాదారుగానూ, ఎపి ఇంటర్మీడియట్ బోర్డు సబ్జెక్టు నిపుణులుగానూ, వివిధ సంస్థలకు వృక్ష శాస్త్రాల్లో విద్యా సలహాదారుగా ఉన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. సిసిఇ ద్వారా జిల్లా, జోనల్ సాంస్కృతిక, రెడ్ రిబ్బన్ జిల్లా సమన్వయ కర్తగానూ, జిల్లా, రాష్ట్రస్థాయి క్రికెట్ అసోసియేషన్లలో కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. ఎపిఒఎస్ఎస్, ఎఎన్‌యు, ఎంఎస్‌సి టెక్ట్స్‌బుక్స్‌ను రాశారు. పోటీ పరీక్షల కోసం ఆబ్జెక్టివ్ వృక్షశాస్త్రం, మైక్రో బయాలజీ, ఎంఎస్‌సి, బిఒఎస్ఐ, ఎంసెట్ కోసం పదార్థంపై రచనలు చేశారు.

లలిత కళలపైనా అపారమైన ఆసక్తి

'సమాజాన్ని చైతన్యం వైపుగా నింపేది కళారూపాలే. కళలపై పిల్లలకు ఆసక్తిని పెంపొందించటం ద్వారా లలిత కళల పరిరక్షణను తన శ్వాసగా భావిస్తారు. చిత్రలేఖనం, నృత్యం, సంగీతం, రంగస్థల ప్రదర్శనలు వంటి కళలను విద్యార్థుల్లో పెంపొందించడం, వారికి కొత్త దారులు చూపడం ఆయన జీవన ధ్యేయంగా మార్చుకున్నారు. హిందూ కళాశాలలోని ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నో సంవత్సరాలు పనిచేసి, కళాశాలకు విశిష్టమైన గుర్తింపును తెచ్చారు. ఈ కళాశాల నుంచి కళాతపస్వి కె.విశ్వనాథ్, సంగీత దర్శకుడు చక్రవర్తి, నటసార్వభౌముడు గుమ్మడి వెంకటేశ్వరరావు వంటి మహోన్నత కళాకారులు ఇక్కడ విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన వారే. వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థుల్లో కళాచైతన్యాన్ని పెంపొందించేం దుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు. ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ యువజనోత్సవంలో కళాశాలకు ఓవరాల్ చాంఫియన్‌షిప్ సాధించారు. సిజిడబ్ల్యు ద్వారా గుంటూరులో రెండురోజుల థియేటర్ ఆర్ట్స్ వర్క్‌షాపు నిర్వహించారు. పలు అంతర కళాశాలల సాంస్కృతిక పోటీల నిర్వహణకు సారథ్యం వహించారు. కళాశాల వార్షికోత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, క్షేత్రస్థాయి పర్యటనలు, గార్డెన్ పార్టీలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు క్రమం తప్పకుండా జరిగేలా ప్రోత్సహిస్తున్నారు. సిసిఇ ద్వారా ఉత్తమ జోనల్ కల్చరల్ కోఆర్డినేటర్‌గా అవార్డు అందుకున్నారు.

థియేటర్ ఆర్ట్స్ ద్వారా ఏకపాత్రాభినయంలో ఆర్యండకాండ, సజీవతైలం, సమైక్య ఆంధ్ర, దీర్ఘాయుష్మాన్, పునరంకితం, యాదేవీ సర్వభూతేసుతో పాటుగా డిసెంబర్ 1వ తేదీ (వన్ యాక్ట్ ప్లే), భేతాళ కథలు (ఏకనాటకం), జంతూనం నానాజన్మ దుర్లభం (మైమ్), లలిత కళామతల్లి (మోనోయాక్షన్) ప్రదర్శనలు ఏర్పాటు చేయించారు. జీవ వైవిధ్యం (నాటకం), శుభారంభం, బహురూపి (ఏకపాత్ర నాటకం)లకు



దర్శకత్వం వహించారు. సితార సంగీత వాయిద్యాన్ని హృద్యంగా వాయించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. సుమారు 20 వరకూ విద్య, వినోద, వైజ్ఞానిక విహార యాత్రలకు నేతృత్వం వహించారు.

సమాజ రుగ్మతలపైనా...

పర్యావరణ పరిరక్షణతోపాటుగా మారుతున్న సమాజ పరిస్థితులకు అద్దంపట్టేలా పలు కళారూపాల ప్రదర్శనలను ప్రోత్సహిస్తున్నారు. విద్య, వైద్యరంగం వంటివాటిలో కార్పొరేట్‌తో పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు కారణాలు పట్టిచూపుతూ ప్రదర్శనలు, మార్కెట్లో గిట్టుబాటు ధరలు రాక రైతులు, కౌలురైతుల బలవన్మరణాలు, మహిళలపై లైంగిక వేధింపు వంటి అంశాలపై ప్రదర్శిస్తున్న కళారూపాలకు విశేష ఆదరణ లభిస్తోంది. అంతరించిపోతున్న జానపద కళలు, మహమ్మారి వ్యాధులు వంటి సమకాలీన సమస్యలపై స్కిట్లు, మైము, ఏకాంకికల రూపంలో ప్రదర్శింపజేసి ఆయన విశేషమైన ప్రశంసలు, బహుమతులు పొందారు. విద్యార్థినీ విద్యార్థులు అద్భుత కళారూపాలను ఆవిష్కరిస్తున్నారు. రంగస్థల శిక్షణా శిబిరాలను కూడా పలు మార్లు నిర్వహించారు.

అత్యుత్తములుగా తీర్చిదిద్దుతున్నాం...

సమాజం పట్ల బాధ్యతాయుతంగా విద్యార్థినీ విద్యార్థులు ఉండేలా ప్రోత్సహిస్తూ తీర్చిదిద్దుతున్నాం. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కృషిచేసేలా ప్రోత్సహిస్తున్నాం. లలిత కళల పట్ల ఆసక్తిని పెంపొందించటం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తున్నాం. సమగ్ర వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తీర్చిదిద్దుతున్నాం.

- కాట్రపాటి వెంకట సాయి దుర్గాప్రసాద్

- యడవల్లి శ్రీనివాసరావు

'సైమా 2025' తెలుగు విజేతలు వీరే



సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (ఎస్ఎస్ఐఎం) 2025 వేడుకలు దుబాయ్‌లో గ్రాండ్‌గా జరిగాయి. దుబాయ్ ఎగ్జిబిషన్ సెంటర్, ఎక్స్‌పో సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలిరోజు తెలుగు చిత్రాలకు అవార్డులు అందజేశారు. ఈ వేడుకలో టాలీవుడ్ నటీనటులు హాజరయ్యారు. సైమా అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా 'కల్కి' ఎంపికైంది. ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ దర్శకుడిగా సుకుమార్ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ దర్శకుడు(క్రిటిక్స్)గా ప్రశాంత్ వర్మ, ఉత్తమ నటుడు(క్రిటిక్స్)గా తేజ సజ్జా అవార్డులు అందుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. **ఉత్తమ నటి :** రష్మిక మందన్నా, **ఉత్తమ నటి (క్రిటిక్స్) :** మీనాక్షి చౌదరి, **ఉత్తమ సహాయ నటుడు :** అమితాబ్ బచ్చన్, **ఉత్తమ సహాయ నటి :** అన్నే బెన్, ఉత్తమ సంగీత దర్శకుడు : దేవి శ్రీ ప్రసాద్ (డీఎస్పీ), **ఉత్తమ గీతరచయిత :** రామజోగయ్య శాస్త్రి, **ఉత్తమ గాయకుడు :** శంకర్ బాబు కందుకూరి, **ఉత్తమ గాయని :** శిల్పా రావు, **ఉత్తమ ప్రతినాయకుడు :** కమల్ హాసన్, **ఉత్తమ పరిచయ నటి :** పంకూరి, భాగ్యశ్రీ బోర్స్, ఉత్తమ పరిచయ నటుడు : సందీప్ సరోజ్, **ఉత్తమ పరిచయ దర్శకుడు :** నంద కిషోర్ యేమని, **ఉత్తమ కొత్త నిర్మాత :** నిహారిక కొణిదెల, **ఉత్తమ సినిమాటోగ్రాఫర్ :** రత్నవేలు, **ఉత్తమ హాస్యనటుడు :** సత్య




'మిరాయ్' నుంచి 'అంగమబలి'..

తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటించిన 'మిరాయ్' నుండి తాజాగా జగపతిబాబు పోస్టర్ విడుదల చేశారు. ఈ సినిమాలో ఆయన పాత్ర పేరు 'అంగమ బలి'గా ఉండనుంది. ఈ చిత్రంలో మంచు మనోజ్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. రితికా నాయక్, శ్రియా శరణ్, జయరాం వంటి ప్రముఖ నటులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. గౌరహరి సంగీతం అందించగా, పీపుల్ మీడియా సంస్థ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. సెప్టెంబరు 12న థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుండి యు/ఎ పొందింది.

సామాజిక స్వభావమే 'ఘాటీ'

చిత్ర కథా రచయిత చింతకింది శ్రీనివాసరావు



'సామాజిక స్వభావంలో మార్పు వస్తేనే ప్రజా సమూహం ప్రగతిపథంలో పయనిస్తుంది. మనిషి కేంద్రంగా నడిచే సమాజం మానవత్వంతో వ్యవహరించినప్పుడే సత్ఫలితాలు లభిస్తాయి. తూర్పు కొండల్లో సాగుతున్న గంజాయి సేద్యాన్ని సామాజిక సమస్యగా భావించాల్సిన అవసరం ఉంది. ఆ రకమైన దృక్కోణాన్ని సమాజానికి అందించే ప్రయత్నం మా ఈ 'ఘాటీ' చిత్రం ద్వారా చేశాం. సుప్రసిద్ధ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తన ప్రతిభ, మేధా శక్తితో చిత్రాన్ని తూర్పు కనుమల స్థాయికి తీసుకెళ్లారు. చిత్ర కథానాయిక అనుష్క, కథానాయకుడు విక్రమ్ ప్రభు గంజాయి సమస్యను కళ్లకు కట్టినట్లుగా తమ అభినయంతో వెల్లడించారు. సాహితీ రంగంలో రచయితగా కొనసాగుతున్న నన్ను 'అరేబియా కడలి' వెబ్ సిరీస్ ద్వారా తెలుగు తెరకు క్రిష్ పరిచయం చేశారు. అంతేకాదు, ఆ సిరీస్‌లో ముఖలింగం అనే ప్రధాన పాత్ర ద్వారా నన్ను నటుడిగా చేశారు. ఇప్పుడు 'ఘాటీ' చిత్ర కథకుడుగా వెండితెరకు చేరువ చేశారు. ఇందుకుగాను క్రిష్ జాగర్లమూడికి హృదయ పూర్వక కృతజ్ఞతలు. ఈ నెల ఐదోతేదీన విడుదలైన 'ఘాటీ' సినిమాకు ప్రేక్షకుల ఆదరణ బాగా ఉండటం ఎంతో సంతోషానిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని మంచి కథలు రాయటానికి దోహదపడుతోంది. స్థానికతతో ఉన్న సినిమాలకూ, సామాజిక రుగ్మతలపై తీసిన సినిమాలు ఇటీవలకాలంలో మంచి ప్రజాదరణ పొందుతున్నాయి. గంజాయి వికృత రూపాలను ఈ సినిమా ద్వారా మేము సమాజం ముందుకు తెచ్చాం. యువత సన్మార్గంలో పయనించటానికి ఈ సినిమా దోహద పడుతుందనే నమ్మకం ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ ద్వారా నిజ మైంది. ఆంధ్రా, ఒరిస్సా బోర్డర్‌లో శీలావతి గంజాయి రకం పెరుగుతుంది. దీనికి ప్రపంచ వ్యాప్తంగా చాలా డిమాండ్ ఉంది. వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంటుంది. దానికోసం ఒక వ్యవస్థ పని చేస్తుంటుంది. గంజాయి బస్తాలను మోయడానికి కొంతమంది కూలీలు ఉంటారు. ఇతంతా ప్రపంచానికి చూపించేందుకే ఈ కథను క్రిష్‌కు చెప్పా. క్రిష్ ఎంతో అద్భుతంగా ఈ సినిమాను తెరకెక్కించారు. భవిష్యత్తులో మరిన్ని సమాజ హితమైన కథలతో సినిమాలు వచ్చేందుకు నా వంతుగా కృషిచేస్తా' అని ప్రఖ్యాత రచయిత, ఘాటీ సినిమా కథకుడు చింతకింది శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. కళింగాంధ్ర కథా బలాన్ని ప్రపంచానికి తెలియజేసిన చింతకింది రచనలు సాహితీ రంగంలో స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. 'మున్నీటి గీతలు' వంటి ఆయన రచనలు సామాజిక మార్పు కోసం పరితపించాయి. తాజాగా చింతకింది రాసిన కథ-ఘాటీ చిత్రంగా ఒకనొక సామాజిక సమస్యను తెలుగు సినిమా తెరమీదకు తీసుకొచ్చింది. శుక్రవారం విడుదలైన ఈ సినిమాతో గంజాయి మహమ్మారిపై చర్చలు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. అవన్నీ ఫలవంతం కావాలని మనమంతా కోరుకుందాం.

ఫైనల్‌కు భారత్

- నేడు స్వర్ణ పతకానికి కొరియాతో ఢీ
- చైనా, మలేషియా మధ్య కాంస్య పతక పోరు
- ఆసియాకప్ హాకీ



రాజ్‌గిర్(బీహార్): ఆసియా కప్ హాకీ ఫైనల్లోకి భారతజట్టు దూసుకెళ్లింది. శనివారం జరిగిన నిర్ణయాత్మక చివరి సూపర్-4 మ్యాచ్‌లో భారత్ 7-0తో చైనాపై ఘన విజయం సాధించింది. తొలి రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి 3-0 ఆధిక్యతలో నిలిచిన భారత్.. మూడో క్వార్టర్‌లో రెండు, నాల్గో క్వార్టర్‌లో మరో రెండు గోల్స్ కొట్టి సత్తా చాటింది. సూపర్-4లో భాగంగా తొలి లీగ్ మ్యాచ్‌లో ఐదుసార్లు ఛాంపియన్ కొరియాతో మ్యాచ్‌ను 2-2తో డ్రా చేసుకొని నిరాశపరిచిన భారత్.. రెండో లీగ్ మ్యాచ్‌లో మలేషియాపై 4-1గోల్స్‌తో విజయం సాధించింది. నిర్ణయాత్మక మూడో, చివరి సూపర్-4 మ్యాచ్‌లో ఏకంగా 7-0తో చైనాను చిత్తుచేసి అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. ఇక చివరి సూపర్-4 లీగ్ మ్యాచ్‌లో కొరియా జట్టు 4-3గోల్స్ తేడాతో మలేషియాను చిత్తుచేసింది. దీంతో కొరియా జట్టు 4పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. చైనా, మలేషియా మూడేసి పాయింట్లతో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఈ జట్ల మధ్య కాంస్య పతక పోరు, భారత్-కొరియా జట్ల మధ్య స్వర్ణ పతక పోరు ఆదివారం జరగనుంది.

జపాన్‌తో అమ్మాయిలు డ్రా..

హాంగ్జౌ వేదికగా జరుగుతున్న ఆసియాకప్ హాకీలో భారత మహిళలజట్టు పటిష్ట జపాన్‌ను నిలువరించింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో నాల్గో క్వార్టర్ చివర్లో భారతజట్టు ఒక గోల్ చేసి డ్రాతో సరిపుచ్చుకుంది. తొలి క్వార్టర్ 10వ ని.లో జపాన్ జట్టు తొలి గోల్ కొట్టి 1-0 ఆధిక్యతలో నిలిచింది. రెండో క్వార్టర్‌లో భారత్ గోల్ చేయడంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి 1-1 గోల్స్‌తో సమంగా ఉన్నాయి. ఇక రెండో అర్ధభాగంలో ఇరుజట్లు ఆధిక్యత కోసం తీవ్రంగా పోటీపడ్డాయి. మూడో క్వార్టర్‌లో ఏ జట్టూ గోల్ చేయలేదు. నాల్గో క్వార్టర్‌లో చివరి ఐదు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా జపాన్ ఒక గోల్ కొట్టి 2-1గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో చివరి సెకన్లలో భారత్ గోల్ చేయడంలో అభిమానులు కేరింతలతో స్టేడియం మార్మోగింది. గ్రూప్-బి తొలి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు 11-0గోల్స్ తేడాతో థాయ్‌లాండ్‌ను చిత్తుచేసిన సంగతి తెలిసిందే. ఇక జపాన్ జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో సింగపూర్‌పై 9-0తో గెలిచింది. చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు సింగపూర్‌తో తలపడనుంది.

సూపర్-4 పాయింట్ల పట్టిక

వ.స.	జట్టు	మ్యా.	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	గో.వ్య.	పా
1.	భారత్	3	2	1	0	13	3	10	7
2.	కొరియా	3	1	1	1	6	8	-2	4
3.	మలేషియా	3	1	0	2	6	8	-2	3
4.	చైనా	3	1	0	2	3	9	-6	3

మళ్లీ వాళ్లిద్దరే..

యుఎస్ ఓపెన్ ఫైనల్‌కు సిన్నర్, అల్కరాజ్
సెమీస్‌లో ఓడిన జకోవిచ్, అగర్



న్యూయార్క్: టాప్‌సీడ్ జెన్నిక్ సిన్నర్, 2వ సీడ్ కార్లోస్ అల్కరాజ్ మరో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లోకి దూసుకెళ్లారు. 2025 ఏడాదిలో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో తలపడిన వీరు.. వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో తలపడనున్నారు. శనివారం తెల్లవారుజామున జరిగిన సెమీఫైనల్లో సిన్నర్ 25వ సీడ్, కెనడాకు చెందిన అగర్ అలియాస్సిమ్‌ను, మరో సెమీస్‌లో అల్కరాజ్.. 7వ సీడ్, 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్‌ను ఓడించాడు. తొలి సెమీస్‌లో ఇటలీకి చెందిన సిన్నర్ 6-1, 3-6, 6-3, 6-4తో అగర్‌ను ఓడించాడు. దీంతో ఈ ఏడాది వరుసగా నాల్గో గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరుకున్నాడు. 2025లో ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను సిన్నర్ చేజిక్కించుకున్నాడు. రెండో సెమీస్‌లో యువ ఆటగాడు, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్ జోరు ముందు సీనియర్ ఆటగాడు నొవాక్ జకోవిచ్ నిలువలేకపోయాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ 6-4, 7-6(7-4), 6-2తో ముగించి రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన జకోవిచ్‌కు మరోసారి అడ్డుగా నిలిచాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68